02-3Pg1exHMNWJQE.qxd:02-3Pg1exHMNWJQE.qxd 1/1/02 7:05 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

విశాఖపట్నం : fb.com/vaartha Digital

Published from Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

2-3-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 30 పేజీలు: 16 వెల: 6.50




## సూపర్-8లో విండీస్‌పై భారత్ గెలుపు

సెమీస్‌లోకి అడుగిడిన టీమిండియా

5న వాంఖడేలో ఇంగ్లండ్‌తో తలపడనున్న భారత్

ఆటలో



ఆదివారం అమెరికా, ఇజ్రాయెల్ దళాల క్షిపణిదాడులకు భస్మీపటమవుతున్న ఇరాన్‌లోని పలునప్రాంతాలు



# ఖమేనీ ఖతం



ఖమేనీ నివాసం పూర్తిగా నేలమట్టం

ఇరాన్ ప్రజలకు మహోపకారం చేశామన్న ట్రంప్

తాజా పరిణామాలతో పశ్చిమాసియా అల్లకల్లోలం

ఎటు చూసినా డ్రోన్‌లు, మిస్సైళ్లు, బాంబు పేలుళ్లతో జనం హాహాకారాలు

ప్రతీకారం తీర్చుకొంటామన్న ఇరాన్

అంతు చూస్తామని ట్రంప్ తీవ్ర హెచ్చరిక

ఇరాన్ రక్షణమంత్రి, మరో ఐదుగురు కమాండర్లనూ హతమార్చిన అమెరికా, ఇజ్రాయెల్ దళాలు

ఇరాన్ తాత్కాలిక సుప్రీం లీడర్‌గా అలీ రెజా అరాఫీ 2లో

**టెహ్రాన్, మార్చి 1:** ఇరాన్ సుప్రీం లీడర్ అయెతొల్లా ఆలిఖమేనీని అమెరికా, ఇజ్రాయెల్ సేనలు అంతం చేసాయి. ఈ రెండుదేశాలు జరిపిన సంయుక్త దాడులతో ఖమైనీ చనిపోయారని ముందుగానే ప్రకటించినా ఇరాన్ మాత్రం ధృవీకరించలేదు. చివరకు ఖమైనీ ఆశ్రయం పొందుతున్న నివాసంపూర్తిగా నేలమట్టం కావడంతో సుప్రీం లీడర్ ఇక లేనట్లుగానే నిర్ధారించిన టెహ్రాన్ ఖమైనీ మృతిచెందారని ప్రకటించింది. ఇరాన్ మతపెద్ద అమరుడయ్యారని ప్రభుత్వ ప్రసార సంస్థ ఇరిబ్ ఆదివారం ఉదయం ప్రకటించింది. 86 యేళ్ల ఖమైనీ ఆయన ఆఫీసులోనే శనివారం ఉదయంవేళల్లో చనిపోయారని ఇరాన్ ధృవీకరించింది. ఇజ్రాయెల్ ముందు రోజే ఇరాన్ అగ్రనేతను అంతంచేసామని, ఆయన కాంపౌండ్‌లోనే చంపివేసినట్లు ప్రకటించింది. సీనియర్ ఇజ్రాయెలీ అధికారి ఆయన మృతదేహాన్ని గుర్తించామని కూడా ప్రకటించారు. ఇజ్రాయెల్ ఛానెళ్లు ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు ఖమేనీ మృతదేహం చూపిస్తున్న ఫోటోలను ప్రసారం చేసాయి. ఆయన మృతదేహాన్ని టెహ్రాన్ కాంపౌండ్‌లోనే స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించింది. ఇక ఇరాన్ అగ్రనేతను అంతంచేయడంతో ఇపుడు ఇరాన్‌లో రాజకీయ అనిశ్చితి నెలకొంది. ఇస్లామిక్ రిపబ్లిక్ రెండో అగ్రనేత కూడా హత్యకు గురికావడంతో టెహ్రాన్ భవిష్యత్తు సందేహాస్పదంగా మారింది. ముందురోజే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తన సోషల్‌మీడియా ట్రూత్‌లో >>2



## వేట్లపాలెం విస్ఫోటం

# నలుగురు సస్పెన్షన్

మృతుల కుటుంబాలకు తక్షణ సాయం రూ.20లక్షలు ఇచ్చాం

అధికారుల బాధ్యతారాహిత్యంపై కఠిన చర్యలు

నిర్లక్ష్య అధికారుల ఆస్తులు బాధితులకు అప్పగిస్తాం: సిఎం చంద్రబాబు

**విజయవాడ,మార్చి 1,ప్రభాతవార్తప్రతినిధి:** వేట్లపాలెం బాంబు విస్ఫోటనం ఘటనలో అధికారు బాధ్యతారాహిత్యం స్పష్టంగా కన్పిస్తోందని సీఎం చంద్రబాబు నాయుడు వాఖ్యానించారు. ఈ ఘటనలో నలుగురు కీలక అధికారులను ఇప్పటికే సస్పెండ్ చేసామన్నారు.ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సంఘటన స్థలాన్ని తాను స్వయంగా పరిశీలించానన్నారు.అక్కడి బాధిత కుటుంబాలను. ఘటనలో గాయపడిన వారిని పరామర్శించామన్నారు.మృతుల కుటుంబాలు ఒక్కంటికి తక్షణసాయంగా రూ. 20లక్షలను అందజేసామన్నారు. క్షతగాత్రులకు ఎక్స్ గ్రేషియా ఇస్తామని వెల్లడించారు. ఈ ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుందని తెలిపారు. కొద్దిరోజుల క్రితమే ఒక సంఘటన జరిగింది, దాని తర్వాత ఇది రెండో ఘటన. రాబోయే రోజుల్లో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం. ఈ ఘటనపై విచారణ చేసి బాధ్యులను ఫిక్స్ చేస్తాం. ఆర్డీఓ, డీఎస్పీ, జిల్లా లేబర్ ఆఫీసర్, ఫైర్ ఆఫీసర్లను తక్షణం సస్పెండ్ చేస్తున్నాం. విచారణ అనంతరం సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటాం. కొందరు విచ్చల విడితనానికి అలవాటు పడి ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్నారు. వారిని అరెస్టు చేయడంతోపాటు ప్రాసిక్యూట్ చేస్తాం. వాళ్ల ఆస్తులు కూడా జప్తు చేసి బాధితులకు అప్పగిస్తాం. ఇష్ట ప్రకారం చేయడానికి వీల్లేదు. అనుమతులు వచ్చాక మనుషులను నియమించుకున్నారు తప్ప జాగ్రత్తలు తీసుకోలేదు. పేలుడు పదార్థాలు ఉన్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోలేదు. ఎన్ని బాణసంచా కేంద్రాలు ఉన్నాయో సమాచారం తీసుకుంటాం. ఉన్న ప్రొసీజర్స్ కూడా సరి పోవడంలేదు. సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి కంట్రోల్ రూములకు అనుసంధానిస్తాం. బాణాసంచా >>2



ఆదివారం అమరావతిలో ఏపి జ్యుడీషియల్ అకాడెమీకి శంకుస్థాపన జరిపిన సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్. చిత్రంలో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, సిఎం చంద్రబాబు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జెకె మహేశ్వరి, జస్టిస్ పిఎస్ నర్సింహా, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎస్విఎన్ భట్టి,జస్టిస్ జోయ మాల్య బాగ్చి తదితరులు

న్యాయవ్యవస్థలో మరో చరిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం

శంకుస్థాపన చేసిన సుప్రీం సిజె జస్టిస్ సూర్యకాంత్

అంతర్జాతీయ ప్రమాణాలతో రూ.165 కోట్లతో నిర్మాణం

పాల్గొన్న హైకోర్టు సిజె జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, సిఎం చంద్రబాబు, పలువురు న్యాయమూర్తులు

# అమరావతిలో న్యాయ అకాడెమీ

**విజయవాడ,మార్చి 1,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర రాజధాని అమరావతి వేదికగా న్యాయ వ్యవస్థలో మరో చారిత్రాత్మక ఘట్టం చోటు చేసుకుంది. పిచ్చుకలపాలెం వద్ద ఏపీ జ్యుడీషియల్ అకాడమీకి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఏపీ సీఎం చంద్రబాబు సమక్షంలో శం కుస్థాపన చేశారు. రూ.165 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించే అకాడమీ మొత్తం 2.05లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటుంది. ఇక్కడ ఒకేసారి 120మందిట్రైనీజడ్జిలకు శిక్షణఇచ్చేలా రూపకల్పన చేశారు. అకాడమీలో 500సీట్ల సామర్థ్యంతో అత్యాధునిక ఆడిటోరియంను నిర్మిస్తారు. జీప్లస్ 8 అంతస్తులతో భారీ హాస్టల్ బ్లాక్ నిర్మాణం ఉంటుంది. అలాగే అమరావతిలో హైకోర్టు జడ్జిల అతిథిగృహానికి సీజేఐ శంకుస్థాపన చేశారు. రూ.69.4కోట్ల వ్యయంతో 50 వేల చదరపు అడుగుల్లో దీని నిర్మాణం ఉంటుంది. శంకుస్థాపన కార్యక్రమంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, సీఎం చంద్రబాబుతోపాటు,సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జెకె మహేశ్వరి, జస్టిస్ పిఎస్ నర్సింహా, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎస్విఎన్ భట్టి,జస్టిస్ జోయ మాల్య బాగ్చి, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, ఇతర న్యాయమూర్తులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్, జీఏడి ముఖ్య కార్యదర్శి శ్యామల రావు, మున్సిపల్‌శాఖ కార్యదర్శి సురేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముందు జుడీషియల్ అకాడమీ, అమరావతి రాజధాని అభివృద్ధి పనులపై రూపొందించిన ఆడియో, వీడియో డాక్యుమెంట్‌ను వీరు తిలకించారు. అనంతరం అమరావతి సీఆర్‌డీఏ పరిధిలో మొత్తం 6,300 చదరపు గజాల స్థలవిస్తీర్ణంలో రూ.69 కోట్ల 40లక్షల అంచనా వ్యయంతో 50వేల చదరపు అడుగుల నిర్మాణ విస్తీర్ణంలో గ్రౌండ్+3 >>2



ఆదివారం మదురైలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు జరిపిన ప్రధాని మోడీ

## తమిళనాట డబులింజన్ ఖాయం

డిఎంకెవన్నీ పీడకలలే: మదురై ర్యాలీలో ప్రధాని మోడీ

**మదురై, మార్చి 1:** ఎన్నికలు సమీపిస్తున్న వేళ తమిళనాడు అధికార డీఎంకేపై తీవ్ర స్థాయిలో ప్రధాని మోడీ విరుచుకుపడ్డారు. తిరిగి అధికారంలోకి వస్తామని చెబుతున్న డీఎంకేకు అది పీడకలగానే మిగిలిపోతుందని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి విజయం >>2

## మధ్యవర్తిత్వం ప్రపంచానికి భారత్ సందేశం

విజయవాడలో సుప్రీం సిజె జస్టిస్ సూర్యకాంత్

కోర్టులపై భారం తగ్గించడానికి అదే సరైన మార్గం



2లో



ఆదివారం మీడియాతో మాట్లాడుతున్న టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు

## భూమన, సుబ్బారెడ్డి ఏం చేశారో బయటపెట్టనా?

వారి దుర్మార్గాలు బయటకు వస్తాయనే నాపై బురద..

టిటిడి పతిష్టను దెబ్బతీస్తున్న వారిని వదలను

వైసిపి వ్యాఖ్యలపై టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు

**తిరుపతి,మార్చి 1ప్రభాతవార్తప్రతినిధి:** తెలిసింది మంచి చేయడమేనని వైసిపి నాయకుల్లా అవినీతిఅక్రమాలకు పాల్పడటం కాదని, గతంలో భూమన కరుణాకర్‌రెడ్డి చేసిన దుర్మార్గాలు బయటకు వస్తాయనే ప్రతీకారంతో బురదజల్లుతున్నారని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు తీవ్రంగా విమర్శించారు. తాను వ్యాపారస్థుడినని తనకు ఎన్నో అవకాశాలు వచ్చినా వద్దని దేవునికి సేవచేయాలనే టిటిడికి వచ్చానని ఉద్ఘాటించారు. తాను టిటిడి ఛైర్మన్ అయిన మొదటి రోజు నుండి తనను రాజీనామాచేయాలని ప్రస్తావిస్తున్నారని, దీనివెనుక భూమన చేసిన దుర్మార్గాలు బయటకు వస్తే తిరుపతి ప్రజలే కరుణాకర్‌రెడ్డిని తరిమి తరిమి కొడతారని నాయుడు హెచ్చరించారు. రెండు దశాబ్దాల క్రిందటి వీడియోను మార్ఫింగ్ చేసి తనపై అసత్య ఆరోపణలు, బురదజల్లే పనులు చేస్తున్న వైసిపిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తిరుచానూరు రోడ్డులో ఓ హోటల్‌లో ఆదివారం మధ్యాహ్నం ఛైర్మన్ బిఆర్‌నాయుడు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలు వెల్లడించారు. శ్రీవారి దర్శనానికి సంబంధించి గతంలో వాళ్ల భారీగా టికెట్లు అమ్ముకు >>2



## మరో మావోయిస్టు నేత ముప్పిడి సాంబయ్య లొంగుబాటు

**జమ్మికుంట/హుజురాబాద్, మార్చి1 ప్రభాతవార్త:** దేశ అంతర్గత భద్రతకు విప్లవపార్టీలతో ముప్పు పొంచి ఉందన్న ఇంటలిజెన్స్ వర్గాల బలమైన సమాచారంతో భారత ప్రభుత్వం 16రాష్ట్ర ప్రభుత్వాలను ఒక్క సారిగా మేల్కొలిపి మావోయిస్టు పార్టీ దాని అనుబంధ సంస్థలను కూకటివేళ్లతో పీకిపాడేస్తామంటూ కేంద్ర హోం శాఖమంత్రి అమిత్‌షా ఏముహుర్తంలో నిర్ణయం తీసుకున్నాడో 2024 జనవరి >>2

# తెలుగు మన ఆత్మ గౌరవానికి ప్రతీక



మాతృ భాషను మరింతగా ప్రోత్సహించాలి

తెలుగు ఉనికిని కాపాడుకోవాలి

మహాసభలలో గవర్నర్ అబ్దుల్ నజీర్

**అమలాపురం,మార్చి 1, ప్రభాతవార్త:** సుదీర్ఘ చరిత్రను, మహోన్నత సాహిత్య సంపదను, అద్భుతమైన సాంస్కృతిక వైభవాన్ని కలిగిన తెలుగుభాష తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీకని దేశ భాషలందు తెలుగు లెస్సనీ రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ అన్నారు.డాక్టర్ బిఆర్ అంబెడ్కర్ కోనసీమ జిల్లా కిమ్స్ ప్రాంగణము నందు గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ,కిమ్స్ సంయుక్తంగా అధినేత చైతన్య రాజు ఆధ్వర్యంలో ఏర్పా టుచేసిన మూడవ ప్రపంచ తెలుగు మహాసభలలో రెండో రోజు ఆదివారం గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముందుగా ప్రపంచం నలుమూలల నుండి విచ్చేసిన తెలుగు వారందరికీ, హృదయ పూర్వక వందనాలు తెలిపారు.ఈ మూడవ ప్రపంచ తెలుగు మహా సభల వేదికపై మీ ముందు ప్రసంగించడం గొప్ప గౌరవంగా, ఆనందంగా భావిస్తున్నానన్నారు. దేశభాష లందు తెలుగు లెస్స అన్న శ్రీకృష్ణదేవ రాయలు మాటలు ఈనాటికి మనకు స్ఫూర్తిని నింపుతున్నా యన్నారు. వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి తెలుగు భాషా వికాసంలో మహత్తర పాత్ర పోషించిన భాషావేత్త, సంస్కర్త అని, ముఖ్యంగా వ్యవహారిక తెలుగు ప్రాచుర్యానికి కృషి చేసి, తెలుగు భాషను ప్రజలకు చేరువ చేశారన్నారు.అమృత భాష తెలుగని మన సంస్కృతి సాంప్రదాయాలను గుర్తు చేస్తుందన్నారు. నేటి ఆధునిక యుగంలో తెలుగు భాష ప్రాచుర్యం పొందుతూనే ఉందన్నారు. తెలుగు భాషను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనాఉందన్నారు. భావితరాలు తెలుగు భాష సంస్కృతిని ఔన్న త్యాన్ని విలువలను కాపాడడానికి ముందడుగు వేయాలన్నారు. సుమారు 100 మిలియన్ల ప్రజలు వివిధ రాష్ట్రాలలో తెలుగువారు ఉన్నారని తెలుగు భాష గొప్పదనాన్ని విస్తృతం చేసి తెలుగు భాష ఉనికిని కాపాడు కోవడానికి కృషిచేయాలన్నారు. తెలుగు భాష ఔన్నత్యం, మాధుర్యం, వైభవం గురించి కృషి చేసిన అనేక మంది మహానుభావులను ప్రశంసించారన్నారు. సంస్కృత మహాభారతాన్ని తెలుగులో ప్రారం భించి, తెలుగు భాషకు శాస్త్రీయ బలంచేకూర్చా డన్నారు.తెలుగు కూడా శాస్త్రీయ రచనలకు తగిన గొప్ప భాషని నిరూపించారన్నారు.తెలుగు భాషలో శాస్త్ర, కవిత్వ రచనలు చేయగల సామర్థ్యం ఉందని రుజువు చేశారన్నారు. తెలుగుభాష >>2

02-3Pg2exHNWMJQE.qxd:02-3Pg2exHNWMJQE.qxd 1/1/02 7:07 AM Page 1





ఆదివారం విజయవాడలోని లోక్‌భవన్‌లో సిజెఐ సూర్యకాంత్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి గౌరవిస్తున్న డిసిఎం పవన్ కళ్యాణ్

## నాగపూర్‌లో భారీ పేలుళ్ళు

### ఎస్బిఎల్ పరిశ్రమ ధ్వంసం 17 మంది మృతి

ముంబై, మార్చి 1: మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. నాగ్‌పూర్‌లోని కటోల్ ప్రాంతంలో పేలుడు పదార్థాల తయారీ పరిశ్రమ ఎస్బిఎల్ ఎనర్జీ లిమిటెడ్ లో జరిగింది. ఈ పరిశ్రమలో డిటోనేటర్లు, కాస్ట్ బూస్టర్లు, భూకంప పేలుడు పదార్థాలు తయారుచేస్తారని తెలుస్తోంది. ఓ యూనిట్‌లో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఈ సమయంలో 20 మందికిపైగా ఉద్యోగులు వివిధ యూనిట్లలో పనిచేస్తున్నారు. ఈ పరిశ్రమలో భారీ పేలుడు సంభవించడంతో 17 మంది మరణించారు. ఈ ఘటనలో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం ఆ ప్రాంతంలోని ప్రజలు భయాందోళనలను గురైయ్యారు. స్థానికులు వెంటనే అగ్నిమాపక, పోలీసు అధికారులకు సమాచారం చేర్చారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం.. ఈ ప్రమాదంలో 12 మంది కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సుమారు 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రులకు తరలించారు. వీరిలో మరికొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. పేలుడు ధాటికి ఈ పరిశ్రమ గోదాము పూర్తిగా నేలమట్టమైంది. ఈ ప్రమాదం ధాటికి చుట్టుపక్కల ఉన్న ఇతర భవనాలు కూడా దెబ్బ తిన్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్నారు. అగ్నిమాపక యంత్రాలు గంటల తరబడి శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చాయి. ఈ గోడౌన్‌లో అనుమతించిన పరిమితి కంటే ఎక్కువ మొత్తంలో పేలుడు పదార్థాలను నిల్వ చేయడంతోనే ప్రమాద తీవ్రత పెరిగిందని సమాచారం. భవనం శిథిలాల కింద ఎవరైనా చిక్కుకున్నారేమోననే అనుమానంతో సహాయక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. పేలుడుకు గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై మహారాష్ట్ర ప్రభుత్వం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది. బాణసంచా కేంద్రాల్లో భద్రతా తనిఖీలు చేపట్టాలని అధికారులు ఆదేశించారు.



ఆదివారం జ్యుడీషియల్ అకాడెమీ భవన నిర్మాణ ప్రాంగణంలో మొక్కను నాటుతున్న సిజెఐ సూర్యకాంత్

## అమరావతిలో న్యాయ అకాడెమీ

>> ఫ్లోర్స్ తరహాలో నిర్మించనున్న అతిథి గృహ భవనానికి శంకుస్థాపన చేశారు. హైకోర్టు భవనం నుంచి కేవలం 1.2 కిలోమీటర్ల దూరంలో ఈ భవనం ఉంటుంది. డి, 25 మీటర్లు మరియు 50 మీటర్ల వెడల్పైన రహదారుల ద్వారా సులభంగా చేరుకోవచ్చు. ఏపీ జుడీషియల్ అకాడమీని 165 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తుండగా ఇందులో బ్లాక్ తీలో జీ+3 అంతస్తులతో అకాడమిక్ బ్లాక్ నిర్మిస్తున్నారు. అలాగే జీ+8 అంతస్తులతో హాస్టల్ బ్లాక్, జీ+3 అంతస్తుల్లో ఇండోర్ స్పోర్ట్స్, గెస్ట్ ఫెసిలిటీస్ కల్పిస్తున్నారు. 120 మంది బ్యాచ్ ఆఫ్ ట్రైనీ జడ్జిలకు సామర్థంతో నిర్మిస్తున్నారు. మొత్తం భవన విస్తీర్ణం 2.05 లక్షల చదరపు అడుగులు. ఏపీ హైకోర్టు నుంచి ఈ జుడీషియల్ అకాడమి 5.7 కి.మీల దూరంలో 50 మీటర్ల వెడల్పు కలిగిన రహదారి సౌకర్యం కలిగి ఉంది. బ్లాక్ ఏ, జీ+ 3 అంతస్తులతో కూడిన అడ్మినిస్ట్రేటివ్, అకాడమిక్ బ్లాక్ 500 సీట్ల సామర్థంతో ఆడిటోరియంతో కూడిన స్టేజ్, ఫ్రీ ఫంక్షన్ ఏరియా,120 సీట్లతో కూడిన సెమినార్ హాల్,70 సీట్లతో కూడిన 2 క్లాస్ రూమ్‌లు,70 సీట్లతో మూట్ కోర్టు హాల్, 60 సీట్లతో ఫోరెన్సిక్ ల్యాబ్ కలిగి ఉంటుంది. అంతేగాక 50 సీట్లతో కంప్యూటర్ ల్యాబ్, 48 సీట్లతో లైబ్రరీ, రీడింగ్ రూమ్, డైరెక్టర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, జడ్జిల లాంజ్, ఫ్యాకల్టీ రూమ్, కొలాబరేషన్ స్పేస్స్,హెల్తు యూనిట్, క్రెచే సౌకర్యం, 3 మీటర్ల వెడల్పు కలిగిన కారిడార్స్, సెంట్రల్ లిఫ్టు వంటి ఆధునిక సౌకర్యాలు కలిగి ఉంటుంది. బ్లాక్‌బి జిప్లస్ 3 అంతస్తులతో కూడిన ఈ భవనంలో రెసిడెన్షియల్, ఎమినిటీస్ సౌకర్యాలు ఉంటాయి. దీనిలో ముఖ్యంగా 108 సీట్లతో డైనింగ్ హాల్, 10 సీట్ల వీఐపీ డైనింగ్ హాల్, పూర్తి స్థాయి సౌకర్యాలతో కూడిన కిచెన్, సర్వీస్ ఏరియా జిమ్, 2 బ్యాడ్మింటన్ కోర్టు హాళ్లు, స్క్వాష్ కోర్టు,టేబుల్ టెన్నిస్ హాల్, యోగా, మెడిటేషన్ కు ప్రత్యేకంగా మల్టీ పర్పస్ హాల్ కలిగి ఉంటుంది. బ్లాక్ బి 2 జి ప్లస్ 8 అంతస్తులతో కూడిన భవనంలో జ్యుడీషియల్ అధికారులు, ట్రైనీలకు రెసిడెన్షియల్ ఎకామిడేషన్, 98 సీట్లతో టిఫికల్ హాస్టల్ యూనిట్, 5 సూట్ రూమ్‌లు, ప్రతి అంతస్తులో లాంజ్ స్పేస్, ప్యాంట్రీ యుటిలిటీ సౌకర్యాలుంటాయి. బ్లాక్ బి 3 జి ప్లస్ 1 అంతస్తులతో కూడిన భవనంలో స్విమ్మింగ్ పూల్, పార్కింగ్, సపోర్టింగ్ స్టాఫ్ వసతి సౌకర్యాలు ఉంటాయి. పార్కింగ్ ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించి బేస్మెంట్ పార్కింగ్, రెండు జోన్లలో ద్విచక్ర వాహనాల పార్కింగ్, సైక్లింగ్, వాకింగ్ ట్రాక్ ఉంటాయి. డ్రైవర్స్ డార్మిటరి, రెండు సర్వీస్ క్వార్టర్స్ ఉంటాయి.

## తమిళనాట డబులింజన్ ఖాయం

>> సాధించి డబుల్ ఇంజన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికలు రాష్ట్రానికి కీలక టర్నింగ్ పాయింట్‌గా మారుతుందన్నారు. మదురైలో నిర్వహించిన ఎన్‌డీఏ ర్యాలీలో ఆయన ప్రసంగించారు. తమిళనాడులో తిరిగి అధికారంలోకి వస్తామని కొందరు కలలు కంటున్నారు. కానీ ఎన్‌డీఏ ర్యాలీని చూస్తే వారి కలలు పీడకలలగానే మిగిలిపోతాయి. ఈ అసెంబ్లీ ఎన్నికలు తమిళనాడుకు టర్నింగ్ పాయింట్. డీఎంకేను ఇం టికి పంపాలని ఇప్పటికే ప్రజలు నిశ్చయించుకున్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వంతోనే మార్పు సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారని మోడీ అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది ఎన్‌డీఏ ప్రభుత్వమేనని 25ఏళ్ల తర్వాత 2021లో పూర్తి మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. కానీ వారు సరైన సుపరిపాలనను అందించలేదు. మొత్తం రాష్ట్రాన్ని లూటీ చేశారు. వారసత్వ రాజకీయాల గురించి ఆలోచిస్తూ ప్రజల ఆకాంక్షలను పట్టించుకోలేదు. మదురైను ప్రేమించిన ఎంజీఆర్‌తో ఇక్కడి ప్రజలు అండగా నిలిచారు. అందుకే డీఎంకేకు మదురై అంటే ఇష్టం లేదు. ఇంకా మదురైకు మాఫియా తరహా రాజకీయాలను తీసుకువచ్చారు. డ్రైనేజీ, చెత్త నిర్వహణ సరిగ్గా లేదు. జాతీయ శుభ్రత ర్యాకింగ్స్‌లో అట్టడుగు స్థానానికి తీసుకెళ్లింది. అవినీతి వల్ల మేయర్ కూడా రాజీనామా చేయాల్సి వచ్చింది. డీఎంకే పేదల కోసం పనిచేయదు ఇతరులను కూడా చేయనియ్యదు. తమిళనాడులో ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద దాదాపు ఆరు లక్షల ఇళ్లు పూర్తయ్యాయని, ఆ కుటుంబాలు సొంత ఇల్లు వచ్చిందన్న గౌరవంతో ఉంటున్నారన్నారు. ఇదే సమయంలో మరో మూడు లక్షల ఇళ్లు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. డీఎంకే ప్రభుత్వం సర్వేలు చేయకుండా కాలయాపన చేయడమే కారణమని విమర్శించారు. డీఎంకే చిల్లర రాజకీయాల వల్ల పేద కుటుంబాలు ఎందుకు ఇబ్బందులు పడాని మోడీ ఆరోపించారు. తమిళనాడులోని మహిళలు కష్టాల్లో చిక్కుకుపోయారు.

రాష్ట్రంలో రోజురోజుకూ క్రైమ్ పెరిగిపోతుంది. ఆల్కహాల్, డ్రగ్ మాఫియాతో తమ కుటుంబాలు నాశనం అవ్వడాన్ని వారుకళ్లా రా చూస్తున్నారు. అమ్మ జయలలిత పాలనలో ఎంత మెరుగ్గా జీవించామో అని వారు ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారు. ప్రతీ ఒక్క తమిళ తల్లి, సోదరి, కూతురుకి ఒక మాట ఇస్తున్నాను. ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొదటగా రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్‌పై దృష్టి పెడతాం. డ్రగ్ మాఫియా, క్రిమినల్స్‌ను జైలులో వేస్తాం. రామేశ్వరానికి ఉన్న పాత పంబన్ వంతెనకు దాదాపు వందేళ్లు పూర్తయ్యా యి. ఇంత కాలం తర్వాత దానిని మార్చాల్సిన పరిస్థితి ఏర్పడిదన్నారు.

## ఇరాన్ తాత్కాలిక సుప్రీం లీడర్‌గా అలీ రెజా అరాఫీ

టెహ్రాన్, మార్చి 1: ఇరాన్ సుప్రీం లీడర్ అయొతుల్లా ఖమైనీ హత్యతో ఏర్పడిన ఖాళీని భర్తీచేసేందుకు తాత్కాలిక సుప్రీం లీడర్‌గా అయతొల్లు అలిరెజా అరాఫిని ఎంపికచేసారు. దేశ తాత్కాలిక సుప్రీం లీడర్‌గా అరాఫి వ్యవరిస్తారు. అలాగే శాశ్వత సుప్రీం లీడర్ ఎంపిక జరిగేంతవరకూ అలిరెజాయే సుప్రీంగా కొనసాగుతారు. సుప్రీం లీడర్‌నియామకం కోసం అధ్యక్షుడు పెజెష్కియాన్, చీఫ్‌జస్టిస్ ఘోలమ్ హోస్సేన్ మెహసేని ఎజెయీ, గార్డియన్ కౌన్సిల్‌నుంచి ఒక సభ్యుడు ఉంటారు. సుప్రీం లీడర్ అధికారాలను విస్తృత స్థాయిలో శోధించి అందుకు అర్హతలున్న వ్యక్తిని ఎంపికచేస్తారు. ఇరాన్ రాజ్యాంగం ప్రకారం సుప్రీం లీడర్‌ను నిపుణుల కమిటీ నియమిస్తుంది. 88 మంది సభ్యులున్న మతపెద్దల కమిటీ ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తుంది. ఇరాన్ సుప్రీం లీడర్‌కు ఈ మతపెద్దల రాజ్యాంగం ప్రకారమే సుప్రీం అధికారాలు ంక్రమిస్తాయి. విదేశాంగ విధానాన్ని కూడా సుప్రీం లీడరే నిర్ణయిస్తారు. 1959లో ఇరాన్‌లోని మేబోద్ లో జన్మించిన అయతొల్లా అరాఫీ, షియా మతగురువుగా, ఇస్లామిక్ న్యాయనిపుణుడిగా పేరు పొందారు. 2016 నుంచి ఇరాన్ ఇస్లామిక్ సెమినరీస్ మేనేజ్‌మెంట్ సెంటర్ హెడ్‌గా, ప్రఖ్యాత కోమ్ సెమినరీ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. దేశ చట్టాలను, ఎన్నికలను పర్యవేక్షించే శక్తివంతమైన గార్డియన్ కౌన్సిల్‌లో కూడా ఆయన సభ్యుడిగా ఉన్నారు. గతంలో 2008 నుంచి 2018 వరకు అల్‌ముస్తఫా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ అధ్యక్షుడుగా కూడా అరాఫీ పనిచేశారు.

## మధ్యవర్తిత్వం ప్రపంచానికి భారత్ సందేశం

విజయవాడ, మార్చి1 ప్రభాతవార్త ప్రతినిధి: న్యాయవ్యవస్థలో మధ్యవర్తిత్వం ప్రత్యామ్నాయం కాదని, ఓ ప్రాధాన్యాంశమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఉద్ఘాటించారు. మధ్యవర్తిత్వం భారతీయులు డీఎన్ఏలోనే ఉందని ఉదహరించారు. రెండు పక్షాలకు మేలు చేకూర్చేలా చేయడంలో మధ్యవర్తిత్వానిది కీలక పాత్ర అని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. కోర్టులపై కేసుల భారం ఎక్కువగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో మధ్యవర్తిత్వాన్ని విస్మరించడం ఏ మాత్రం సహేతుకం కాదన్నారు. విజయవాడలో జరిగిన ఏపీ న్యాయ సేవా ప్రాధికార సంస్థ (స్టేట్ లీగల్ సర్వీసెస్ అథార్టీ) మధ్యవర్తిత్వంపై నిర్వహించిన రాష్ట్రస్థాయి సదస్సుకు జస్టిస్ సూర్యకాంత్ హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యాయ వ్యవస్థలో మధ్యవర్తిత్వానిది కీలక పాత్ర. మధ్యవర్తిత్వం వల్ల అనేక కేసులు సులువుగా పరిష్కారం అవుతాయి. ప్రతి సమస్యకు కోర్టుకు రావడమే పరిష్కారం కాదు. కుటుంబ తగాదాల వల్ల కోర్టుల్లో కేసులు బాగా పెరుగుతున్నాయి. మధ్యవర్తిత్వం వల్ల న్యాయం జరుగుతుందని ఇరుపక్షాలకు నమ్మకం ఉండాలి. న్యాయవ్యవస్థపై ఎంతో నమ్మకంతోనే ప్రజలు కోర్టులకు వస్తున్నారు. కొన్ని కేసుల్లో కోర్టులు కూడా మధ్యవర్తిత్వాన్ని ప్రోత్సహించాలి. మధ్యవర్తిత్వం అనేది ఇవాళ ప్రపంచవ్యాప్తంగా పెరుగుతోంది. మధ్యవర్తిత్వం వల్ల కలిగే ప్రయోజనాలను అనేక దేశాల్లో చూశా. మనదేశంలోనూ ప్రతి స్థాయిలో మధ్యవర్తిత్వం రావాలి. మనదేశం వేగంగా అభివృద్ధి చెందుతోంది. మన దేశంలో పరిశ్రమలు, స్టార్టప్స్ పెరుగుతున్నాయి. వ్యాపారం, వాణిజ్య పరంగా అనేక వివాదాలు రావడం సహజం. అనేక రాష్ట్రాల్లో మధ్యవర్తిత్వం కీలక పాత్ర పోషిస్తుంది. మధ్యవర్తిత్వం వహించే వారికి శిక్షణ ఇవ్వడం చాలా కీలకం." అని సూర్యకాంత్ తెలిపారు. మధ్యవర్తిత్వానికి మూలాలు మన పురాణాల్లోనే ఉన్నాయి. మహాభారతంలో శ్రీకృష్ణుడు మొదటి మధ్యవర్తి. కురుపాండవుల యుద్ధాన్ని ఆపేందు కు కృష్ణుడి రాయబారం మనకు తెలుసు. మధ్యవర్తిత్వం విఫలమైతే నాశనం తప్పదని చరిత్ర చెబుతోంది. మధ్యవర్తిత్వం విజ యవంతం కావాలంటే 3 అంశాలు తప్పనిసరి.

మధ్యవర్తిత్వంపై ఇరుపక్షాలకు పూర్తి నమ్మకం ఉండాలి. మధ్యవర్తి మాట్లాడే తీరు అనుసరించే పద్ధతి చాలా కీలకం. మధ్యవర్తుల ఎంపిక పారదర్శకంగా ఉండాలి. మలేషియా, సింగపూర్‌లో మధ్యవర్తిత్వ ప్రక్రియ ను ప్రత్యక్షంగా చూశా. దేశం కోసం మధ్యవర్తిత్వం అని పిలుపునిచ్చా." అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ వెల్లడించారు.

## తెలుగు ఆత్మ గౌరవానికి ప్రతీక

>> సమాజ మార్పుకు శక్తివంతమైన సాధనంగా భావించారన్నారు. తెలుగు భాషలో తీర్పు చెప్పే వారికి సహనం, చదువులు బోధించే వారికి ఓర్పు ఉండాలని సూచించారు. ఆదికవి నన్నయ్య మహాభారతానికి సంస్కృత శైలిని తెలుగు భాషలో ప్రవేశపెట్టి తెలుగు సాహిత్యానికి పునాది వేశారన్నారు.తిక్కన మహాభారతాన్ని కొనసాగించి, సులభమైన భాషలో రచనలు చేసి ప్రజల్లో తెలుగు ప్రాచుర్యం పొందేలా చేశారన్నారు. ఎర్రాప్రగడ మహాభారతాన్ని పూర్తిచేసి తెలుగు సాహిత్యాన్ని మరింత బల పరిచారన్నారు. వీరిని కవిత్రయమని పిలుస్తా రన్నారు.వీరి కృషితో తెలుగు భాష సాహి త్యరంగం స్థిరపడింద న్నారు.తెలుగు భాషా వ్యాప్తికి కృషి చేసినఎందరో మహనీయులకు ఆయన ఈసందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. తెలుగు కళా ప్రతిభను చాటేలా పోటీలు స్టాల్స్ నిర్వహిస్తూ భావిత రాలకు తెలుగు ఔన్నత్యాన్ని తెలుగు ప్రాచుర్యాన్ని విశ్వ వ్యాప్తం చేసేలా చైతన్య రాజు చేస్తున్న కృషిని గవర్నర్ ఈ సందర్భంగా అభినందించారు. అవనిగడ్డ శాసనసభ్యులు మండల బుద్ధ ప్రసాద్ తెలుగు భాష రచయితల ను స్ఫూర్తిగా తీసుకొని చైతన్య రాజు కృషిని అభినందించారు. ప్రపంచీకరణ నేపథ్యంలో వివిధ భాషలకు అనేక సవాళ్లు ఎదురవుతున్నాయని దీన్ని దీటుగా ఎదుర్కొని తెలుగు భాషను ముందుకు తీసుకెళ్తాం అన్నారు.

## వేట్లపాలెం విస్ఫోటం: నలుగురు సస్పెన్షన్

>> కేంద్రాలకు అనుమతులు కఠినతరం చేస్తాం."అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు .బాణసంచా ఘటన చాలా దురదృష్టకరం. విచారకర ఘటన. ఇప్పటి వరకు 20 మంది చనిపోయారు. 9 మంది పరిస్థితి విషమంగా ఉంది. ఇద్దరు సురక్షి తంగా ప్రమాదం నుంచి బయటపడ్డారు. మృతుల్లో 12 మంది ఎస్సీలు, 9 మంది మహిళలు ఉన్నారు. కూలీ పని కోసం పూట గడవడం కోసం బాణాసంచా తయారీ పనికి వెళ్లారు.ప్రభుత్వ పరంగా మృతుల కుటుంబాలకు రూ.20 లక్షల చొప్పున ఆర్థిక సాయం చేస్తాం. కేంద్రం రూ.2 లక్షలు ప్రకటించింది. తీవ్రంగా గాయపడిన వారిని కూడా ఆదుకుంటాం. చిన్న పిల్లలు ఉండి, చదువుకునే వారిని రెసిడెన్షియల్ స్కూళ్లలో చేర్పిస్తాం. ఇళ్లు లేని వారికి ఇళ్లు నిర్మిస్తాం. చనిపో యిన వారిని తీసుకురాలేము. కానీ వారి కుటుంబాలను అండగా నిలబడతామని స్పష్టం చేసారు.

## మరో మావోయిస్టు నేత ముప్పిడి సాంబయ్య లొంగుబాటు

>> 1నుండి ఆపరేషన్ కగార్ ప్రారంభించడంతో కేంద్రం, ఆయా రాష్ట్ర ప్రభుత్వాల భద్రతా బలగాలు కలిసికట్టుగా ఆపరేషన్ కగార్‌ను శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన సహాయంతో అమలు చేయడంతో రెండు సంవత్సరాల కాలంలో 70సంవత్సరాల మావోయిస్టు పార్టీ కార్యకలాపాలను అతలాకుతలం చేయడంతో వందల సంఖ్యలో అగ్రనేతలతో సహా పలువురు మావోయిస్టు సభ్యులు ఎన్‌కౌంటర్‌లో మృత్యువాత పడగా, వేలాది మంది ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ముందు లొంగిపోయారు. అందులో భాగంగానే ఆదివారం రాత్రి తాజాగా తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్ జిల్లా తారాలపల్లికి చెందిన మావోయిస్టు కేంద్ర కమిటీ అగ్రనేత ముప్పిడి సాంబయ్య అలియాస్ వికాస్ మరో 15మంది మావోయిస్టులతో కలిసి ఆయుధాలతో యుక్తంగా చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని మహాసముంద్ జిల్లాలో బలింగిర్ బర్గడ్-మహాసముంద్ (బిబిఎం) డివిజన్‌కు చెందిన కీలక నేతలతో వచ్చి ఆయుదాలతో సహా పోలీసు అధికారుల ముందు లొంగిపోవడం సంచలనం రేపింది. స్పెషల్ జోన్ కమిటీ నాయకుడిగా, ఒరిస్సా మావోయిస్టు పార్టీ కార్యదర్శిగా ముప్పిడి సాంబయ్య విధులు నిర్వర్తిస్తున్నట్లు చత్తీస్‌ఘడ్ పోలీస్ ఉన్నతా ధికారులు అధికారికంగా వెల్లడించారు. లొంగిపోయిన వారిలో ముప్పిడి సాంబయ్యతోపాటు దినేష్ (ప్లాటూన్ సభ్యుడు), కవిత (ప్లాటూన్ సభ్యురాలు), సవిత (ప్లాటూన్ సభ్యురాలు), మంగేష్ (డివిజన్ కమిటీ సభ్యుడు), రింకూ (ఏరియా కమిటీ సభ్యుడు), జుగ్ను (ప్లాటూన్ సభ్యుడు), అస్మిత (ఏరియా కమిటీ సభ్యురాలు), సస్మిత (ఏరియా కమిటీ సభ్యురాలు), సాస్మిత (ఏరియా కమిటీ సభ్యురాలు), రీటా (ఏరియా కమిటీ సభ్యురాలు), నీల (ఏరియాకమిటీ సభ్యురాలు), మీనా (ప్లాటూన్ సభ్యురాలు), బేబి (డివి జన్‌కమిటీసభ్యురాలు) లొంగిపోయిన వారిలో ఉన్నట్లు పోలీస్ ఉన్నతాధికా రులు వెల్లడించారు.మార్చి 31గడువు ముంచుకస్తుండడంతో ఉద్యమంలో అనేకఒత్తిళ్లకు గురవుతున్న మావోయిస్టులు రానున్న 30 రోజుల్లో ఇంక ఎంతమంది లొంగిపోతారోనన్న కోణంలో నాలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు పోలీస్ యంత్రాంగంఎదురుచూస్తుంది. ముప్పిడి సాంబయ్య లొంగుబాటు మావోయిస్టు పార్టీకితీరని నష్టమని ప్రజాసంఘాలు పేర్కొంటున్నాయి.

## వారం - వర్జ్యం

02-03-2026, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, శుక్లపక్షం, శతభిషం కార్తె
చతుర్దశి సా.5.59
ఆశ్లే ఉ.7.52
వర్జ్యం : రా.7.42-9.16
దు.మ.12.44-1.32, మ.3.06-3.53
రాహుకాలం - ఉ.7.30-9.00

## ఖమేనీ ఖతం

>> పోస్టు చేస్తూ 86 ఏళ్ల ఇరానియన్ అగ్రనేత మరణాన్ని ధృవీకరిస్తూ ఇరాన్‌ప్రజలు తమ దేశాన్ని తిరిగి పొందేందుకు ఒక గొప్ప అవకాశం సాధించుకున్నారని ప్రకటించారు. అమెరికా, ఇజ్రాయెల్ వైమానిక బాంబుదాడులోతో ఇరాన్ మిలిటరీ, ప్రభుత్వ స్థలాలన్నీ ధ్వంసం అయ్యాయి. అమెరికన్ కమాండర్‌ఇన్‌ఛీఫ్ మాట్లాడుతూ తమ దేశం ఇజ్రాయెల్‌తో కలిసి పర్యవేక్షణ చేసిందని 1989నుంచి ఉన్న ఈ నేతను అంతంచేయడమే లక్ష్యంగా చెప్పారు. అణ్వాయుధ తయారీని ఎంతమాత్రం అంగీకరించబోమని, ఇరాన్‌తో తమకు అణుముప్పు ఉన్నందువల్లనే దాడులుచేసామని ముందుగా హెచ్చరించినా ఫలితం లేకపోయిందని చెపుతూ వచ్చిన అమెరికా ఇజ్రాయెల్‌తో కలిసి దాడులకు పూనుకుంది. ఇంటెలిజెన్స్ ట్రాకింగ్ వ్యవస్థలు ఖమైనీ ఎక్కడ ఉంటున్నదీ పసిగట్టాయి. ఖమైనీతోపాటే ఇరాన్ రక్షణ మంత్రి ఆమిర్ నాసిర్‌జాదె, రివల్యూషనరీ గార్డ్స్ కమాండర్ మహ్మద్ పాక్‌పోర్‌లు కూడా ఈ దాడుల్లోచనిపోయారు. ఇజ్రాయెల్ మిలిటరీ కూడా తమ మిలిటరీలోని ఐదుగురు సీనియర్ కమాండర్లుకూడా చనిపోయారని, వారిలో ఇరాన్‌సుప్రీం లీడర్ సలహాదారు ఆలి షమ్‌ఖాని కూడా ఉన్నట్లు వెల్లడించింది.ఇరాన్ మతపెద్ద కుమార్తె, మనవరాలు, అల్లుడు, కోడలు కూడా చనిపోయారని ప్రకటించింది. అమెరికా ఇజ్రాయెల్ దాడులపై ఇరాన్ ఆగ్రహావేశాలతో ఊగిపోతూ దాడులు ముమ్మరంచేసింది. ఇజ్రాయెల్‌తోపాటు మరో ఏడు దేశాల్లోని అమెరికా స్థావరాలపై దాడులుచేసింది. ప్రత్యేకించి గల్ఫ్‌దేశాల్లోనే ఈ దాడులు జరిగాయి. 86 ఏళ్ల అయొతుల్లా అలీఖమేనీ ఇరాన్‌ను 1989నుంచి పాలించారు. ప్రభుత్వం, మిలిటరీ, న్యాయవ్యవస్థలపై పూర్తిస్థాయి పట్టును నిరూపించారు. షియా ఇస్లామిక్ రిబిప్లక్ దేశంలో అగ్రనేతగా కొనసాగారు. ఇరాన్ వ్యవస్థాపకుడుగా పేర్కొంటున్న ఆవిష్కర్త అయొతొల్లా రుహోల్లాఖొమైనీ తర్వాత ఈ అయొతుల్లా ఖమైనీనే ఎంపికచేసారు. ప్రాథమికంగా అంతగా పట్టుసాధించలేకపోయినా గడచిన వందేళ్లలో ఐదుగురు శక్తివంతమైన ఇరాన్ మతపెద్దల్లో ఒకరిగా క్రమేపీ ఎదుగుతూ వచ్చారు. తన పాలనలో నిరంతరం అమెరికాను ఖమైనీ ఎండగడుతూనే వచ్చారు. డొనాల్డ్‌ట్రంప్ రెండోసారి ఎన్నికయిన తర్వాత కూడా ఈ విమర్శలు, వివాదాలు కొనసాగుతూనే వచ్చాయి. దీనితోనే ట్రంప్ నిరంతరం నియంతకు మరణం తప్పదు అంటూ నినాదాలిచ్చేవారు. శత్రువుకు ఎప్పుడూ ఇరాన్ లొంగదంటూ వచ్చిన ఖమైనీ తన పాలనశైలిలోనే కొనసాగారు. ఖమైనీ తన పాలనలో స్వతంత్రతను తెచ్చారు. ఎన్నికైన అధ్యక్ష తరహా పాలనను పూర్తిగా రద్దుచేసి మతపరమైన పాలనకు బీజం వేసారు. దీనితోనే ఇరాన్ ఇతర ప్రపంచదేశాలతో ఏకాకిగా మారిపోయింది.

## ఎపిలో నేషనల్ జ్యుడిషియల్ అకాడమీ ఏర్పాటు చేయండి: చంద్రబాబు

విజయవాడ, మార్చి 1 ప్రభాతవార్త ప్రతినిధి: అమరావతిలో నేషనల్ జ్యుడిషియల్ అకాడమీని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు భారత దేశ ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను కోరారు. ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ నేతృత్వంలో ఆదివారం విజయవాడలో మధ్యవర్తిత్వంపై రాష్ట్రస్థాయి సదస్సు జరిగింది. ఈ సదస్సుకు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ హాజరయ్యారు. సదస్సుకు వచ్చిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌కు సిఎం చంద్రబాబు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ "రాజధాని నిర్మాణంలో జస్టిస్ సిటీలో న్యాయ వ్యవస్థకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. జ్యుడిషియల్ అకాడమీ, లీగల్ సర్వీసెస్ అథార్టీ, మీడియేషన్ సెంటర్, ఇంటర్నేషనల్ లా యూనివర్శిటీ, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వంటి వాటిని ఇంటిగ్రేట్ చేస్తూ బెస్ట్ జ్యుడిషియల్ సిటీని నిర్మిస్తాం. వీటికి అవసరమైన భూములు ఇవ్వడానికి కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అమరావతిలో నేషనల్ జ్యుడిషియల్ అకాడమీ ఏర్పాటు చేయాలని కోరుతున్నాం. ఈ అకాడమీ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తాం. అమరావతిలోని జస్టిస్ సిటీని దేశంలోనే బెస్ట్ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు మేం ప్రయత్నిస్తున్నాం. దీనికి సిజెఐ సహకారం కావాలి. గ్రామాల్లో మధ్యవర్తిత్వం ద్వారా చాలా సమస్యలను పరిష్కరించేవారు. మా తండ్రి కూడా పెద్దరికం వహించి గ్రామంలో సమస్యలను పరిష్కరించారు. మధ్యవర్తిత్వంతో కేసులను పరిష్కరిస్తే రూ.10 వేలు ఇస్తాం. కేసులు పరిష్కారం కాకున్నా రూ.3 వేలు ఇస్తాం. కేసులు పరిష్కారమై సత్వర న్యాయం అందితే త్వరితగతిన అభివృద్ధి సాధ్యమవుతుంది. ఈ క్రమంలో మధ్యవర్తిత్వంతో పరిష్కారమైన కేసులకు రూ.10 వేలు ఇవ్వడం పెద్ద కష్టం కాదు. దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా రాజధాని అమరావతి నిర్మాణం చేపడుతున్నాం. బ్లూగ్రీన్ ఫీల్డ్ రాజధానిగా అభివృద్ధి చేస్తున్నాం. ల్యాండ్ పూలింగ్ ద్వారా 29,000 మందికి పైగా రైతులు స్వచ్ఛందంగా రాజధానికి భూములు ఇచ్చారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా, పర్యావరణ హితంగా, ఆర్థికంగా బలమైన రాజధాని ఉండేలా అమరావతిని తీర్చిదిద్దుతున్నాం. వికసిత్ భారత్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నాం" అని ముఖ్యమంత్రి వివరించారు. ఈ కార్యక్రమానికి సుప్రీం కోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, అడ్వకేట్లు తదితరులు హాజరయ్యారు.

## ఏంచేశారో బయటపెట్టనా?

>> న్నారని ఆరోపించారు. ఆ వివరాలు పూర్తిగా తన వద్ద ఉన్నాయన్నారు. ఇవ్వన్నీ బయటపెడుతానని తనపై ఆరోపణలకు దిగుతున్నారన్నారు. ఆయన చేసిన దుర్మార్గాలన్నీ బయటపెట్టేవాడినని, ఎన్ని స్కామ్‌లు ఉంటే అన్నీ బయట పెడతానని చెబితే సీఎం చంద్రబాబు నాయుడు తనను ఆపారని ప్రస్తావించారు. తిరుమల పవిత్రత దెబ్బతీయొద్దని సూచనలు చేశారన్నారు. చెత్త పనులు, నీచపు రాజకీయాలు చేయొద్దని బీఆర్ నాయుడు హితవు పలికారు. టిటిడిలో గత వైసిపి హయాంలోని ఏ ఫైల్ చూసినా అన్నీ దొంగ లెక్కలేనని, చెన్నైకి పోయి కరుణాకర్ రెడ్డి, సుబ్బారెడ్డి ఏమి చేశారో బయట పెట్టమంటారా?అని సవాల్ విసిరారు. తాను పరిశోధనాత్మక జర్నలిజం చేయించి వీళ్ల అంతు తేలుస్తానని హెచ్చరించారు. ప్రపంచం మొత్తం జగన్ గజదొంగ అని తెలుసునని,తాను కొత్తగా చెప్పాల్సిన పని లేదన్నారు. తనకు ఇది బ్రతుకు తెరువు కాదని, నా వ్యాపారాలు హైదరాబాద్‌లో ఉన్నాయన్నారు. కోటి పుస్తకాలు భగవద్గీత పేరుతో 50 కోట్లు రూపాయలు ఖర్చు పెట్టారన్నారు. ఆ భగవద్గీతలో ఏమీలేదని, ఆ పుస్తకాల వెనుక కరుణాకర్‌రెడ్డి కొడుకుఉన్నాడని నాయుడు వెల్లడించారు. వీఐపీల దర్శనాల్లో తన కోటాలో 50శాతం కూడా నేను ఇవ్వటంలేదని, బంధువులకు, మిత్రులకు నిష్టూరం అయిపోయానన్నారు. టీటీడీ ప్రతిష్ఠను దెబ్బతీసే కుట్ర జరుగుతోందని ,దీని వెనుక వైసీపీ నేతలుఉన్నారని ఆగ్రహంవ్యక్తం చేశారు. సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న దుష్ప్రచారంపై ఆయన తీవ్రంగా స్పందించారు. సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. తన వ్యక్తిత్వాన్ని హననం చేస్తూ టిటిడి పతిష్ఠను దెబ్బతీస్తున్న వ్యక్తులను, దుష్ట శక్తులను వదిలే ప్రసక్తే లేదని బీఆర్ నాయుడు హెచ్చరించారు. దోషులు ఎవరైనా కఠిన చర్యలు తప్పవని ఆయన తేల్చి చెప్పారు.

## వార్తాఫలం

**మేషం :** ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రసంగాలు, ఆరోగ్య సూత్రాలు మీపై చెప్పుకోదగిన ప్రభావం చూపుతాయి.

**వృషభం:** ఓర్పుతో, ధైర్యముతో చేయ వలసిన పనిని సఫలము చేయగలుగుతారు. మిత్రుల నుండి ముఖ్య సమాచారం అందుకుంటారు.

**మిథునం:** విధి నిర్వహణలో గానీ, వ్యాపారములో గాని మార్పులు జరుగ వచ్చును. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది.

**కర్కాటకం:** రాజకీయములు, సంఘములు, యూనియన్‌లు మొదలగు కార్యములకు అనుకూల కాలము.

**సింహం:** కుటుంబసభ్యులతో కలిసి దేవాలయ సందర్శనము చేసుకుంటారు. మిత్రుల ఒత్తిడివలన కొంత బాధ కలుగుతుంది.

**కన్య:** వైరి వర్గంలోని అనైక్యత మీకు లాభిస్తుంది, మొండి బాకీలు రాబట్టుకోవడానికి కొత్త విధానాలు అవలంభిస్తారు.

**తుల :** వ్యక్తిగత సౌకర్యాలకు గాను, ఈరోజు అధికంగా ధనాన్ని ఖర్చు చేస్తారు. ఆరోగ్యపరంగా విశేషమైన జాగ్రత్తలు తీసుకుంటారు.

**వృశ్చికం:** ప్రముఖవ్యక్తి ద్వారా ఒక ముఖ్యమైన వ్యవహారాన్ని విజయవంతంగా పూర్తి చేస్తారు.విందు, వినోదాలు పాల్గొంటారు.

**ధనుస్సు:** ముఖ్యమైన పనులు వాయిదా పడే సూచనలు ఉన్నాయి. రచన, వ్యాపారాల పట్ల ఆసక్తి చూపుతారు. వస్త్రలాభం.

**మకరం:** జీవిత భాగస్వామితో భేదాభిప్రాయాలు ఏర్పడకుండా ముందు చూపులతో వ్యవహరించండి. వృత్తిలో అనుకోని మార్పులు.

**కుంభం:** నూతన పెట్టుబడులకు అనుకూలంగా ఉంది. కొన్ని విషయాలలో పట్టిందల్లా బంగారంగా ఉంటుంది.

**మీనం:** సన్నిహితుల సహాయంతో కొన్ని వ్యవహారాలలో విజయం సాధిస్తారు. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

02-3Pg8exHMNWJQE.qxd:02-3Pg8exHMNWJQE.qxd 1/1/02 6:40 AM Page 1



# పశ్చిమాసియాతో భారత్ సుదీర్ఘ బంధం

## ప్రధాని మోడీ ఇజ్రాయెల్ పర్యటనతో పటిష్టం



**భారత విదేశాంగ విధానం పశ్చిమాసియాతో ఎప్పుడూ సిద్ధాంత పరంగా కానీ, కఠినంగా కానీ లేదు. వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తితో పాటు ఆచరాణాత్మక జాతీయ శ్రేయస్సును దృష్టిలోకి తీసుకుని భారత్ అమలు చేసింది. ఇజ్రాయెల్, అరబ్, ఇరాన్ దేశాలతో ఇంధన భద్రత, వాణిజ్యం, భారత సంతతి సంక్షేమం, ఉగ్రవాదంపై పరస్పర సహకారం, సాంకేతికత ఆధునీకరణలపై దశాబ్దాలుగా సమన్వయంతో కూడిన సంబంధాలను భారత్ కొనసాగించింది.**

న్యూఢిల్లీ, మార్చి 1: ప్రధానిమోడీ ఇజ్రాయెల్ పర్యటన సుదీర్ఘకాలం నుంచి కొనసాగుతున్న మైత్రీ బంధానికి చిహ్నంగానే కాకుండా పశ్చిమ ఆసియా పట్ల ఉన్న దీర్ఘకాలిక అనుబంధాన్ని గుర్తుచేసింది. భారత విదేశాంగ విధానం ఈ ప్రాంతంలో ఎప్పుడూ సిద్ధాంత పరంగా కానీ, కఠినంగా కానీ లేదు. వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తితోపాటు ఆచరాణాత్మక జాతీయ శ్రేయస్సు ను పరిగణనలోనికి తీసుకుని భారత్ అమలు చేసింది. ఇజ్రాయెల్, అరబ్, ఇరాన్‌దేశాలతో ఇంధన భద్రత, వాణిజ్యం, భారత సంతతి సంక్షేమం, ఉగ్రవాదంపై పరస్పర సహకారం, సాంకేతికత ఆధునీకరణలపై దశాబ్దాలుగా సమన్వయంతో కూడిన సంబంధాలను భారత్ కొనసాగించింది. పశ్చిమాసియా దేశాలకు వ్యూహాత్మకంగానే కాకుండా ఈ దేశాల సంస్కృతి సాంప్రదాయాలకు అనుగుణంగా కూడా భారత్ ముందుకు సాగింది. 1992లో భారత్ ఇజ్రాయెల్ సంబంధాలకు పునాదులు పడ్డాయి. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయి దౌత్యసంబంధాలను కొనసాగించింది. అప్పటి నుంచి రక్షణ, సాంకేతిక రంగాల్లో పరస్పర సహకారం కొనసాగుతూనే వస్తోంది. నిజానికి భారత్‌కు ఇజ్రాయెల్ కీలక రక్షణ భాగస్వామిగా కొనసాగుతోంది. వ్యవసాయం, జలవనరుల పర్యవేక్షణ, సైబర్ సెక్యూరిటీ, సృజనాత్మక రంగాల్లో మరింతగా ఈ సంబంధాలు విస్తరించాయి. ఇటీవలి కాలంలో ఈ సంబంధాలు మరిన్ని రంగాలకు విస్తరించాయి. ప్రధాని మోడీ ఆధ్వర్యంలో ఈ సంబంధాలను మరింతగా ముందుకు తీసుకువెళ్లింది. పాలస్తీనా సమస్యతో భారత్ ఇజ్రాయెల్ సంబంధాలను సమన్వయంతో కొనసాగించింది. ఇజ్రాయెల్ తన సొంత వ్యూహంతోనే పాలస్తీనా సమస్యపై ముందుకు వెళ్లింది. ముఖ్యంగా పాలస్తీనా సమస్యపై రెండు దేశాల పరిష్కారంపై అప్రమత్తంగా వ్యవహరించింది. పాలస్తీనా ప్రత్యేక దేశ హోదాకు మద్దతిస్తూనే దౌత్యపరమైన సంబంధాలు కూడాపాలస్తీనా నాయకత్వంతో కొనసాగించింది. 2017 తర్వాత ప్రధాని మోడీ రెండోసారి జరిపిన ఇజ్రాయెల్ పర్యటనతో ప్రాంతీయ అనిశ్చితికి తెరదించింది. గాజా కాల్పుల విరమణ ఉద్రిక్తతలు, అమెరికా–ఇరాన్ వివాదాలు, భౌగోళిక ఉద్రిక్తతల పట్ల సంయమనంతో కూడిన వైఖరులతో భారత్ వ్యూహాత్మక వైఖరిని అనుస రించింది. ప్రధాని మోడీ ఈసారి ఇజ్రాయెల్ పార్లమెంటు నెస్సెట్‌ను ఉద్దేశించి ప్రసంగించడం భారత్ ప్రతిష్టను ఇనుమడింప చేయడంతోపాటు ఇజ్రాయెల్ ప్రజల్లో భారత్‌పట్ల ఉన్న గౌరవాభిమానాలను మరింత పెంచింది. ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, అధ్యక్షుడు ఇసాక్ హెర్జోగ్‌లతో జరిపిన చర్చలు కూడా మంచి ఫలితాలిచ్చాయి. రక్షణ రంగంలో సహకారం, కృత్రిమ మేధ, స్టార్టప్స్, రెండు దేశాల మధ్య కనెక్టివిటీ, విద్యా రంగాలపైనే విస్తృతస్థాయిలో చర్చలుజరిగాయి. ఇజ్రాయెల్ పార్లమెంటులో ప్రధాని మోడీ ప్రవేశించగానే సభ్యులందరూ లేచినిలబడి భారత ప్రధానికి స్వాగతం పలకడం రెండు దేశాల మధ్య ఉన్న సంస్కృతిక ప్రాభవాన్ని గుర్తుచేసింది. కేవలం రక్షణరంగ లావాదేవీలకు మాత్రమే పరిమితం కాకుండా ఎకో వ్యవస్థలపై కొత్త సృజనాత్మక ఆవిష్కరణలు, వ్యూహాత్మక చర్చలు, ఇరుదేశాల ప్రజలతో ఉన్న సంబంధాలను మమేకం చేసిందని చెప్పుకోవచ్చు. ఇజ్రాయెల్ ఇటీవలి చర్యలపై ప్రపంచ వ్యాప్తంగా విమర్శనాత్మక చర్చలు జరుగుతున్న తరుణంలో ప్రధాని ఇజ్రాయెల్ పర్యటనపై ప్రశ్నలు అనేకం ఉత్పన్నం అయ్యాయి. భారత్ అనుసరించి వ్యూహాత్మక దౌత్యవిధానం ఇపుడు మరింత విశ్వాసాన్ని పెంచింది. గల్ఫ్‌దేశాలతో ఉన్న విస్తృతస్థాయి సంబంధాలను కూడా ఇజ్రాయెల్‌తో దౌత్యం విఘాతం కలిగించలేదు. ఇతర అరబ్ దేశాలు భారత్‌తో సంబంధాలకే ఎక్కువ మొగ్గు చూపించాయి. పశ్చిమాసియాలో భారతీయ సంతతి ప్రజల సంక్షేమం కూడా ఇపుడు భారత్‌కు ముఖ్యం కాబట్టి భారత్ అటు అరబ్బు దేశాలతోపాటు పశ్చిమాసియా ఇతర దేశాలనుకూడా సమన్వయంతో కలుపుకుని వెళుతోంది. విభిన్న రంగాలతో ఏర్పడిన వాణిజ్య బంధానికి తోడు దౌత్యబంధం కూడా వ్యూహాత్మక భాగస్వామ్య విధానంతో ముందుకు పోవడం వల్ల భారత దేశ శ్రేయస్సు ను పరిగణనలోనికి తీసుకునే ముందుకు వెళుతున్నట్లుగా కనిపించింది. ప్రస్తుత కాలంలో ప్రాంతీయ అనిశ్చితి, కూటముల్లో ఏర్పడుతున్న కప్పదాటుల తరుణంలో ఒకే విధానంపై ముందుకు పోవడం భారత్‌కు ఉన్న ధృఢమైన సంకల్పం అనే చెప్పాలి. భాగస్వామ్యాలు మరింత లోతైన బంధాలను పెంచుతాయి, మౌలిక సూత్రాలు సమన్వయంతో కూడా దౌత్యబంధం, వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తికి భారత్ అనుసరిస్తున్న సుదీర్ఘ విదేశాంగ విధానమే మేలని చెప్పక తప్పదు.

# ఖమేనీ కోటను ఎలా బద్దలు కొట్టారంటే...

**• కాంపౌండ్‌పై 30 బాంబులు • నిఘావర్గాల పక్కా సమాచారంతోనే దాడి**



టెల్‌అవీవ్, మార్చి 1: ఇజ్రాయెల్ – అమెరికా మధ్య సమన్వయ ప్రణాళికలో భాగంగా ఇరాన్ సుప్రీం నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ నివసించే కాంప్లెక్స్‌పై ఇజ్రాయెల్ ఫైటర్ జెట్‌లు 30 బాంబులు జారవిడిచాయి. వాల్ స్ట్రీట్ జర్నల్ ప్రకారం, ఖమేనీ ఉన్న ప్రదేశం గుర్తించబడిన తర్వాత ఇజ్రాయెల్ ఫైటర్ జెట్‌లు ఆయన నివసించే కాంప్లెక్స్‌పై 30 బాంబులు జారవిడిచాయి. ఇస్లామిక్ రిపబ్లిక్ సీనియర్ రాజకీయ, సైనిక నాయకుల ఉమ్మడి సమావేశం కోసం ఇజ్రాయెల్, అమెరికన్ నిఘా అధికారులు చాలా కాలంగా ఎదురుచూస్తున్నారని, వారిపై ఒకేసారి దాడి చేయాలని ఇజ్రాయెల్ అధికారులు శనివారం అలాంటి మూడు సమావేశాలను గుర్తించారని, ఆ సమయంలో ఖమేనీ ఉన్న ప్రదేశం కూడా నిర్ణయించబడిందని ఇజ్రాయెల్ అధికారులు తెలిపారు. వాల్ స్ట్రీట్ జర్నల్ ఈ క్షణాన్ని "ప్రత్యేకమైన" అవకాశంగా అభివర్ణించింది, దీనివల్ల పట్టపగలు దాడి జరగాల్సి వచ్చింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దాడి ఉత్తర్వు జారీ చేయడానికి ముందే ఇస్లామిక్ రిపబ్లిక్ అమెరికన్ లక్ష్యాలపై చర్య తీసుకుంటుందని వాషింగ్టన్ నిఘా వర్గాలకు సమాచారం అందిందని నివేదిక పేర్కొంది. ఆ నిఘా సమాచారం అమెరికా అధ్యక్షుడి నిర్ణయానికి మరింత ఆవశ్యకతను జోడించిందని ఆ వర్గాలు తెలిపాయి. ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ, రక్షణ మంత్రి అమీర్ నసేర్జాదే, కమాండర్ ఇన్ చీఫ్ మొహమ్మద్ పక్‌పూర్‌తో సహా అనేక సైనిక స్థావరాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాలనలోని అగ్ర రాజకీయ నాయకత్వ కార్యాలయాలను లక్ష్యంగా చేసుకుని అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త సైనిక చర్యకు దిగాయి. 1989 నుండి ఇరాన్‌కు నాయకత్వం వహిస్తున్న 86 ఏళ్ల ఖమేనీ ఈ దాడిలో మరణించారు. ఇరాన్ రక్షణ మంత్రి జనరల్ అమిర్ నసీర్జాదే, చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ అబ్దోల్ రహీమ్ మోసావి, ఖమేనీ కుమార్తె, మనవడు, అల్లుడు, కొడుకు మృతిచెందారు. ఇరాన్ రక్షణ మండలి సమావేశాన్ని లక్ష్యంగా చేసుకుని జరిగిన వైమానిక దాడిలో రక్షణ మంత్రి, ఆర్మీ చీఫ్ మరణించారు. రక్షణ మంత్రి మరణించినట్లు ఇరాన్ అధికారికంగా ధ్రువీకరించింది. సాయుధ దళాలకు చెందిన పలువురు కమాండర్లు కూడా మరణించారని, వారి పేర్లను తర్వాత ప్రకటిస్తామని

## సంక్లిష్టమైన వ్యూహం...

టెహ్రాన్, మార్చి 1: ఇరాన్ అత్యున్నత అధికార కేంద్రం "పాశ్చర్ స్ట్రీట్"లోని సుప్రీం లీడర్ నివాసం అత్యంత పటిష్టమైన భద్రతకు మారుపేరు. అణుదాడులను కూడా తట్టుకునేలా నిర్మించిన ఆ కోటను బద్దలుకొట్టడానికి అమెరికా, ఇజ్రాయెల్ అత్యంత సంక్లిష్టమైన "ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ"ని అమలు చేశాయి. ఈ దాడి ఎలా జరిగిందనే అంశం ఇప్పుడు అంతర్జాతీయ రక్షణ నిపుణులను సైతం ఆశ్చర్యపరుస్తోంది.

వ్యూహం1: పగటి పూట దాడులతో విస్మయం

సాధారణంగా ఏ దేశమైనా వైమానిక దాడులను శత్రువు అప్రమత్తంగా లేని అర్ధరాత్రి వేళల్లో చేపడుతుంది. కానీ, ఈసారి అమెరికా–ఇజ్రాయెల్ వ్యూహకర్తలు దీనికి భిన్నంగా పగటిపూట దాడులు ప్రారంభించారు. ఇరాన్ అధికారులు కార్యాలయాల్లో సమావేశమై ఉండే సమయాన్ని ఎంచుకుని, వారు ఊహించని విధంగా విరుచుకుపడ్డారు.

వ్యూహం2: భూమి, ఆకాశం, సముద్రం.. ముప్పేట దాడి

టెహ్రాన్ నగరాన్ని మూడు వైపుల నుంచి చుట్టుముట్టేలా ఈ ఆపరేషన్ ప్లాన్ చేశారు. పర్షియన్ గల్ఫ్‌లో ఉన్న అమెరికా యుద్ధ నౌకలు, జలాంతర్గాముల నుంచి వేలాది కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగల"టోమాహాక్ క్రూయిజ్ క్షిపణులను ప్రయోగించారు. అమెరికాకు చెందిన ఎఫ్35 స్టీల్త్ ఫైటర్లు, బి2 బాంబర్లు రాడార్లకు చిక్కకుండా ఇరాన్ గగనతలంలోకి ప్రవేశించి"పిన్ పాయింట్" బాంబు దాడులు చేశాయి. సరిహద్దు దేశాల నుంచి హైమార్స్ రాకెట్ సిస్టమ్స్ ద్వారా ఖచ్చితమైన లక్ష్యాలపై దాడులు జరిగాయి.

వ్యూహం3: సరికొత్త "లుకాస్" డ్రోన్ల వినియోగం

ఈ ఆపరేషన్‌లో అతిపెద్ద ప్రధానాంశం. లో కాస్ట్ అన్ మ్యాన్డ్ కాంబాట్ అటాక్ సిస్టం(లుకాస్) డ్రోన్లు. అమెరికా సైన్యం తొలిసారిగా ఈ కమికేజ్ (సూసైడ్) డ్రోన్లను భారీ స్థాయిలో వాడింది. ఇరాన్ సొంతంగా తయారు చేసుకునే షాహెద్ డ్రోన్ల తరహాలో ఉండే ఈ డ్రోన్లు గుంపులుగా వచ్చి ఇరాన్ రక్షణ వ్యవస్థలైన ఎస్300 క్షిపణులను ఏమార్చి, ఖమేనీ నివాసాన్ని నేరుగా తాకాయి. శాటిలైట్ చిత్రాల ప్రకారం.. కేవలం నిమిషాల వ్యవధిలోనే ఆ ప్రాంతమంతా శిథిలాల కుప్పగా మారిపోయింది. ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థలను పూర్తిగా నిర్వీర్యం చేసిన తర్వాతే ఈ దాడులు జరగడం విశేషం.

## మంటల్లో పశ్చిమాసియా



# పాకిస్థాన్‌కు అంటుకున్న 'ఇరాన్' మంటలు..

### అమెరికా కాల్పుల్లో 12 మంది మృతి

ఇస్లామాబాద్, మార్చి 1: ఇరాన్‌లో ఖమేనీ మరణం మంటలు పాకిస్థాన్‌కు వ్యాపించాయి. పాకిస్థాన్‌లో కరాచీ, లాహోర్‌లో ఇజ్రాయెల్, అమెరికాకు వ్యతిరేకంగా ప్రజలు హింసాత్మక నిరసనలకు పాల్పడుతున్నారు. కరాచీలోని యుఎస్ ఎంబసీపై దాడులకు తెగబడ్డారు. రాయబార కార్యాలయాన్ని తగలపెట్టే ప్రయత్నం చేశారు. పరిస్థితి తీవ్రం కావడంతో యుఎస్ కాన్సులేట్‌లోని అమెరికా సైనిక సిబ్బంది అల్లరిమూకపై కాల్పులు జరిపింది. ఈ దాడుల్లో 12 మంది మరణించారు. చాలామంది గాయపడినట్లు తెలుస్తోంది. కరాచీలోని ఎంటిఖాన్ రోడ్‌లోని అమెరికా కాన్సులేట్ వెలుపల పెద్దసంఖ్యలో నిరసనకారులు గుమిగూడడంతో ఈ సంఘటన ప్రారంభమైంది. ఇరాన్‌లో అయతుల్లా ఖమేనీ, అతని కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకోవడంపై వారు తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. నిరసనకారులు ఎంబసీ కాంపౌండ్‌లోకి ప్రవేశించడానికి ప్రయత్నించి భద్రతాబలగాలపై రాళ్లు రువ్వారు. పరిస్థితిని నియంత్రించడానికి పాక్ పోలీసులు, అమెరికా భద్రతా దళాలు మొదట భాష్పవాయు గోళాలు ప్రయోగించి, ఆ తర్వాత కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో 12 మంది మరణించగా, మరో 30 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానిక ఆస్పత్రులకు తరలించారు. వీరిలో చాలామంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

# మీ కోసం నరక ద్వారాలు తెరిచాం

### అమెరికా, ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రతీకార దాడులు

టెహ్రాన్, మార్చి 1: మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు దట్టంటా అలుముకున్నాయి. ఇరాన్ అణు చర్చలు విఫలమైన నేపథ్యంలో అమెరికా, ఇజ్రాయెల్ ఉమ్మడిగా నిర్వహించిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణించడం తెలిసిందే. టెహ్రాన్‌తో పాటు పలు నగరాలపై జరిగిన ఈ భీకర వైమానిక దాడులకు ప్రతీకారంగా ఇరాన్ గంటల వ్యవధిలోనే తన ప్రతాపాన్ని చూపించింది. 'ఆపరేషన్ ట్రూ ప్రామిస్ 4' పేరుతో ఇరాన్ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ అమెరికా, ఇజ్రాయెల్ స్థావరాలపై విరుచుకుపడింది. శత్రువులకు నరకం అంటే ఎలా ఉంటుందో చూపిస్తామని తీవ్ర హెచ్చరికలు చేసింది. ఖమేనీ మరణం తర్వాత ఇరాన్ అయిదో దశ దాడులను ముమ్మరం చేసింది. కువైట్‌లోని అబ్దుల్లా ముబారక్ ప్రాంతంలో ఉన్న అమెరికన్ నావల్ బేస్‌పై 4 బాలిస్టిక్ క్షిపణులు, 12 డ్రోన్లతో ఇరాన్ దాడి చేసింది. ఈ ఘటనలో బేస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పూర్తిగా ధ్వంసమైందని, పలువురు అమెరికన్ సైనికులు మరణించారని సమాచారం. అటు హిందూ మహాసముద్రంలోనూ ఇరాన్ అలజడి సృష్టించింది. అమెరికా నౌకలకు ఇంధనం సరఫరా చేస్తున్న కంబాట్ సపోర్ట్ షిప్‌పై 'ఖద్ర 280' క్షిపణులతో దాడి చేసింది. మరోవైపు, దుబాయ్‌లోని జెబెల్ అలీ యాంకరేజ్‌లో అమెరికాకు ఆయుధాలు చేరవేస్తున్న నౌకపై కూడా డ్రోన్ దాడులు జరిగాయి. ఈ దాడుల తీవ్రతకు దుబాయ్ ఎయిర్‌పోర్ట్ కార్యకలాపాలు పూర్తిగా స్తంభించిపోయాయి. తమ నాయకుడి మరణానికి ప్రతీకారంగా 'చరిత్రలోనే అత్యంత భయంకరమైన అఫెన్సివ్ ఆపరేషన్' చేపడతామని ఐఆర్‌జిసి హెచ్చరించింది. 'శత్రువులకు నరక ద్వారాలు తెరిచి ఉంచుతాం.. ఇమామ్ హంతకులకు కచ్చితంగా శిక్ష పడుతుంది' అని ఇరాన్ సైన్యం ప్రకటించింది.

# యుఎఇపై 137 బాలిస్టిక్ క్షిపణులు..
# 200కిపైగా డ్రోన్లతో ఇరాన్ ఐఆర్‌జీసీ దాడులు

అబూదాబి, మార్చి 1: మధ్యప్రాచ్యం అట్టుడుకుతోంది. అమెరికాఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇరాన్ అత్యున్నత నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీ మరణించినట్టు ఇరాన్ ప్రభుత్వ మీడియా ఆదివారం ధ్రువీకరించింది. ఇదే సమయంలో, ఇరాన్ ప్రయోగించిన వందలాది క్షిపణులు, డ్రోన్లతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)పై భీకర దాడి జరిగింది. ఈ పరిణామాలు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. యూఏఈపై ఇరాన్ మొత్తం 137 బాలిస్టిక్ క్షిపణులు, 209 డ్రోన్లతో దాడి చేసిందని, వాటిలో చాలా వరకు విజయవంతంగా అడ్డుకున్నామని యూఏఈ రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. 132 క్షిపణులను గాల్లోనే ధ్వంసం చేయగా, 195 డ్రోన్లను కూల్చివేసినట్టు తెలిపింది. మిగిలినవి సముద్రంలో, దేశంలోని వివిధ ప్రాంతాల్లో పడ్డాయని పేర్కొంది. ఈ దాడుల శిధిలాలు అబుదాబి, దుబాయ్‌లలో పడటంతో నష్టం వాటిల్లింది. అబుదాబిలోని జాయెద్ అంతర్జాతీయ విమానాశ్రయం లక్ష్యంగా వచ్చిన డ్రోన్‌ను అడ్డుకునే క్రమంలో దాని శకలాలు కిందపడి ఆసియా దేశానికి చెందిన ఒకరు మరణించగా, మరో ఏడుగురు గాయపడ్డారు. దుబాయ్‌లోని పామ్ జుమేరా ప్రాంతంలో ఓ భవనంపై క్షిపణి శిథిలాలు పడటంతో నలుగురు గాయపడ్డారు. ఈ దాడుల వల్ల విమాన రాకపోకలకు అంతరాయం కలిగి, సుమారు 20,200 మంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అధికారులు తెలిపారు. మరోవైపు, ఖమేనీ మరణంతో ఇరాన్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయనతో పాటు మరో నలుగురు కుటుంబసభ్యులు కూడా ఈ దాడుల్లో మరణించినట్టు ప్రకటించింది. ప్రభుత్వం 40 రోజుల సంతాప దినాలను ప్రకటించింది.

# ఇరాన్ సుప్రీం లీడర్ హత్యపై పుతిన్ ఆగ్రహం

### ఇదొక కిరాతక చర్య: పుతిన్

మాస్కో, మార్చి 1: ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ మరణంపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తీవ్రంగా స్పందించారు. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో ఖమేనీ ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీన్ని సినికల్ మర్డర్ (కిరాతక హత్య)గా అభివర్ణించిన పుతిన్ ఇది అంతర్జాతీయ చట్టాలను, మానవత్వాన్ని పూర్తిగా ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. ఈ మేరకు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌కు పుతిన్ ఓ లేఖ రాశారు. ఖమేనీని రష్యాలో అత్యుత్తమ రాజనీతిజ్ఞుడిగా గుర్తుంచుకుంటామని, ఇరుదేశాల సంబంధాల బలోపేతానికి ఆయన ఎంతో కృషి చేశారని ఆ లేఖలో కొనియాడారు. ఖమేనీ మృతికి 40 రోజుల పాటు సంతాప దినాలను ఇరాన్ ప్రకటించింది. దీనికి ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ స్పష్టం చేసింది. బిటన్, ఫ్రాన్స్, జర్మనీ అధినేతలు స్పందిస్తూ అమెరికా–ఇరాన్ మధ్య చర్చలు జరగాలని సూచించారు. ఖమేనీ మరణం ప్రపంచ రాజకీయాల్లో, ముఖ్యంగా రష్యా–ఇరాన్ సంబంధాల్లో కీలక మార్పులకు కారణం కావచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

# పాక్-అఫ్ఘాన్‌మధ్య యుద్ధమేఘాలు..!

కాబూల్, మార్చి 1: పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు యుద్ధ వాతావరణానికి దారితీశాయి. ఆదివారం నాటికి ఇరు దేశాల మధ్య ఘర్షణ నాలుగో రోజుకు చేరుకుంది. ఆఫ్ఘన్ రాజధాని కాబూల్‌పై పాకిస్థాన్ యుద్ధ విమానాలు భీకర దాడులు చేస్తుండగా, వాటిని కూల్చివేసేందుకు యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ గన్‌లతో ఎదురుదాడి చేస్తున్నామని తాలిబన్ అధికార ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ ప్రకటించారు. తమ సరిహద్దు దళాలపై తాలిబన్ల దాడికి ప్రతీకారంగా పాకిస్థాన్ ఈ తీవ్ర చర్యలకు దిగింది. ఆపరేషన్ గజబ్ లిల్ హక్ పేరుతో కాబూల్, కాందహార్‌లోని తాలిబన్ సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు ప్రారంభించింది. "మా సహనం నశించింది. ఇక ప్రత్యక్ష యుద్ధమే" అని పాక్ రక్షణ మంత్రి ప్రకటించడం పరిస్థితికి పడుతోంది. పాకిస్థాన్‌లో విధ్వంసాలకు పాల్పడుతున్న తెహ్రీక్ఇ తాలిబన్ పాకిస్థాన్ ఉగ్రవాదులకు ఆఫ్ఘన్ తాలిబన్లు ఆశ్రయం కల్పిస్తున్నారని పాక్ చాలాకాలంగా ఆరోపిస్తోంది. ఈ ఆరోపణలను ఆఫ్ఘన్ ప్రభుత్వం తోసిపుచ్చుతోంది. తమ దేశంపై దాడికి ప్రయత్నించేవారిని అణచివేసే శక్తి తమ సైన్యానికి ఉందని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కూడా హెచ్చరించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పాకిస్థాన్ నేరుగా ఆఫ్ఘన్ రాజధానిపై వైమానిక దాడులకు పాల్పడటం అంతర్జాతీయంగా ఆందోళన రేకెత్తిస్తోంది. 2,600 కిలోమీటర్ల పొడవైన సరిహద్దు కలిగిన ఈ రెండు దేశాల మధ్య తాజా ఘర్షణలు అత్యంత ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయి.

# ఇరాన్ ఐఆర్జిసి చీఫ్‌గా అహ్మద్ వాహిదీ

టెహ్రాన్, మార్చి 1: యుద్ధం కొనసాగుతున్న వేళ ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. తన ఐఆర్జిసికు కొత్త కమాండర్ ఇన్‌చీఫ్‌ను బ్రిగేడియర్ జనరల్ అహ్మద్ వాహిదీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ దాడుల్లో ఐఆర్జిసి కమాండర్ మహ్మద్ పాక్పూర్ మరణం వార్త ధృవీకరించగానే నియామకం జరిగింది. అహ్మద్ వాహిదీకి సైన్యంలోనూ, ప్రభుత్వంలోనూ విశేష అనుభవం ఉంది. గతంలో ఆయన ఇరాన్ రక్షణ మంత్రిగా, అంతర్గత వ్యవహారాల మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుత యుద్ధ వాతావరణంలో, వ్యూహరచనలో నిపుణుడైన వాహిదీ నియామకం ద్వారా సైనిక బలగాల్లో ఐక్యతను తీసుకురావాలని ఇరాన్ ప్రభుత్వం భావిస్తోంది.

### మధ్యప్రాచ్యంలో అలుముకున్న
# యుద్ధమేఘాలు

**అమెరికా స్థావరాలపై ఇరాన్ ఐఆర్‌జీసీ దాడులు**

టెహ్రాన్, మార్చి 1: ఇరాన్ అణు చర్చలు విఫలమైన నేపథ్యంలో అమెరికా, ఇజ్రాయెల్ ఉమ్మడిగా నిర్వహించిన ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతోల్లా అలీ ఖమేనీ మరణించడం తెలిసిందే. టెహ్రాన్‌తో పాటు పలు నగరాలపై జరిగిన ఈ భీకర వైమానిక దాడులకు ప్రతీకారంగా ఇరాన్ గంటల వ్యవధిలోనే తన ప్రతాపాన్ని చూపించింది. ఆపరేషన్ ట్రూ ప్రామిస్4 పేరుతో ఇరాన్ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) అమెరికా, ఇజ్రాయెల్ స్థావరాలపై విరుచుకుపడింది. ఖమేనీ మరణం తర్వాత ఇరాన్ ఐదో దశ దాడులను ముమ్మరం చేసింది. కువైట్‌లోని అబ్దుల్లా ముబారక్ ప్రాంతంలో ఉన్న అమెరికన్ నావల్ బేస్‌పై 4 బాలిస్టిక్ క్షిపణులు, 12 డ్రోన్లతో ఇరాన్ దాడి చేసింది. ఈ ఘటనలో బేస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పూర్తిగా ధ్వంసమైందని, పలువురు అమెరికన్ సైనికులు మరణించారని సమాచారం. అటు హిందూ మహాసముద్రంలోనూ ఇరాన్ అలజడి సృష్టించింది. అమెరికా నౌకలకు ఇంధనం సరఫరా చేస్తున్న కంబాట్ సపోర్ట్ షిప్‌పై ఖద్ర 380 క్షిపణులతో దాడి చేసింది. మరోవైపు, దుబాయ్‌లోని జెబెల్ అలీ యాంకరేజ్‌లో అమెరికాకు ఆయుధాలు చేరవేస్తున్న నౌకపై కూడా డ్రోన్ దాడులు జరిగాయి. ఈ దాడుల తీవ్రతకు దుబాయ్ ఎయిర్‌పోర్ట్ కార్యకలాపాలు పూర్తిగా స్తంభించిపోయాయి. పర్షియన్ గల్ఫ్ దేశాలతోపాటు ఇరాక్ కుర్దిస్తాన్‌లోని అమెరికా బేస్‌లపై కూడా ఇరాన్ ఎయిర్ ఫోర్స్ బాంబుల వర్షం కురిపించింది. ఖమేనీ మరణం తర్వాత మధ్యప్రాచ్యంలో పరిస్థితులు పూర్తిగా అదుపు తప్పింది.

# ఖమేనీ హత్యతో ఇరాన్ వీధుల్లో సంబరాలు!



టెహ్రాన్, మార్చి 1: నాలుగున్నర దశాబ్దాల ఇరాన్ షియా పాలనలో అత్యంత కీలక పరిణామం చోటుచేసుకుంది. దేశాన్ని 36 ఏళ్లుగా ఉక్కు పిడికిలితో ఏలిన సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ(86) శకం ముగిసింది. అమెరికా, ఇజ్రా యెల్ సంయుక్తంగా జరిపిన మెరుపుదాడిలో ఆయన హతమయ్యారు. ఈ వార్త పశ్చిమాసి యాలో కార్చిచ్చులా వ్యాపించగా, ఇరాన్‌లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఒకవైపు ప్రభుత్వం ప్రతీకారంతో రగిలిపోతుంటే, మరోవైపు ప్రజలు వీధుల్లోకి వచ్చి సంబరాలు చేసుకుంటున్నారు. ఈ ఘటనతో యావత్ పశ్చిమాసియా యుద్ధ మేఘాల నీడలోకి జారుకుంది. ఖమేనీ మరణవార్తను ధ్రువీకరించిన వెంటనే, టెహ్రాన్, ఇస్ఫహాన్, షిరాజ్, కరాజ్ వంటి ప్రధాన నగరాల్లో అసాధారణ దృశ్యాలు కనిపించాయి. ప్రభుత్వ ఆంక్షలను, ఇంటర్నెట్ షట్‌డౌన్‌ను సైతం లెక్కచేయకుండా వేలాది మంది ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చారు. కొందరు భవనాలపైకి ఎక్కి ఆనందంతో కేరింతలు కొట్టగా, మరికొందరు వీధుల్లో నృత్యాలు చేస్తూ, మిఠాయిలు పంచుకుంటూ తమ స్వేచ్ఛను ప్రకటించుకున్నారు. నియంతృత్వ పాలన అంతమైంది... అంటూ నినాదాలు చేశారు. స్టార్‌లింక్ వంటి శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను ఉపయోగించి కొందరు ఈ సంబరాల వీడియోలను ప్రపంచానికి చేరవేయడంతో అవి సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఇటీవల ద్రవ్యోల్బణం, కఠినమైన సామాజిక నియమాల కు వ్యతిరేకంగా జరిగిన నిరసనలను ప్రభుత్వం ఉక్కుపాదంతో అణచివేసిన నేపథ్యంలో, ప్రజాగ్ర హం ఈ రూపంలో బయటపడిందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ హత్యపై ఇరాన్ ప్రభుత్వం తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతోంది. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కమాండర్లు అత్యవ సరంగా సమావేశమై ఈ దుశ్చర్యకు కారణమైన హంతకులపై చరిత్రలో కనివినీ ఎరుగని రీతిలో ప్రతీకారం తీర్చుకుంటామని భీకర ప్రతిజ్ఞ చేశా రు. ఇరాన్ క్యాబినెట్ సైతం అమెరికా, ఇజ్రాయె ల్‌కు తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరిం చింది. మా సుప్రీం లీడర్ నెత్తుటిబొట్టుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని అధికారిక ప్రకట న విడుదల చేసింది. మరోవైపు, ఈ దాడిని తామే నిర్వహించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. తన ట్రూత్ సోషల్ ఖాతాలో ఇజ్రాయెల్‌తో కలిసి అత్యంత పకడ్బందీగా ఈ ఆపరేషన్ పూర్తిచేశాం. మా అత్యాధునిక నిఘా వలయం నుంచి ఖమేనీ తప్పించుకోలేకపోయారని పేర్కొన్నారు. ఈ ప్రకటన వెలువడిన వెంటనే ఇరాన్ ప్రతీకార దాడులకు దిగింది. ఇజ్రాయెల్‌తో పాటు, అమెరికా సైనిక స్థావరాలున్న ఖతార్, యూఏఈ, బహ్రెయిన్, కువైట్‌లపై డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేసింది. దీంతో పశ్చిమాసియా యుద్ధ వాతావరణాన్ని కమ్మింది. ఒమన్ మధ్యవర్తిత్వంతో జెనీవాలో జరిగిన చర్చ లు విఫలమైన 48 గంటల్లోపే ఈ దాడి జరగ డం గమనార్హం. ఖమేనీ మరణంతో ఇరాన్ రాజ కీయ భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. ఆయన స్థానంలో ఎవరు వస్తారనే దానిపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అదే సమయంలో, ఈ పరి ణామం పశ్చిమాసియాను పెనుప్రమాదంలోకి నెట్టింది.

### ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్
# ఆర్మీచీఫ్ మౌసావి మృతి

టెహ్రాన్, మార్చి 1: ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇరాన్ ఆర్మీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ అబ్దోల్లాహిం మౌసవి మరణించినట్లు ఆ దేశ ప్రభుత్వ మీడియా ఇరిబ్ టీవీ ఆదివారం వెల్లడించింది. టెహ్రాన్‌పై జరిగిన ఈ భీకర దాడుల్లో ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ చీఫ్ కమాండర్ మొహమ్మద్ పాక్‌పూర్, రక్షణ మండలి కార్యదర్శి అలీ షంఖానీ, రక్షణ మంత్రి అజీజ్ నసిర్‌జాదే కూడా ప్రాణాలు కోల్పోయారు. టెహ్రాన్‌లోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఇరాన్ ఉన్నతాధికారులు సమావేశమైనట్లు మిలిటరీ ఇంటెలిజెన్స్ గుర్తించిందని, ఆ వెంటనే ఇజ్రాయెల్ ఎయిర్ ఫోర్స్ మెరుపు దాడులు చేసిందని ఇజ్రాయెల్ రక్షణ దళం ప్రకటించింది. ఈ ఆపరేషన్‌లో రక్షణ మంత్రి, ఐఆర్‌జీసీ చీఫ్ సహా మొత్తం ఏడుగురు సీనియర్ కమాండర్లను మట్టుబెట్టినట్లు ఐడీఎఫ్ తెలిపింది. మరికొంత మంది వివరాలు వెల్లడికావాల్సి ఉంది.

## నియంత పాలన ముగిసింది

### ఖమైనీ అంతంపై చివరి ఇరాన్‌షా కుమారుడు రెజా పెహ్లావి

ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ శకం ముగిసిందని, ఆయనను చరిత్ర పుటల నుంచి తుడిచిపెట్టేశామని ఇరాన్ చివరి షా కుమారుడైన రెజా పహ్లావి సంచలన ప్రకటన చేశారు. ఖమేనీ మరణంతో ఇస్లామిక్ రిపబ్లిక్ పాలన కూడా వాస్తవంగా ముగిసిపోయిందని ఆయన అన్నారు. ఇరాన్ ప్రజలను ఉద్దేశించి పహ్లావి ఒక ప్రకటన విడుదల చేశారు. ఖమేనీ రక్తపిపాసి నియంత. ఇరాన్‌కు చెందిన వేలాది మంది ధైర్యవంతులైన యువతీ యువకులను హత్య చేసిన వ్యక్తి. ఆయన మరణంతో ఇస్లామిక్ రిపబ్లిక్ అంతం మొదలైందన్నారు.

2-3Pg6exHMNWJQE.qxd:2-3Pg6exHMNWJQE.qxd 1/1/02 6:33 AM Page 1



## మహిళల కోసం మరిన్ని సంక్షేమ పథకాలు

విజయవాడ, మార్చి 1 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మరికొన్ని పథకాలను ఈ నెలలో అందుబాటులోకి తీసుకుని రానున్నది. మార్చి 8న మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకాలను ప్రకటించింది. ఎన్టీఆర్ విద్యాలక్ష్మి పథకం ద్వారా పిల్లల చదువుల కోసం రూ.1 లక్ష వరకు పావలా వడ్డీకే రుణం ఇచ్చే సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకుని వస్తోంది. ఎన్టీఆర్ కల్యాణలక్ష్మి అనే మరో పథకం ద్వారా కుమార్తె పెళ్లికి 48 గంటల్లోనే ఆర్థిక సాయం అందించే కార్యక్రమాన్ని అందుబాటులోకి తీసుకురానుంది. వీటితో పాటు యానిమేటర్లకు రూ.15 వేలు విలువైన ఉచిత స్మార్ట్‌ఫోన్లు ఉచితంగా అందజేయనుంది.

## దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం

విజయవాడ, మార్చి 1 ప్రభాతవార్త ప్రతినిధి: ఏపిలో ఆదివారం నుంచి దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ పథకం మొదలైంది. రాష్ట్రంలో దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత సదుపాయం కల్పిస్తూ ప్రభుత్వం నిన్న(శనివారం) ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు స్త్రీశక్తి పథకం కింద ఉచిత ప్రయాణం కల్పిస్తుండగా, వీటిలో దివ్యాంగులకు కూడా ఉచిత ప్రయాణం వర్తింపజేసింది. 40 శాతం, అంతకంటే ఎక్కువ శాతం వైకల్యం ఉన్న దివ్యాంగులకు ఉచిత ప్రయాణం వర్తిస్తుందని పేర్కొంది. గత ఏడాది డిసెంబరు 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు వారికి ఇంద్రధనస్సు పేరిట ఆరు పథకాలు ప్రకటించారు. అందులో ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కూడా ఒకటి. ఫిబ్రవరి 24న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకున్నారు. తాజాగా ఉత్తర్వు జారీచేశారు.

ప్రస్తుతం దివ్యాంగులకు మెట్రో ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, నాన్ స్టాప్, అంతర్‌రాష్ట్ర (ఇంటర్‌స్టేట్), సప్తగిరి ఎక్స్‌ప్రెస్ (తిరుమల ఘాట్‌లో తిరిగేవి), అల్ట్రా డీలక్స్ బస్సు సర్వీసుల్లోని టికెట్ ఛార్జీలో 50 శాతం రాయితీ ఇస్తున్నారు. విజయవాడ, విశాఖపట్నం నగరాల్లోని సిటీ ఆర్డినరీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం ఉంది. తాజా ఉత్తర్వు నేపథ్యంలో పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో కూడా దివ్యాంగుల ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పిస్తారు. మిగిలిన నాన్‌స్టాప్, సప్తగిరి ఎక్స్‌ప్రెస్, అల్ట్రా డీలక్స్, అంతర్‌రాష్ట్ర బస్సు సర్వీసుల్లో ఇప్పుడున్నట్లే 50 శాతం రాయితీ కొనసాగుతుంది. రాష్ట్రంలో 11 లక్షల మంది దివ్యాంగులు ఉన్నట్లు సంబంధిత శాఖ అధికారులు ఆర్టీసీకి వివరాలు అందజేశారు. ప్రస్తుతం ఆర్టీసీలో 2 లక్షల మంది దివ్యాంగులు మాత్రమే పాస్ వినియోగించుకుంటున్నారు.

## డిగ్రీ, వృత్తి విద్యా కళాశాలల అధ్యాపకులకు ఏఐ నేటి నుంచి శిక్షణా తరగతులు

విజయవాడ, మార్చి 1 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలోని డిగ్రీ, వృత్తి విద్యా కళాశాలల అధ్యాపకులకు కృత్రిమ మేధస్సు(ఏఐ) క్రమశిక్షణ నిర్దిష్ట అనువర్తనాలు అంశంపై 5 రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యదర్శి బి.తిరుపతిరావు తెలిపారు. మార్చి 2 నుంచి 6 వరకు హైదరాబాద్ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో శిక్షణ తరగతులు జరుగుతాయని ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ విద్యా కార్యక్రమం, వికసిత్ భారత్2047 దార్శనికతకు అనుగుణంగా విభిన్న విద్యా విభాగాలలోని అధ్యాపకులకు ఏఐపై స్పష్టమైన, ఆచరణాత్మక అవగాహనను పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి కుటుంబంలో ఒక ఏఐ చాంపియన్‌ని తయారు చేయడం కూడా ఈ కార్యక్రమ లక్ష్యమని తెలిపారు. ఇక్కడ శిక్షణ పొందిన అధ్యాపకులు మాస్టర్ ట్రైనర్లుగా టిఓటి మోడల్ కింద మిగిలిన అధ్యాపకులకు శిక్షణ ఇస్తారన్నారు.

## పరువు హత్యపై సమగ్ర విచారణ చేయాలి

విజయవాడ, మార్చి 1 ప్రభాతవార్త ప్రతినిధి: తూర్పు గోదావరి జిల్లా, మండపేట మండలం ద్వారపూడి గ్రామంలో జరిగిన పరువు హత్యపై సమగ్ర విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఇద్దరు మేజర్లుగా ఉన్న యువతీయువకులు తమ జీవిత భాగస్వామిని ఎంచుకోవడం రాజ్యాంగం కల్పించిన హక్కు అని ఐద్వా రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కె.శ్రీదేవి, వి.సావిత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిప్యూటీ తహశీల్దారుగా పనిచేస్తున్న సంధ్య తన చిన్ననాటి స్నేహితుడైన సూర్యప్రకాష్‌ను వివాహం ఈ నెల 26వ తేదీన వివాహం చేసుకుందని తెలిపారు. ఈ వివాహంతో తమ పరువు పోయినట్లు భావించిన సంధ్య కుటుంబ సభ్యులు సూర్యప్రకాష్ ఇంటికి వెళ్లి అతనిపై దాడి చేయడంతో మృతి చెందినట్లు తెలిపారు. రాజ్యాంగం కల్పించిన హక్కును కులం పేరుతో నిరాకరించడం, హత్య చేయడం దారుణం, నేరంగా పేర్కొన్నారు. సంధ్య భర్తను చంపినవారిని కఠినంగా శిక్షించాలని

## ఇరాన్‌పై దాడి దుర్మార్గం: లెఫ్ట్ పార్టీలు

విజయవాడ, మార్చి 1 ప్రభాతవార్త ప్రతినిధి: అమెరికా, ఇజ్రాయెల్ కలసి ఇరాన్‌పై దాడి చేయడాన్ని సిపిఐ, సిపిఎంతో సహా 10 వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి. ఈ మేరకు పత్రికా ప్రకటనను విడుదల చేశారు. ఇరాన్ ప్రజలతోపాటు ఆ దేశ సుప్రీం లీడర్ ఖమేనీ భవనంపై దాడి చేసి, హత్య చేయడం, పాఠశాలలపై బాంబులు వేసి పిల్లల్ని చంపడం సామ్రాజ్య వాద దురహంకారానికి పరాకాష్ట అని పేర్కొన్నారు. ఈ దాడులు ఇరాన్ దేశ సార్వభౌమాధికారాన్ని, ఐక్యరాజ్య సమితి నిబంధనావళిని, అన్ని అంతర్జాతీయ ఒప్పందాలను దారుణంగా ఉల్లంఘించడమేనని తెలిపారు. ఈ దాడులను ఖండించాలని ప్రజాతంత్రవాదులకు, ప్రజలకు వామపక్షాలు విజ్ఞప్తి చేశాయి. ఇరాన్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ భారత ప్రభుత్వం ప్రకటన చేయాలని వామపక్షాలు డిమాండ్ చేశాయి. శాంతి కాముకులైన భారత ప్రజానీకం మోడీ తీసుకున్న వైఖరిని వ్యతిరేకించాలని, అలాగే అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని, దాని తొత్తు ఇజ్రాయెల్‌ని ఓడించడంలో ప్రపంచ ప్రజలంతా ఇరాన్ ప్రజలకు సంఘీభావంగా నిలవాలని 10 వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి.

## దొంతనం కేసులో ఇద్దరు నిందితులు అరెస్టు



కావలి (నెల్లూరు), మార్చి 1 ప్రభాతవార్త: నెల్లూరు జిల్లా కావలిలో గతనెల 23న పూనూరు వారి వీధిలో హైమావతమ్మ రైస్‌మిల్లు వద్ద జరిగిన దొంగతనం కేసులో ఇద్దరి నిందితులను అరెస్టు చేశామని స్థానిక డిఎస్‌పి శ్రీధర్ తెలిపారు. ముద్దురుపాడు టిడ్కో గృహానికి చెందిన సాలేటి లక్ష్మణరావు, పట్టణంలోని గట్టుపలెల వీధికి చెందిన దేవరకొండ ప్రేమ్‌కుమార్ మరో ఇద్దరితో కలసి ఈ దొంగతనానికి పాల్పడుతున్నట్లు తెలిపారు. ఒకటవ పట్టణ సిఐ ఫిరోజ్, ఎస్ఐ సుమన్, సిబ్బందితో కలసి హిందూ శ్మశాన వాటిక వద్ద నిందితులను అదుపులోకి తీసుకొని వారి నుంచి 160గ్రాముల బంగారాన్ని స్వాధీనంచేసుకొన్నామని తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌ఉ తరలిస్తున్నటుల డిఎస్‌పి తెలిపారు. పరారీలో ఉన్న మరో ఇద్దరిని త్వరలో పట్టుకుంటామని తెలిపారు. కేసును చేదించిన సిఐ, ఎస్ఐలను అభినందించారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యం

### దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



సంగం మార్చి 1 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం హయాంలో రెండో సారి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. సంగంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ డైరక్టర్ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నాదెండ్ల మనోహర్ సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రైతుల అభ్యున్నతి కోసం పారదర్శకంగా పని చేస్తుందని అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు పండించిన ప్రతి గింజను మద్దతు ధరతో కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో రైతుల ఖాతాల్లోకి నగదు జమ చేయడం జరుగుతుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం హయంలో వ్యవస్థలన్ని గాడిలో పడ్డాయని అన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఉన్నా నిత్యం అందుబాటులో ఉంటామని ఆయన తెలిపారు. జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియను మరింత సరళతరం చేస్తు రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ డైరక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి మాట్లాడుతు గతంలో రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకోవడానికి మిల్లుల వద్దకు వెళ్లాల్సి వచ్చేదని ఇప్పుడు ప్రతి గ్రామంలో ను కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం సేకరించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని సంగం,మర్రిపాడు వంటి ప్రాంతాల్లో ఈనెల 10 వ తేది నుండి అధికారికంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ మొదలౌతుందని అన్నారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులతో నిత్యం సమీక్షలు జరిపి ధాన్యం సేకరణలో జాప్య లేకుండా చూడాలని ఆదేశించినట్లు తెలిపారు. దళారులు లేదా మిల్లుల యజమానులు ప్రమేయం లేకుండా ప్రభుత్వమే నేరుగా రైతుల నుండి మద్దతు ధరతో ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ఎడ్యుకేషనల్ అండ్ వెలెపేర్ డైరక్టర్ అబూరు రమేష్‌నాయుడు, ఆత్మకూరు మార్కెట్ కమీటి ఛైర్మన్ జనార్దన్‌నాయుడు, బిజెపి రాష్ట్ర నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి జిల్లా, ప్రాథమిక సహకార సంఘం ప్రెసిడెంట్ గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు బాణా శ్రీనివాసులురెడ్డి, నీటి సంఘం అధ్యక్షులు బాబు, కర్నాటి రవీంద్రరెడ్డి, మెట్టు విజయకృష్ణారెడ్డి సొసైటీ డైరక్టర్లు జనార్దన్‌రెడ్డి, పట్టాభిరామిరెడ్డి, నీటి సంఘం అధ్యక్షులు సూరా శ్రీనివాసులురెడ్డి, దువ్వూరు సొసైటీ ప్రెసిడెంట్ బండా హరికిషోర్‌రెడ్డి, కోటు కరుణాకర్‌రెడ్డి, పావళ్ళ రత్నయ్య, ఆత్మకూరు మార్కెట్ కమీటి డైరక్టర్ ఉక్కాల శ్రీనివాసులు, జెండాదిబ్బ నాయకులు కంచర్ల నారాయణ నాయుడు, మైనార్టీ అధ్యక్షులు పఠాన్ ఫయాజ్, జెండాదిబ్బ నాయకులు నెల్లూరు పెంచలయ్య, వేణుబాలు, తదితరులు పాల్గొన్నారు.

# ఆ లిఫ్ట్... రాయలసీమ జీవనాడి



- సీఎం చంద్రబాబు స్వప్రయోజనాల కోసం సీమ రైతులకు అన్యాయం
- కడపలో వైసిపి సీమ జిల్లాల నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం

కడప కార్పొరేషన్, మార్చి 1 ప్రభాతవార్త: రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉద్దేశపూర్వకంగానే నిలిపివేశారని, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తో ఏపీ సీఎం చంద్రబాబు కుమ్మక్కై ప్రాజెక్టులను ఆపివేశారని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఆర్కే రోజా, ఉషశ్రీ చరణ్, అంజాద్ బాషా, సాకె శైలజానాథ్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సతీష్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ఎంపీలు వైఎస్ అవినాష్ రెడ్డి ఆరోపించారు. సీమ ప్రాంతానికి ప్రాణవాయువులాంటి ఈ పథకాన్ని అడ్డుకోవడం రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నట్లేనని అన్నారు. కరువు పీడిత రాయలసీమ ప్రాంతానికి రాయలసీమ ఎత్తిపోతల పథకం జీవనాడి వంటి ప్రాజెక్టు అని అన్నారు. రాయలసీమ నెల్లూరు ప్రకాశం జిల్లాలకు రైతులకు అతిపెద్ద కష్టం రాబోతుందన్నారు. రాయలసీమ కోసం కృష్ణ పరివాహ ప్రాంతం ప్రయోజనాల కోసం తీవ్రంగా పోరాటం చేస్తామన్నారు. కడప జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్ రెడ్డి అధ్యక్షతన ఆదివారం కడప నగరంలోని మేడా కన్వెన్షన్ సెంటర్ లో వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో రాయలసీమ ఎత్తిపోతల పథకం సాధన కోసం నిర్వహించిన గ్రేటర్ రాయలసీమ నేతల రౌండ్ టేబుల్ సమావేశానికి 8 జిల్లాల నుంచి ప్రజా వైసిపి ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎగువ రాష్ట్రం మహారాష్ట్రలో ఆల్మట్టి సామర్థ్యాన్ని పెంచుతున్నారని దీని కారణంగా శ్రీశైలం ప్రాజెక్టు నీళ్లు రావన్నారు. అరకొ రగా వచ్చిన నీళ్లను తెలంగాణ ప్రభుత్వం వాడుకుంటుందని తద్వారా సీమతో పాటు నెల్లూరు, ప్రకాశం రైతులకు పంటలు పండే అవకాశమే లేదన్నారు. ఆల్మట్టి ఎత్తు పెంచుతున్న సీఎం చంద్రబాబు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. శ్రీశైలం జలాశయంలో నీటి మట్టం 854 అడుగులకు చేరకముందే తెలంగాణ ప్రభుత్వం నీటిని తరలిస్తోందని, 800 అడుగుల నీటి సామర్థ్యంతోనే సీమ ప్రజలకు సాగునీరు అందించేందుకు రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని తీసుకొచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. సీమలో సుమారు రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉన్నప్పటికీ చంద్రబాబు స్పందించడం లేదని అన్నారు. రాయలసీమ అభివృద్ధి పట్ల ముందుచూపుతోనే మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఈ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారని పేర్కొన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నీటిని తీసుకోవాలంటే వరద నీరు రావాల్సిందేనని, లేకపోతే సీమ ప్రాంతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుందని తెలిపారు. సీమ అభివృద్ధి కోసం వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రైతుల పక్షాన పోరాటం కొనసాగిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మేయర్ సురేష్ బాబు, మేయర్ పాకా సురేష్, గురుమోహన్, కర్నూలు, నంద్యాల జిల్లా పార్టీ అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి, కాటసాని రాంభూపాల్ రెడ్డి, అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామి రెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ సుధా, చంద్రశేఖర్, అమర్ నాథరెడ్డి, విరూపాక్ష, మాజీ ఎమ్మెల్యేలు తొపుదుర్తి ప్రకాష్ రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్సీలు గోవింద రెడ్డి, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, కర్నూలు నంద్యాల, అనంతపురం సత్యసాయి, తిరుపతి, చిత్తూరు ప్రకాశం, నెల్లూరు జిల్లాల నియోజకవర్గం ఇంచార్జ్‌లు, రాష్ట్ర దినిది సభ్యులు శీనిది సభ్యులు, నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

# 5వేల మినీ అంగన్‌వాడీ సెంటర్లు... అప్‌గ్రేడ్

- మంత్రి పార్థసారథి వెల్లడి



సచివాలయం, మార్చి 1 ప్రభాత వార్త: మహిళా శిశు సంక్షేమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. అంగన్వాడీ కేంద్రాల్లో మహిళలు, పిల్లలకు పూర్తిస్థాయిలో పౌష్టికాహారం అందించడంతో పాటు వాటికి సొంత భవనాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు .సిబ్బందికి చెందిన అనేక సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం ఎంతో చొరవ చూపుతోందన్నారు. త్రాగునీరు, టాయిలెట్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో అంగన్వాడీ సెంటర్లు అత్యంత దయనీయ స్థితిలో ఉండేవని సకాలంలో టీచర్లకు జీతాలు చెల్లించేవారు కాదని టీచర్లు నానా ఇబ్బందులు పడేవారని, మినీ అంగన్వాడీ కార్యకర్తలకు టీచర్లుగా ప్రమోషన్ ఇచ్చిందిన మా ప్రభుత్వమే అన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో తాగునీరు మరుగు దొడ్లకు రూ.86.68 లక్షలు ఖర్చుచేశామన్నారు. సుమారు రూ.75 కోట్లతో 5జి, మొబైల్స్ కొనుగోలు చేసి 58,204 మంది టీచర్లకు అందించామని తద్వారా సెంటర్లలో చిన్నారులకు, గర్భిణీలకు బాలింతలకు ప్రభుత్వ సేవలు వేగంగా అందుతున్నాయన్నారు.

# సామాజిక మాధ్యమాల దుర్వినియోగాన్ని అడ్డుకోండి

### - సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జెకె మహేశ్వరి



విజయవాడ, మార్చి 1 ప్రభాతవార్త ప్రతినిధి: సామాజిక మాధ్యమాల దుర్వినియోగాన్ని ఎదుర్కొనేందుకు ప్రజలు సిద్ధం కావాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జెకె మహేశ్వరి తెలిపారు. సిఆర్ మీడియా అకాడమీ, స్వేచ్ఛది ఫ్రీడమ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యాన విజయవాడలోని నిర్వహించిన సెమినార్‌లో ఆయన ప్రధాన వక్తగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మహేశ్వరి మాట్లాడుతూ కంటెంట్ రూపొందించడంలో ప్రధాన పాత్ర వహించే వ్యక్తులు, సంస్థలకు జవాబుదారీ తనం చాలా ముఖ్యమని పేర్కొన్నారు. సోషల్ మీడియా యుగంలో స్వేచ్ఛ, బాధ్యత మధ్య వ్యత్యాసాన్ని చూపించడం కేవలం న్యాయ మూర్తులు లేక ప్రజా ప్రతినిధులు మాత్రమే చేసే పని కాదని, ఇది ఉమ్మడి పౌర సమాజ బాధ్యతగా పేర్కొన్నారు. వాట్సాప్ పుకార్ల వల్ల జరిగిన దమన కాండలు చూశామని, ఇవి అనేక ప్రాణాలను బలిగొన్నాయని తెలిపారు. నియంత్రణ స్వేచ్ఛను అణచివేయకూడదని, అదే సమయంలో రాజ్యాంగ క్రమాన్ని నాశనం చేయడానికి స్వేచ్ఛను ఆయుధంగా ఉపయోగించకూడదని ఆయన హితవు పలికారు. సిఆర్ అకాడమీ వంటి సంస్థలు, ముఖ్యమైనవని, అవి జర్నలిస్టుల నైపుణ్యాలను పెంచడమే కాకుండా, విలువలను ప్రోత్సహిస్తాయని పేర్కొన్నారు.

సెమినార్‌కు అధ్యక్షత వహించిన సిఆర్ మీడియా అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ మాట్లాడుతూ సోషల్ మీడియాలో ప్రధానంగా మహిళలు, ఇతర వర్గాలను బెదిరించే ధోరణిని అరికట్టి, సరైన రీతిలో సోషల్ మీడియాను వినియోగించుకునేలా చేయాలన్నారు. రాష్ట్ర మహిళా కమిషన్ అధ్యక్షులు రాయపాటి శైలజ మాట్లాడుతూ సోషల్ మీడియాకు మహిళలు ప్రధాన టార్గెట్ కావడం బాధాకరమన్నారు. దీనిపై కమిషన్ చురుగ్గా నిర్ణయాలు తీసుకుని, ఈ పెడధోరణులకు అడ్డుకట్ట వేసే ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఈగల్ చీఫ్ ఆకె రవి కృష్ణ మాట్లాడుతూ సోషల్ మీడియా దుర్వినియోగం కాకుండా సమాజ హితం కోసం పని చేసేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకు మరిన్ని చట్టాలు రావాలని ఆకాంక్షించారు.

## సిజెకు తిరుపతి జిల్లా అధికారుల సన్మానం



తిరుపతి, మార్చి 1 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతిలో ఆదివారం జరిగిన కోర్టుభవనాల సముదాయానికి భూమి పూజలో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ దంపతులకు తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, ఎస్పీ లంకెల సుబ్బరాయుడు శ్రీవారి కల్యాణోత్సవ ప్రతిమను బహుకరించి సత్కరించారు.

## ఘంటసాల విగ్రహానికి పాలాభిషేకం



తిరుపతి, మార్చి 1 ప్రభాతవార్త ప్రతినిధి: తన గానామృతంతో తెలుగు ప్రజలను ఉర్రూతలూగించిన ఘంటసాలను స్మరించుకోవడం ప్రతి తెలుగువారి బాధ్యత అని రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి తెలిపారు. తిరుపతిలో రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో ఘంటసాల అభిమానులు ఆదివారం తమ అభిమాన గాయకున్ని స్మరించుకుంటూ విగ్రహానికి మంచినీటితో శుద్ధిచేసి పుష్పాంజలితో నివాళి అర్పించారు. అనంతరం ఘంటసాల అభిమాని రామకృష్ణ మొదలియార్‌ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి, సభ్యులు తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, వెంకటేశ్వరులు, ఘంటసాల అభిమానులు కొట్టే సుబ్రహ్మణ్యం రెడ్డి, మిట్టపల్లి బ్రహ్మానందం, తులసిరామ్ నాయుడు, పోలే జనార్దన్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, వినాయక రెడ్డి, టీచర్ తిరుమలయ్య పాల్గొన్నారు.

## బిసిలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలి

చిత్తూరు, మార్చి 1 ప్రభాతవార్త: పార్లమెంటులో చట్టసభల్లో బిసిలకు రాజకీయ రిజర్వేషన్ల బిల్లును సత్వరం ప్రవేశపెట్టాలని జాతీయ బిసి సంక్షేమ సంఘ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని జాతీయ బిసి సంక్షేమ సంఘ కార్యాలయంలో ఆదివారం జాతీయ బిసి సంక్షేమ సంఘ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్.అరుణ్ కుమార్‌లను జాతీయ బిసి సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి, చిత్తూరు మాజీ టౌన్ బ్యాంకు ఛైర్మన్ షణ్ముగం కలిసి చర్చించారు. ఈ సమావేశంలో బిసి సంక్షేమ సంఘ నాయకులు జాతీయ స్థాయిలో బిసిల హక్కుల సాధనపై భవిష్యత్తు కార్యాచరణ కార్యక్రమాలపై చర్చించారు. సమగ్ర జనగణనలో ఓబిసి జనగణన చేపట్టాలని కేంద్ర మంత్రిమండలి తీసుకున్న నిర్ణయంను అమలు చేయాలని బిసి సంక్షేమ సంఘ నాయకులు కోరారు. అలాగే కేంద్రంలో బిసిలకు ప్రత్యేకంగా మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, చట్టసభల్లో బిసి మహిళలకు 33.3 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. అలాగే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో బిసిలకు జరుగుతున్న అట్రాసిటీ, హత్యలు, దాడులపై ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులను కలిసి చర్చించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘ నాయకులు నిర్ణయించారు. అలాగే బిసి మండల్ కమీషన్ సిఫార్సులను అమలు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చే దిశగా జాతీయ స్థాయిలో ఉద్యమం తీసుకురావాలని ఈ సమావేశంలో జాతీయ బిసి సంక్షేమ సంఘ నాయకులు తీర్మానించారు.

ఈ సందర్భంగా జాతీయ బిసి సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి, చిత్తూరు మాజీ టౌన్ బ్యాంకు ఛైర్మన్ పి.షణ్ముగం జాతీయ బిసి సంక్షేమ సంఘ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్.అరుణ్ కుమార్‌లను సత్కరించారు.

## పులివెందులలో అరటి తోట దగ్ధం



దగ్ధం అయిన అరటి తోటలో బాధిత రైతు

పులివెందుల, మార్చి 1 ప్రభాతవార్త: పులివెందుల మండల పరిధిలోని డంపింగ్ యార్డ్ సమీపంలో ఆదివారం అరటి తోటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టిన ఘటన కలకలం రేపింది. వెంకటాపురం గ్రామానికి చెందిన రైతు బియ్యపు రాజశేఖర్‌కు చెందిన సుమారు ఐదు ఎకరాల అరటి తోట పూర్తిగా దగ్ధమైంది. మరో పది రోజుల్లో కోతకు సిద్ధంగా ఉన్న సుమారు 100 టన్నుల అరటిపంట మంటల్లో కాలిపోవడంతో రైతుకు దాదాపు రూ.15 లక్షల మేర నష్టం వాటిల్లినట్టు సమాచారం. ఆకస్మికంగా చెలరేగిన మంటలతో తోట మొత్తం అగ్నికి ఆహుతి కావడంతో బాధిత కుటుంబం తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అయితే అప్పటికే పంట పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టినట్టు తెలిసింది. తనకు జరిగిన భారీ నష్టాన్ని ప్రభుత్వం గుర్తించి తక్షణ ఆర్థిక సహాయం అందించాలని రైతు బియ్యపు రాజశేఖర్ విజ్ఞప్తి చేశారు. ఈ ఘటన స్థానిక రైతుల్లో ఆందోళనకు దారి తీసింది.

## వాయులింగేశ్వరుని దర్శనం కోసం జనం జాతర

శ్రీకాళహస్తి, మార్చి 1 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి రెండు రోజులుగా భక్తులు కదలి తరంగాల్లా కదలి వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఆలయం భక్తులతో కిక్కిరిసింది. ఎటు చూసినా భక్త జనమే. ఎటు చూసినా వాహనాల రద్దీయే కనబడింది. వరుస సెలవులతో జిల్లాలోని ఆలయాలు కిటకిట లాడుతున్నాయి. ఓ వైపు ఎండ మాడు పగల గొడుతున్నా, లెక్క చేయక భక్తులు కదలి వచ్చారు. దాంతో వాయులింగేశ్వరుని దర్శనం కోసం భక్త జనులు పోటెత్తారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజలకు విశేష స్పందన లభించింది.



## అత్యాధునిక పరిశోధనలు... ఆవిష్కరణలకు కేంద్రాలు... ఐసర్, ఐఐటిల సమాగమం



శ్రీకాళహస్తి, మార్చి 1 ప్రభాతవార్త: అత్యాధునిక పరిశోధనలకు ప్రతిభావంతమైన ఆవిష్కరణలకు వేదికలుగా తిరుపతి ఐసర్, ఐఐటిలు ఆవిర్భావించాయని ఐసర్ డైరెక్టర్ సంతాను భట్టాచార్య అన్నారు. ఐసర్‌లో జరుగుతున్న జాతీయ స్థాయి సైన్స్ డే సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంతాను భట్టాచార్య మాట్లాడుతూ ఐసర్(ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్, రిసెర్చ్) కెనడాకు చెందిన డల్హౌసి యూనివర్శిటి, తిరుపతి ఐఐటిల సహకారంతో స్థాపించబడిన తిరుపతి ట్రై ఇన్స్టిట్యూట్ గ్లోబల్ ఇన్నోవేషన్ క్యాంపస్‌గా అభివర్ణించారు. విద్య, పరిశోధనా నైపుణ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో ఇండో కెనడియన్ సహకారంతో ముందుకు పోవటం ఓ మైలురాయి అన్నారు. 'అత్యాధునిక పరిశోధనలతోపాటు ప్రతిభావంతమైన ఆవిష్కరణలకు కేంద్రంగా' అభివర్ణించారు. ఈ ప్రతిపాదిత క్యాంపస్ రెండు దేశాలకు వ్యూహాత్మక ప్రాముఖ్యత ఉన్న రంగాలపై దృష్టి పెడు తుందని సంతాను భట్టాచార్య వివరించారు. ప్రతిభా పరిశ్రమల అనుసంధానంను రూపొందించుటకు తాము తిరుపతిలోని ఐఐటి, ఐసర్‌లతో భాగస్వాములయ్యామని కెనడాలోని డల్హౌసి విశ్వ విద్యాలయం అధ్యక్షుడు, వైస్ ఛాన్సలర్ డాక్టర్ కీమ్ బ్రూక్స్ అన్నారు. కెనడా, భారత్ రెండింటిలోనూ ఉమ్మడి శ్రేయస్సుకు మద్దతు ఇచ్చే విధం గా పరిశోధనలు చేపట్టబడుతాయని తెలిపారు. తిరుపతి ఐఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ మాట్లాడుతూ రాబోవు రోజుల్లో కేంద్ర విద్యాసంస్థల పేరు ప్రతిష్టలు ప్రపంచ పారిశ్రామిక చిత్రపటంలో ముందువరుసలో ఉంటాయని అభిప్రాయ పడ్డారు. డల్హౌసి యూనివర్శిటితో ఒప్పందం ఓ మరుపు రాని అనుభూతి అన్నారు. కెనడా విదేశాంగ మంత్రి అనితా ఆనంద్, కెనడా యూనివర్శిటి వైస్ చాన్సలర్ డాక్టర్ కింబర్లీ రూత్ బ్రూక్స్, సిఇఓ గాబ్రియల్ మిల్లర్, గ్లోబల్ రిలేషన్స్ ఎవిపి డాక్టర్ బలరామకృష్ణన్ పృధ్వీరాజ్ పాల్గొన్నారు.

2-3P□g7exHMNWJQE.qxd:2-3P□g7exHMNWJQE.qxd 1/1/02 6:37 AM Page 1



### అమరావతి రాజధానికి అనుసంధానంగా

# మరో రహదారి

- కంచికచర్ల నుండి ఇబ్రహీంపట్నం వరకూ ఆరు వరుసలుగా కొత్త రహదారి
- రాష్ట్ర ప్రభుత్వం ముమ్మర కసరత్తు



విజయవాడ, మార్చి 1 ప్రభాతవార్త ప్రతినిధి: రాజధాని అమరావతికి అనుసంధానంగా మరో జాతీయ రహదారిని నిర్మించేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతున్నట్లు సమాచారం. ఆ దిశలో ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇప్పటికే ఉన్న 65వ నెంబరు జాతీయ రహదారికి సమాంతరంగా కృష్ణానది ఒడ్డున దీన్ని నిర్మించేలా డిపిఆర్ రూపొందించారు. దీనిపై ప్రజాప్రతినిధులకూ వివరాలు తెలిపారు. దీని కోసం మరో విడత భూసేకరణ చేయనున్నట్లు వెల్లడించారు. అమరావతి రాజధాని నిర్మాణంలో భాగంగా కృష్ణానదిలో ఉన్న లంకలతో కలిపి రివర్ ఫ్రంట్ ఏర్పాటుకు వీలుగా అవసరమైన మాస్టర్‌ప్లాను తయారు చేసేందుకు సిఆర్‌డిఏ ఇప్పటికే టెండర్లు పిలిచింది. విజయవాడ నుండి వైకుంఠపురం వరకూ కృష్ణానదిలో లంకలను పర్యాటకంగా అభివృద్ధి చేయనున్నారు. ఇక కృష్ణానది ఉత్తరభాగంలో ఆరు వరుసల జాతీయ రహదారిని నిర్మించనున్నారు. సుమారు 1100 ఎకరాల వరకూ భూమిని సేకరించాలని ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిసింది. మచిలీపట్నం నుండి హైదరాబాద్ వరకూ ఉన్న 65వ నెంబరు జాతీయ రహదారి చాలా వరకూ నాలుగు వరుసలుగా ఉంది. విజయవాడ నుండి పెరిగిన ట్రాఫిక్‌కు వీలుగా దీన్ని విస్తరించాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా కంచికచర్ల సమీపంలోని శివసాయి క్షేత్రం నుండి ఇబ్రహీంపట్నం వరకూ కొత్తగా ఆరువరుసల జాతీయ రహదారి నిర్మాణం చేపట్టనున్నారు. ప్రస్తుతం ఉన్న జాతీయ రహదారికి దక్షిణంగా అమరావతి రాజధానికి ఉత్తరంగా దీన్ని నిర్మించనున్నారు. దీన్ని పూర్తిగా కృష్ణానది ఒడ్డుగా నిర్మించాలని జాతీయ రహదారుల విభాగం నిర్ణయించింది. దీనికోసం డిపిఆర్ తయారు చేసింది. ఇప్పుడున్న జాతీయ రహదారికి కంచికచర్ల నుండి ఇబ్రహీంపట్నం వరకూ వంకరలు ఎక్కువగా ఉన్నాయని, దీన్ని లైనుగా నిర్మించాల్సి ఉందనేది ఒక కారణంగా పేర్కొన్నారు. దీన్ని విస్తరించాలంటే ఇప్పుడున్న రహదారికి రెండువైపులా భవనాలు ఎక్కువగా ఉన్నాయని, ఖర్చుతో కూడుకున్న వ్యవహారమని పేర్కొన్నారు. కంచికచర్ల, బత్తినపాడు, చెవిటికల్లు, కొటికలపూడి, దాములూరు, చిలుకూరు, మూలపాడు, జూపూడి మీదుగా ఇబ్రహీంపట్నం వరకూ దీన్ని విస్తరించాలని నిర్ణయించారు. దీనిపై ఇటీవల ఉమ్మడి కృష్ణాజిల్లాలో జాతీయ రహదారి విస్తరించి ఉన్న నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు జాతీయ రహదారుల విభాగం అధికారులు సమావేశం ఏర్పాటు చేసి మాస్టర్‌ప్లాను వివరించారు.

### విజయవాడ చుట్టుపక్కల తొమ్మిది రహదారులు

విజయవాడ నుండి 16వ నెంబరు 65వ నెంబరు జాతీయ రహదారులు వెళుతున్నాయి. ఇబ్రహీంపట్నం నుండి జగదల్‌పూర్‌కు 30వ నెంబరు జాతీయ రహదారి ఉంది. విజయవాడ తూర్పు, పశ్చిమ భాగాల్లో 16వ నెంబరు జాతీయ రహదారికి వీలుగా వెస్ట్ బైపాస్‌రోడ్డు నిర్మించారు. ఈస్ట్ బైపాస్‌రోడ్డు ప్రతిపాదనలో ఉంది. ఇవి కాకుండా అమరావతికి ఇన్నర్‌రింగురోడ్డు ప్లాను త్వరలో అమలు చేయబోతున్నారు. ఇది పరిటాల సమీపంలో నుండే వెళుతుంది. అవుటర్‌రింగురోడ్డు గుంటూరు జిల్లా అమరావతి సమీపం నుండి ఎన్‌టిఆర్ జిల్లా చెవిటికల్లు మీదుగా వెళుతుంది. దీనికి మాస్టర్‌ప్లాను పూర్తయింది. అమరావతి రాజధాని నుండి రాయపూడి వద్ద ఐకానిక్ బ్రిడ్జి తరహాలో ఇబ్రహీంటప్నంవైపు మాస్టర్‌ప్లాను ప్రకారం మరో రోడ్డు నిర్మించనున్నారు. ఇప్పుడు కొత్తగా ఆరువరసల జాతీయ రహదారిని ప్రతిపాదించారు. ఇప్పుడున్న జాతీయ రహదారి కాకుండా ఆరువరుసలుగా మరో రహదారిని నిర్మించడం అంటే రైతులు విలువైన భూములు కోల్పోతారని ఉపయోగం ఉండదని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ తెలిపారు. నందిగామ నియోజకవర్గం పరిధిలో నుండి మైలవరం నియోజకవర్గం పరిధికి సంబంధించి ఇచ్చిన వివరాల్లో పొలాల్లో నుండి కొత్త జాతీయ రహదారిని వేస్తున్నారని, ఇప్పటికే జూపూడి, మూలపాడు తదితర ప్రాంతాల్లో ప్రజలు బూడిద చెరువు కోసం, జాతీయ రహదారి విస్తరణ కోసం భూములు ఇచ్చి నష్టపోయారని తెలిపారు. అలాగే కొత్త రైల్వేలైనుకు భూములు తీసుకుంటున్నారని, ఇప్పుడు కొత్తగా జాతీయ రహదారి కోసం భూములు సేకరిస్తే ఈ ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. ఇదే విషయాని జాతీయ రహదారుల విభాగం అధికారులకూ చెప్పామని వివరించారు.

# పరిమాణం కంటే మించి పేలుడు పదార్థాల నిల్వతోనే ప్రమాదం

- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం
- నలుగురు అధికారులను సస్పెండ్ చేశాం
- హోం మంత్రి అనిత
- వేట్లపాలెం పేలుడు స్థలాన్ని సందర్శన, పరామర్శ
- బాధితులకు ప్రభుత్వ ఆర్థిక సాయం చెక్కులు అందజేత

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, మార్చి 1 ప్రభాతవార్త: వేట్లపాలెం బాణాసంచా పేలుడు సంఘటన స్థలాన్ని ఆదివారం హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగూరి నారాయణ, రాజ్యసభ సభ్యులు సానా సతీష్ వేట్లపాలెంలో బాణాసంచా పేలుడు సంఘటన స్థలాన్ని సందర్శించి దుర్ఘటనకు దారితీసిన కారణాలను పరిశీలించారు. దుర్ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు చేపట్టడంతో పాటు, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా మరింత నిశితమైన భద్రత, పర్యవేక్షణ వ్యవస్థలను అమలు చేస్తామని హోం మంత్రి అనిత తెలిపారు. ఘటనకు బాణాసంచా తయారీ కేంద్రం యజమాని నిబంధనలకు విరుద్ధంగా అనుమతించిన పరిమాణం కంటే పేలుడు పదార్థాలను నిల్వచేయడం, కార్మిక శాఖలో నమోదు చేసిన వారి కంటె ఎక్కవ మందిని పనిలో పెట్టడం, పర్యవేక్షించాల్సిన శాఖల అధికారులు ఈ ఉల్లంఘనలు నిర్లక్ష్యంతో ఉపేక్షించడం కారణాలని మంత్రి తెలిపారు. పొట్టకూటి కోసం పనిలోకి వచ్చిన 24అమాయక కూలీలు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేసారు. బాణాసంచా తయారీ కేంద్రాలలో భద్రత కోసం పటిష్టమైన నిబంధనలు తెచ్చినా, ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయన్నారు. శనివారం జరిగిన సంఘటనలో పర్యవేక్షణ లోపంగా వ్యవహరించిన నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేసి, సమగ్ర విచారణకు ఆదేశించామన్నారు. ఊరికి దూరంగా కేంద్ర నిర్వహిస్తున్నా, ఎక్కవ ఆర్డర్లు ఉన్నాయని అనుమతించిన పరిమాణం కంటే ఎక్కవ పేలుడు పదార్థాలను నిల్వచేయడం కూడా కారణమని, లాబర్ డిపార్టుమెంట్ కు తెలిపిన దానికంటే ఎక్కవ సంఖ్యలో కూలీలను యజమాని పనిలో పెట్టుకున్నా అధికారులు పట్టించుకోలేదని ఆమె తెలిపారు. పర్యవేక్షణ లోపం కారణంగా స్థానిక ఆర్డిఓ, జిల్లా అగ్నిమాపక అధికారి, స్థానిక డిఎస్పీ, లాబర్ ఆఫీసర్లను సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. తప్పిదం ఎవరిదైనా రోజువారి కూలీ పనిచేసుకుని జీవించే కుటుంబాలు రోడ్డున పడ్డాయని, వీరందరికీ ప్రభుత్వం అన్ని విధాల అండగా నిలుస్తుందన్నారు.



**బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం పంపిణీ:** పేలుడు దుర్ఘటనలో మరణించిన వ్యక్తుల కుటుంబాలు ఒక్కక్కరికీ 20 లక్షలు చొప్పున శనివారం ముఖ్యమంత్రి ప్రకటించిన ఆర్థిక సహాయాలను రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు బాధిత కుటుంబాల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేసారు. అమలాపురం ఎంపీ జి.హరీష్ మాధుర్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామ్ మాధవ్, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వేట్లపాలెం గ్రామానికి చెందిన మృతులు నూకల దేవి, తుంపాల లోవరాజు, సాధనాల సత్యవేణి, గొడత నాని, వల్లూరి రవి, సుకుమల్ల రాఘవ ఇళ్లకు వెళ్లి వారి కుటుంబ సభ్యులుకు ఆర్థిక సహాయం చెక్కులను అందజేసారు. అలాగే రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, డిసిసిబి చైర్మన్ తమ్మల బాబు సామర్లకోట మున్సిపల్ ఆఫీస్ సమీపంలో నివశిస్తున్న బాధిత కుటుంబాల ఇళ్లకు వెళ్లి ఆర్థిక సహాయ చెక్కులను అందజేసారు. ఈ కార్యక్రమాలలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, జిల్లా ఎస్పీ జి.బింధుమాధవ్ పాల్గొన్నారు.



# మా పెళ్లి రిసెప్షన్‌కు రండి

### టి సిఎం రేవంత్‌ను ఆహ్వానించిన నటి రష్మిక

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 1: టాలీవుడ్ స్టార్ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందనల వివాహం రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లో కుటుంబ సభ్యులు, కొద్దిమంది బంధుమిత్రుల సమక్షంలో జరిగింది. ఈ జంట తమ సొంత గ్రామంలో రిసెప్షన్ వేడుకలు గ్రాండ్‌గా జరుపుకోవడానికి సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో ఆదివారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లిన రష్మిక మందన్న తమ రిసెప్షన్ వేడుకకు ఆహ్వానించారు. సీఎం రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులతో రష్మిక ముచ్చటించారు. ఈ నెల 4వ తేదీన సాయంత్రం హైదరాబాద్‌లో తాజ్‌కృష్ణలో వెడ్డింగ్ రిసెప్షన్‌కు, ఉదయం తుమ్మన్‌పేట ఫామ్‌హౌస్‌లో జరిగే సత్యనారాయణ స్వామి వ్రత వేడుకలకు రావాలని ముఖ్యమంత్రి దంపతులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి సతీమణి రష్మిక మందన్నకు తెలంగాణ సంప్రదాయం ప్రకారం బొట్టు పెట్టి, కానుక ఇచ్చారు. ముఖ్యమంత్రి దంపతులు రష్మికను దీవించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి 'సినీనటుడు విజయ్ దేవరకొండతో ఇటీవల వివాహ బంధంలోకి అడుగుపెట్టిన సినీనటి రష్మిక తమ వివాహ రిసెప్షన్‌కు ఆహ్వా నించారు' అంటూ ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. ముఖ్యమంత్రి దంప తులను సగౌరవంగా ఆహ్వానించిన ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి ఇప్పటికే ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర మంత్రి అమిత్‌షా వంటి దిగ్గజాలను కూడా ఈ జంట ఆహ్వానించింది. ఈ వేడుకకు టాలీవుడ్ ప్రముఖులతోపాటు రాజకీయ నేతలు పెద్దసంఖ్యలో హాజరు కానున్నారు.

# రేపు సంపూర్ణ చంద్రగ్రహణం

### భారత్ సహా ఆసియా దేశాల్లో పాక్షికం

హైదరాబాద్, మార్చి 1, ప్రభాతవార్త: ఈ నెల మూడో తేదీన ఏర్పడనున్న చంద్ర గ్రహణం భారత్ సహా ఆసియా దేశాల్లో పాక్షికంగానే కనిపించనున్న గ్రహణంతోనే చంద్రోదయం కనువిందు చేయడం అరుదైన ఘటనగా ఆగమన పండితుతు, శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ గ్రహణం సాయంత్రం వేళ కనిపించనున్నా సూతకాలం మాత్రం ఉదయం 7గంటలకే మొదలవనుండడం గమనార్హం. దీంతో ఆలయాలన్నీ ఉ.9 గంటలకే సంప్రోక్షణతో మూసివేయనున్నారు. మరోవైపు ఈ గ్రహణం శక్తివంతమైనదని ఆగమన పండితులు చెబుతున్నారు. సింహరా శిలో పుబ్బ నక్షత్రంలో ఈ గ్రహణం ఏర్పడుతోంది. భారత కాలమానం సాయంత్రం 4.58 గంటలకు ప్రారంభమయ్యే ఈ గ్రహణం రాత్రి 7.53 గంటలకు ముగుస్తుంది. అయితే ఈ సమయం కొన్నిచోట్ల మారుతుందని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. మార్చి మూడవ తేదీన చంద్రోదయం సాయం త్రం ఆరు గంటల 22 నిమిషాలకు వుండగా చంద్రుడు గ్రహణంతోనే ఉదయించడం మరో విశేషం. గ్రహణంతో చంద్రోదయం ఏర్పడడం చాలా అరుదుగా జరిగే ఘటనగా ఆగమన పండితులు చెబుతున్నారు. గ్రహణం మొత్తం వ్యవధి రెండు గంటల 55 నిమిషాలు. చంద్ర గ్రహణం మొదలైన 84 నిమిషాల తరువాత భారత్‌లో చంద్రోదయం కనిపించనుండగా అప్పటి నుంచి గ్రహణం ముగిసే వరకు వీక్షించవచ్చు. భారత్‌లో దాదాపు గ్రహణం పూర్తిగా వున్న దశలో చంద్రోదయం ఏర్పడనుండడం విశేషం. ఇదిలావుంటే భారత్‌లో ఒక్కోచోట ఒక్కో సమయంలో గ్రహణ వేళలు వుండడం గమనార్హం. చివరి 90 నిమిషాలు గ్రహణం భారత్‌లో స్పష్టంగా వీక్షించే వీలుందని శాస్త్రజ్ఞులు తెలిపారు. సింహరాశి వారు గ్రహణాన్ని వీక్షించడం శ్రేయస్కరం కాదని ఆగమన పండితులు చెబుతున్నారు. ఈసారి ఏర్పడే గ్రహణం రాక్షస గణాలకు బలం చేకూరే వీలుందని, ఈ క్రమంలో గ్రహ ణం ముగిసిన తరువాత ఆలయాలలో, ఇళ్లలో సంప్రోక్షణలు చేశాక ప్రత్యేక పూజలు చేయాలని వారు సూచిస్తున్నారు.

# ముమ్మరంగా కుంభాభిషేక ఏర్పాట్లు

### - పనులు పరిశీలించిన ఇఓ శీనా నాయక్

ఇంద్రకీలాద్రి, మార్చి 1, ప్రభాతవార్త: శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో 12 ఏళ్లకు ఒక సారి వచ్చే ఈ మహా కుంభాభిషేకం ఉత్సవాలు 2026 మార్చి 6 నుండి 8 వరకు వైభవంగా నిర్వహించడానికి ఇంద్రకీలాద్రిపై జరగనున్న కుంభాభిషేకం ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వహణా ధికారి (నిఓ) వి.కె. శీనా నాయక్ ఆదివారం క్షేత్రస్థాయిలో స్థానాచార్య శివప్రసాద్, వైదిక కమిటీ సభ్యులు ఉప ప్రధాన అర్చకులు శాండిల్య, వేదపండితులు షణ్ముఖ శాస్త్రిలతో కలిసి విమాన గోపురం మరియు ఆలయ ప్రాంగణం లోని వివిధ ప్రాంతాలను పరిశీలించారు. పనుల పురోగతిపై ఇంజనీరింగ్ విభాగానికి ముఖ్య సూచనలు చేశారు. భక్తులకు ఎండవేడి తగలకుండా ఆలయ పరిసరాల్లో వెంటనే చలువ పందిళ్లు ఏర్పాటు, త్రాగునీటి సరఫరాను సిద్ధం చేయాలని, వాటర్ ప్లాంట్లు నిరంతరం పనిచేసేలా చూడాలన్నారు. క్యూ కాంప్లెక్స్ నిర్మాణ పనులను, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రథం సెంటర్ నుంచి కనకదుర్గ నగర్ మధ్య పార్కింగ్ సదుపాయాలను పరిశీలించారు.



దాతలకు దుర్గమ్మవారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

**8న శ్రీశ్రీశ్రీ కంచికామకోటి పీఠాధిపతుల రాక:** మార్చి 8వ తేదీ ఉదయం 9:34 గంటలకు మేష లగ్నంలో ప్రధాన కుంభాభిషేకం జరగనుంది. ఈ కార్యక్రమం కంచి కామకోటి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ శంకర విజ యేంద్ర సరస్వతీ స్వామి వారి పర్యవేక్షణలో అత్యంత శాస్త్రోక్తంగా నిర్వహించబడుతుంది. లక్షలాదిగా తరలి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా దర్శన క్యూలైన్లు, మంచినీరు మరియు ప్రసాద వితరణలో ఎక్కడా రాజీ పడకుండా ఏర్పాట్లు చేయాలని ఈవో అధికారులను ఆదేశించారు. అమ్మవారి కృపతో అత్యంత వైభవంగా భక్తులం దరికీ దివ్యమైన అనుభూతినిచ్చేలా విజయవంతం చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.



కొమరవోలు ఆలయంలో కల్యాణోత్సవంలో ఇఓ, చైర్మన్

**వైభవంగా కొమరవోలు శ్రీఅమరరామ లింగేశ్వర దుర్గానాగేశ్వర స్వామివార్ల కల్యాణం:** శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం దత్తత దేవాలయం అయిన పామర్రు మండలం కొమర వోలులోని శ్రీఅమరరామలింగేశ్వర దుర్గా నాగేశ్వర స్వామివార్ల కల్యాణం వైభవంగా జరిగింది. ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధా కృష్ణలు శ్రీస్వామి అమ్మవార్లకు పట్టువస్త్ర సమర్పణ చేసి కల్యాణ క్రతువులో పాల్గొన్నారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఆదివారం నాడు సూర్యోపాసన పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సూర్య భగవా నుడికి ప్రత్యేక అర్చనలు నమస్కారాలు నిర్వహించారు.

# జనగణన వివరాలు పక్కాగా నమోదు

### - ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా

విజయవాడ, మార్చి 1 ప్రభాతవార్త: జనగణన విధుల్లో ఏమాత్రం అలసత్వానికి తావివ్వకుండా పక్కాగా వివ రాలు నమోదు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జనగణన-27 సర్వే అధికారులకు తొలి దశలో విజయవాడ ఆంధ్రాలయెలా కళాశాల్లో గత మూడురోజులగా జరుగుతున్న శిక్షణా కార్యక్రమాలు ఆదివారంతో ముగిసాయి. ముగింపు కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ మాట్లాడతూ జనగణనలో ఖచ్చితమైన డేటా సేకరించాలని సూచించారు. ఈసారి జనగణన ప్రక్రియ అధునాత సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించటం, పూర్తి డిజిటల్ విధానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మొబైల్ యాప్‌లు, ఆన్‌లైన్ మాడ్యూల్స్, డేటా అప్‌లోడింగ్ చేసే విధానంపై పూర్తి స్థాయిలో అవగాన కలిగి ఉండాలన్నారు. డేటా ఎంట్రీలో లోపాలు రాకుండా చూడాలన్నారు. జనాభా లెక్కల సేకరణ రెండు దశల్లో జరుగుతుందని తొలిదశలో హౌస్ లిస్టింగ్ అండ్ హౌస్ సెన్సస్ రెండోదశలో జనా భా గణాంకాలు నమోదు చేయాల్సి ఉందని కలెక్టర్ వివరించారు. జనగణన ద్వారా లభించే సమాచారం ఆధారంగా కేంద్రరాష్ట్ర ప్రభుత్వ విధానాల రూపకల్పన కు, సంక్షేమపథకాల అమలుకు కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ నగరపాలకసంస్థ కమీషనర్ ధ్యానచంద్ర, డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ జాయింట్ డైరెక్టర్ జి.ప్రసన్నకుమార్, డిఆర్‌డిఓ యం.లక్ష్మీనరసింహం, సీపిఓ వై.శ్రీలత తదితరులు పాల్గొన్నారు.





అధికారులనుద్దేశించి ప్రసంగిస్తున్న కలెక్టర్ లక్ష్మీశా

**ప్రాచీనకళలు నేర్చుకోవాలి:** సెల్‌ఫోన్ చూడటం తగ్గించి ప్రతి ఒక్కరూ ప్రాచీన కళలు నేర్చుకోవాలని తద్వారా మానసికోల్లాసం కలుగుతుందని ఎన్‌టిఆర్ జిల్లాకలెక్టర్ లక్ష్మీశా సూచించారు. ఆర్టిజోఫైన్ ఆర్ట్స్ స్టూడియోలు నిర్వహిస్తున్న పోటరీ అండ్ పాట్ పెయింటింగ్ వర్క్‌షాప్‌ను ఆదివారం కలెక్టర్ సందర్శించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు, పెద్దలు స్క్రీన్ టైం తగ్గించుకుని పోటరీ పాట్ పెయింటింగ్ వంటి కళలు నేర్చుకోవాలన్నారు. ఇటువంటి కళలు నేర్చుకోవటం వల్ల సృజనాత్మకశక్తి వెలుగులోకి వస్తుందన్నారు.

# గల్ఫ్‌దేశాల్లో చిక్కుకున్న ప్రజలు ఆందోళన వద్దు

- పరిస్థితులకు తగ్గట్టు తక్షణ చర్యలు చేపట్టాం
- ఎన్ఆర్ఐ సాధికారిత వ్యవహారాల మంత్రి శ్రీనివాస్



విజయవాడ, మార్చి 1, ప్రభాతవార్త: ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా విమాన సర్వీసులు రద్దుకావటంతో గల్ఫ్‌దేశాల్లో చిక్కుకుపోయిన ఆంధ్రప్రదేశ్ పౌరులు ఆందళనకు గురికావద్దని వారి రాష్ట్రానికి తీసుకువచ్చే వరకు ప్రభుత్వ పరంగా అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని రాష్ట్ర ఎన్ఆర్ఐ సాధికారత వ్యవహా రాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. గల్ఫ్‌దేశాల్లో ఉంటున్న విద్యార్థులు, ఉద్యోగులు, పర్యాటకులు సంయమనం పాటించాలని త్వరలోనే పరిస్థితులు సర్దుబాటు అయ్యి విమాన సర్వీసులు ప్రారంభం అవుతాయన్న ఆశాభవం వ్యక్తం చేసారు. ఆయా దేశాల్లో ఉన్న మన రాష్ట్ర ప్రజలు భారత రాయభార కార్యాల యాల్లో పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఇరాన్, ఇజ్రాయెల్ లో ఉన్న భారతీయుల భద్రతపై కేంద్ర ప్రభుత్వం, భారత విదేశాంగశాఖ నిరంతరాయంగా పర్యవేక్షిస్తుందన్నారు. సరైన సమాచారం తెలుసుకుంటూ ఇండియన్ ఎంబసీకి అందుబాటులో ఉండాలన్నారు. త్వరలోనే విమాన సేవలు పునరుద్ధరిస్తారన్నారు. ఉద్రిక్త నెల కొన్న ప్రాంతాలకు దూరంగా ఉండా లని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యవేక్షస్తున్నారని, ప్రజలందరి న్ని సురక్షితంగా రాష్ట్రానికి తీసుకువచ్చేందుకు కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నారని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో ఏపి ఎన్ఆర్టీ హెల్ప్‌లైన్ నెంబర్లు : +918500027678, +9108632340678లో సంప్రదించాలన్నారు. తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని హితవు పలికారు. స్థానిక అధికారులు, అధికారిక మీడియా సమాచారాన్ని మాత్రమే అనుసరించాలని గల్ఫ్‌లో చిక్కుకున్న ప్రజలకు మంత్రి విజ్ఞప్తి చేసారు.

# అంతర్రాష్ట్ర రూట్లలో బస్సుకై ఎదురుచూపులు

### - సరిహద్దు ప్రాంతాల్లో మహిళలకు ఇంకా రాని అనుమతులు



కుప్పం, మార్చి 1 ప్రభాతవార్త: సిఎం చంద్రబాబునాయుడు ఎన్నికలకు ముందు ప్రకటించి అమలు చేస్తున్న సూపర్‌సిక్స్ పథకాల్లో ఒకటైన స్త్రీ శక్తి పథకం రాష్ట్రంలో దిగ్విజయంగా అమలవుతోంది. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తూ ఈ పథకం అమలు చేస్తున్నారు. స్త్రీ శక్తి పథకం రాష్ట్రంలో సూపర్ హిట్ అయింది. మహిళలు, విద్యార్థినులు, బాలికలు, యువతులు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. నిత్యం లక్షలాది మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేస్తున్నారు. వీరికి ఆర్టీసీ బస్సుల్లో జీరో ఫేర్ టికెట్లను ఇస్తున్నారు. ఎక్కడినుంచి ఎంతదూరం ప్రయాణం చేశారు ఎంత టికెట్ నగదు మిగిలిందో తెలుస్తోంది.

**సరిహద్దు ప్రాంతాల్లో సమస్య:** మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం పథకం పక్కాగా అమలవుతోంది. ఆర్నెల్లుగా ఈ పథకం అమలులో ఉంది. కాగా రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న మహిళలకు ఈ పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం చేయాలంటే కుదరడం లేదు. ప్రధానంగా అంతరాష్ట్ర రూట్లలో ఉచిత బస్సు ప్రయాణంకు ఆర్టీసీ అధికారులు అనుమతించడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ సమస్య కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న చిత్తూరు, అన్నమయ్య, అనంతపురం తదితర జిల్లాల సరిహద్దుల్లో ఉన్న నియోజకవర్గాల్లో ఉత్పన్నమవు తోంది. ఉదాహరణకు చిత్తూరు జిల్లా కుప్పం నుంచి కర్ణాటకలోని కెజిఎఫ్ సుమారు 30 కిలో మీటర్ల దూరంలో ఉంది. ఈ మార్గంలో ఆంధ్ర సరిహద్దు సుమారు 20కి.మీ.లు ఉంటుంది.

అయితే ఈ 20కి.మీ.ల దూరం కూడా ఆర్టీసీ అధికారులు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంకు అనుమతించడం లేదు. ఇలా అంతరాష్ట్ర రూట్లలో తిరిగే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంకు ఆర్టీసీ అధికారులు, కండక్టర్లు అనుమతించక పోవడంతో మహిళలు వాపోతున్నారు. మహిళలు ఉచిత బస్సు ప్రయాణం అడిగితే అనుమతులు లేవని కండక్టర్లు పేర్కొంటున్నట్లు మహిళలు పేర్కొంటు న్నారు. ఈ తరహా సమస్యలే రాయలసీమ జిల్లాల్లో ఉన్న సరిహద్దు నియోజకవర్గాల్లో ఉచిత బస్సు ప్రయాణంకు ఎదురవు తున్నాయి.

ఇప ్పటికైనా సంబంధిత శాఖ మంత్రి, ఉన్నతాధికారులు స్పందించి సరిహద్దు నియోజకవర్గాల నుంచి అంతరాష్ట్ర రూట్లలో తిరిగే ఆర్టీసీ బస్సుల్లో కూడా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం స్త్రీ శక్తి పథకం అమలయ్యేలా చూస్తారని మహిళలు ఆశగా ఎదురుచూస్తున్నారు.



# ఇరాన్‌పై అమెరికా దాడితో పాతబస్తీలో నిరసనలు

హైదరాబాద్ (చార్మినార్), మార్చి 1 ప్రభాతవార్త: ఇరాన్‌పై అమెరికా దాడులకు పాల్పడడాన్ని నిరసిస్తూ పాతబస్తీలోని దారుషిఫాలో షియా వర్గీయు లు ఆదివారం మధ్యాహ్నం ర్యాలీ నిర్వహించారు. వేలాది మంది షియా వర్గీయులు ఒక్కసారిగా తరలిరావడంతో దారుషిఫా నుంచి చార్మినార్ వెళ్లే మార్గంలో వాహనాలను ముందుజాగ్రత్త చర్యగా పోలీసులు నిలిపివేసి ఆ మార్గాన్ని మూసివేశారు. ఇరాన్‌పై శనివారం నాడు అమెరికా దాడులకు పా ల్పడడం, ఈ దాడుల్లో ఆ దేశ నేత ఖమేని సహా అనేక మంది ప్రముఖులు మరణించడం తెలిసిందే. ఈ దాడులను నిరసిస్తూ భారత్‌లోని అనేక న గరాలలో షియా వర్గీయులు నిరసన ప్రదర్శన చేశారు. పాతబస్తీలోని పురాని హవేలి, దారుషిఫా ప్రాంతంలో షియా వర్గీయులు ఎక్కువగా వుండడం తెలిసిందే. వీరంతా మధ్యాహ్నం ప్రార్థనలు పూర్తయిన తరువాత రెండు గంటల సమయంలో ఖమేని ఫోటోలు కలిగిన ప్ల కార్డులు పట్టుకుని పు రాని హవేలి నుంచి దారుషిఫా మైదారం వరకు ర్యాలీగా వచ్చారు. ర్యాలీలో పాల్గొన్న వారంతా అమెరికాకు వ్యతిరేకంగా నినదించారు. అమెరికా చ ర్యలను వారంతా ఖండించారు. కాగా దారుషిఫా మైదానంలో అనంతరం అమెరికా చర్యలను వ్యతిరేకిస్తూ ఒక సభ నిర్వహించారు. ఈ సభలో చా ర్మినార్ ఎంఎల్ఎ మీర్ జుల్ఫికర్ అలీతో పాటు ఎంఎల్‌సి మీర్జా వుల్ హస్సన్ సహా పలువురు మజ్లిస్ పార్టీ నేతలు, షియా మత పెద్దలు పాల్గొనా న్నరు. వీరంతా ఇరాన్‌పై అమెరికా దాడులను ఖండించడంతో పాటు ఇరాన్‌కు సంఘీభావం తెలిపారు. అమెరికా దాడులు ఇరాన్‌ను ఏమీ చేయలేవని వారు వెల్లడించారు. ఇరాన్ ప్రజలకు యావత్ ప్రపంచం అండగా వుంటుందని వారు తెలిపారు.

**భారీగా ట్రాఫిక్ జాం.. దారుషిఫా, చార్మినార్ మార్గం మూసివేత**

ఇదిలావుండగా ఇరాన్‌పై అమెరికా దాడులను నిరసిస్తూ దారుషిఫాలో షియా వర్గీయులు చేబట్టిన ర్యాలీ కారణంగా ఈ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ జాంకు దారితీసింది. అఫ్జల్‌గంజ్ నుంచి మీర్‌చౌక్ మీదుగా చార్మినార్‌తో పాటు ఫలక్‌నుమా వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహ నాలు ఈ మార్గం గుండానే వెళ్లాల్సి వుండడంతో ర్యాలీ కారణంగా వాహ నాలన్నీ సాలార్‌జంగ్, ఐబిఎస్, చాదర్‌ఘాట్ మార్గంలో నిలిపిపోయాయి. పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా పురాని హవేలి, దారుషిఫా, చార్మినార్ మార్గాన్ని కొన్ని గంటలపాటు మూసివేసి ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలను ఇతర ప్రాంతాల గుండా మళ్లించారు. అయినప్ప టికీ సాయంత్రం వరకు ఈ మార్గంలో ట్రాఫిక్ జాం కొనసాగింది. మరోవైపు షియా వర్గీ యుల ర్యాలీలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

02-03pg10.qxd OK:02-03pg10.qxd 1/1/02 6:59 AM Page 1



# దుమ్మురేపిన భారత్



## బుమ్రా ఒకే ఓవర్లో 2 వికెట్లు

మొదట బ్యాటింగ్ చేసిన వెసిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 195 రన్స్ చేసింది. వెస్టిండీస్ ఇన్నింగ్స్‌ను ఓపెనర్లు షాయ్ హోప్(32), రోస్టన్ ఛేజ్(40) ధాటిగా ఆరంభించారు. అర్షదీప్ తొలి ఓవర్లో పొదుపుగా పరుగులు ఇచ్చినా, హార్దిక్ ఓవర్లో ఓ సిక్స్, ఓ ఫోర్ బాదారు. పవర్ ప్లే 6 ఓవర్లలో 45 పరుగులు రాబట్టారు. 68 పరుగులు తొలి వికెట్ భాగస్వామ్యానికి వరుణ్ చక్రవర్తి తెరదించాడు. రోస్టన్ ఛేజ్, క్రీజ్‌లోకి వచ్చిన హెట్మైర్ చెలరేగి ఆడే ప్రయత్నం చేశారు. దీంతో వెస్టిండీస్ తొలి పది ఓవర్లలో 82 పరుగులకు చేర్చారు.

**బూమ్ బూమ్ బుమ్రా**

యార్కర్ల కింగ్ బుమ్రా ఒకే ఓవర్లో రెండు వికెట్లు తీసి విండీస్ జోరుకు బ్రేక్ వేశాడు. మొదట హెట్మైర్(12 బంతుల్లో 27)ను బోల్తా కొట్టించాడు. సంజూ క్యాచ్‌తో పెవిలియన్‌కు చేర్చాడు. ఆవెంటనే రోస్టన్ ఛేజ్‌ను కూడా అవుట్ చేశాడు. ఒకే ఓవర్లో 2 వికెట్లు కోల్పోవడంతో విండీస్ స్కోరు వేగం తగ్గింది.

**పావెల్, హోల్డర్ దూకుడు**

స్లాగ్ ఓవర్లలో రోవ్‌మాన్ పావెల్(34 నాటౌట్), జాసన్ హోల్డర్(37 నాటౌట్) ధాటిగా బ్యాటింగ్ చేశారు. భారత బౌలర్లపై సిక్స్‌లు, ఫోర్లతో విరుచుకుపడుతూ స్కోరు వేగాన్ని పెంచారు. వీరిద్దరూ 35 బంతుల్లోనే 76 పరుగులు జోడించడంతో విండీస్ 195కు చేరుకుంది. భారత బౌలర్లలో బూమ్రా2 వికెట్లు సాధించగా.. పాండ్యా, వరుణ్‌లకు తలో వికెట్ దక్కింది.

**పావెల్ అరుదైన ఘనత**

ఈ మ్యాచ్‌లో రెండు సిక్సర్లు కొట్టడం ద్వారా రోవ్‌మాన్ పావెల్ అరుదైన ఘనత సాధించాడు. 150 సిక్సర్ల మార్కును చేరుకుని విండీస్ తరుఫున టీ20ల్లో అత్యధిక సిక్సర్లు కొట్టిన ఆటగాడిగా నిలిచాడు. నికోలస్ పూరన్ 149 సిక్సర్లు, వెవిన్ లూయిస్ 136 సిక్సర్లతో తరువాతి స్థానంలో ఉన్నారు.

*** సంజూ ధాటికి విండీస్ చిత్తు**

*** సెమీస్‌లో ఇంగ్లాండ్‌తో పోరు**

*సెమీస్ చేరకుండానే పాక్ ఇంటికెళ్లింది. మరి మనం. సెమీస్ చేరుతుందా? గెలిచి నిలుస్తారా? కోల్‌కతా మ్యాచ్‌కు ముందు ఏ మూలనో భారత్ ఫ్యాన్స్‌లో కాస్తంత సంశయం. కానీ మరోసారి సూర్యసేన గెలిచి నిలిచింది. ఈడెన్‌లో సూపర్ గేమ్‌తో అదరగొట్టింది. జింబాబ్వేపై చూపిన జోరును కంటిన్యూ చేసింది. సంజూ శామ్సన్ మొదలు పెడితే.. సూర్యకుమార్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్య తలో చేయి వేశారు. వీరి దెబ్బకు విండీస్ కుదేలైంది. కోల్‌కథ సుఖాంతమైంది. టీమిండియా సెమీస్ చేసింది. మార్చి 5న వాంఖడేలో ఇంగ్లాండ్‌తో సెమీఫైనల్ పోరుకు సిద్ధమైంది.*




**కోల్‌కతా:** టీ20 ప్రపంచకప్‌లో డిపెండింగ్ ఛాంపియన్ టీమిండియా సెమీ ఫైనల్‌కు దూసుకెళ్లింది. సూపర్8 దశలో చావోరేవో తేల్చుకోవాల్సిన మ్యాచ్‌లో వెస్టిండీస్ ను ఓడించి ముందడుగు వేసింది. 196 పరుగుల లక్ష్యాన్ని మరో నాలుగు బంతులుండానే 5 వికెట్లు కోల్పోయి అందుకుంది. సంజూ శాంమ్సన్ కడదాకా క్రీజలో నిలిచి సూపర్ విక్టరీ అందించాడు.

భారత్ ఇన్నింగ్స్‌ను మరోసారి అభిషేక్ శర్మ, సంజూ శాంమ్సన్ ఆరంభించాడు. జింబాబ్వేపై హాఫ్ సెంచరీతో జోరు మీదికొచ్చిన అభిషేక్ ఈసారి స్ట్రయిక్ తీసుకున్నాడు. రెండో బంతికే బౌండరీతో ఖాతా తెరిచాడు. అయితే అభిషేక్ ఇన్నింగ్స్ ఎంతో సేపు నిలవ లేదు. భారీ షాట్‌కు యత్నించి అవుటయ్యాడు. క్రీజ్‌లోకి వచ్చిన ఇషాన్ కూడా రెండు బౌండరీలు బాదినా వెంటనే అవుటయ్యాడు. దీంతో టీమిండియా 41రన్స్‌కే 2వికెట్లు కోల్పోయి కష్టాల్లోపడింది.

**సంజూ సూపర్ ఇనింగ్స్**

స్పినర్ హోసెన్ రెండో ఓవర్లో తొలి బంతిని బౌండరీ బాదిన సంజూ.. అదే ఓవర్లో మరో రెండు సిక్స్‌లు బాది తన ఉద్దేశ్యమేమిటో చాటిచెప్పాడు. ఇక అక్కడి నుంచి వెనక్కి తగ్గలేదు. విండీస్ బౌలర్లపై విరుచుకుపడుతూ పరుగుల వరద పారించాడు. ఆరో ఓవర్లో 50 పరుగుల మార్కు దాటించిన సంజూ ధాటికి... భారత్ స్కోరు 11వ ఓవర్‌కు వంద పరుగులు, 16వ ఓవర్‌కు 150 పరుగులకు చేరుకుంది. ఈ క్రమంలో 26బంతుల్లోనే ఆరు బౌండరీలు, మూడు సిక్స్‌లతో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. సూర్యకుమార్(18)తో కలిసి మూడో వికెట్‌కు 58 రన్స్, తిలక్ వర్మ(27)తో కలిసి నాలుగో వికెట్‌కు 42 రన్స్, హార్దిక్(17)తో కలిసి ఐదో వికెట్‌కు 38 రన్స్ విలువైన భాగస్వామ్యాలు నిర్మించాడు. 20వ ఓవర్ మొదటి బంతికి స్క్వేర్ మీదుగా సిక్స్, రెండో బంతికి మిడాన్ మీదుగా బౌండరీతో భారత్‌కు గెలుపందించాడు. మొత్తంగా సంజూ 50బంతుల్లో 12ఫోర్లు, 4సిక్స్‌లతో 97 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకున్నాడు.

**తిలక్ వర్మ మెరుపులు**

హైదరాబాదీ తిలక్ వర్మ మిడిల్ ఆర్డర్‌లో దుమ్మురేపుతున్నాడు. జింబాబ్వేపై కీలక పరుగులు చేసిన తిలక్.. ఈడెన్‌లోనూ రిపీట్ చేశాడు. 13వ ఓవర్లో జేసన్ హల్డర్ బౌలింగ్ లో నాలుగు బౌండరీలు బాదాడు. అంతకు ముందు ఓ భారీ సిక్స్‌తో అలరించాడు. 15 బంతుల్లోనే మెరుపు వేగంతో 27 రన్స్ చేసి భారత్ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. హార్దిక్ కూడా బాధ్యతాయుతంగా ఆడి రెండు బౌండరీలతో 17 రన్స్ చేశాడు.



# సఫారీ సూపర్ షో

## తొలి సెమీఫైనల్లో న్యూజిలాండ్‌తో ఢీ

**న్యూఢిల్లీ:** టీ20 ప్రపంచ కప్‌లో సౌతాఫ్రికా అజేయంగా కొనసాగుతోంది. సూపర్8లోనూ హ్యాట్రిక్ విజయాలు నమోదు చేసింది. న్యూఢిల్లీ వేదికగా జింబాబ్వేతో జరిగిన సూపర్8 మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. గ్రూప్ 1 నుంచి అగ్రస్థానంతో సెమీస్‌లో అడుగు పెట్టింది. గ్రూప్ స్టేజ్‌లో ఆస్ట్రేలియా, శ్రీలంకపై సంచలన విజయాలతో టాపర్‌గా నిలిచిన జింబాబ్వే అదే జోరును సూపర్8లో కొనసాగించలేక చతికిలపడింది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓటములే ఎదురయ్యాయి. 28 పరుగులకే ఓపెనర్లు మరుమణి, బెన్నెట్ వికెట్లు కోల్పోయిన దశలో క్రీజ్‌లోకి వచ్చిన సికిందర్ రజా కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. సఫారీ బౌలర్లపై విరుచుకుపడుతూ పరుగుల వరద పారించాడు. 5 ఫోర్లు, మూడు సిక్స్‌లతో కేవలం 29 బంతుల్లోనే వేగంగా అర్ధసెంచరీ పూర్తి చేశాడు. జింబాబ్వే స్కోరును వంద దాటించాడు. చివరకు 73 రన్స్ చేసిన రజాను మఫాకా అవుట్ చేశాడు. రజా ఇన్నింగ్స్‌లో8 ఫోర్లు, 4 సిక్స్‌లు ఉన్నాయి. స్లాగ్ ఓవర్లలో క్లివ్ మదాండే(26) వేగంగా ఆడడంతో జింబాబ్వే స్కోరు 150 రన్స్ దాటింది. సఫారీ బౌలర్లలో మఫాకా, బాష్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. పడగొట్టారు.

అనంతరం దక్షిణాఫ్రికా 17.5 ఓవర్లలో 5 వికెట్లను కోల్పోయి లక్ష్యాన్ని ఛేధించింది. ఓపెనర్లు మార్క్రమ్(4), క్వింటన్ డికాక్(0) తొందరగానే పెవిలియన్ చేరినా... మిగతా బ్యాట్స్‌మెన్ రాణించడంతో సౌతాఫ్రికా విజయం సులువైంది. బ్రెవిన్(42) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. రికల్టన్(31), డేవిడ్ మిల్లర్(22), ట్రిస్టన్ స్టబ్స్(21), జార్జ్ లిండే(30) ధాటిగా ఆడడంతో సౌతాఫ్రికా మరో 13 బంతులుండగానే గెలుపొందింది. బ్యాటింగ్‌లో రాణించిన సికిందర్ రజా బౌలింగ్‌లోనూ వణికించి మూడు వికెట్లు పడగొట్టాడు. ఆల్‌రౌండ్ షోతో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. గ్రూప్-1 టాపర్‌గా సెమీస్‌లో పవేశించిన సఫారీలు...మార్చి4న న్యూజిలాండ్‌తో తలపడనుంది. కోల్‌కతా వేదికగా తొలి సెమీఫైనల్ జరగనుంది.

## దుబాయ్‌లో చిక్కుకున్న పీవీ సింధూ



**దుబాయ్:** భారత అగ్రశ్రేణి షట్లర్, రెండు సార్లు ఒలింపిక్ మెడలిస్ట్ పీవీ సింధూ దుబాయ్‌లో చిక్కుకుంది. గల్ఫ్ ప్రాంతంలో ఇరాన్ దాడులు కారణంగా విమాన సర్వీసులు నిలిచిపోవడంతో ఆమె ప్రయాణానికి అంతరాయం కలిగింది. సింధూ బర్మింగ్‌హామ్‌లో జరగనున్న ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్‌షిప్స్ కోసం దుబాయ్ మీదుగా లండన్‌కు బయల్దేరింది. దుబాయ్ ట్రాన్సిట్‌లో ఉన్న సమయంలో గల్ఫ్ ఎయిర్‌స్పేస్‌లో మిసైల్ దాడుల కారణంగా అన్ని విమాన సర్వీసులు నిలిపి వేశారు. దీంతో సింధూ విమానాశ్రయంలోనే ఉండాల్సి వచ్చింది. అక్కడి పరిస్థితులపై సింధు ఓ పోస్ట్ పెట్టింది. విమానాశ్రయ సిబ్బంది తమను సురక్షిత ప్రాంతానికి తరలించారని పేర్కొంది. కాగా బర్మింగ్హామ్‌లో రేపటినుంచి మార్చి 8వరకు ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ జరగనుంది. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధూతో పాటు ఉన్నతి హూడా, మాల్విక బరిలోకి దిగుతున్నారు. పీవీ సింధూ తొలి రౌండ్‌లో థాయిలాండ్ క్రీడాకారిణి కటతాంగ్‌తో తలపడనుంది.

## వన్డేల్లో అమ్మాయిలు వైట్‌వాష్

**హోబర్ట్:** ఆస్ట్రేలియా గడ్డపై టీ20 సిరీస్ నెగ్గిన భారత్ విమెన్స్ టీమ్...వన్డేల్లో మాత్రం బోల్తా కొట్టింది. మూడు వన్డేల సిరీస్‌లో వైట్ వాష్ అయింది. మూడో, ఆఖరి వన్డేలోనూ ఆస్ట్రేలియా 185 పరుగులతో గెలుపొందింది.

తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 409 పరుగుల భారీ స్కోరు చేసింది. హీలే, బెత్ మూనీ శతకాల మోత మోగించారు. అలీసా హీలే (98 బంతుల్లో 27 ఫోర్లు, 2సిక్స్‌లతో 158), జార్జియా వోల్ (62) రెండో వికెట్‌కు 104 రన్స్ భాగస్వామ్యం నిర్మించారు. వోల్ అవుట్ తర్వాత క్రీజ్‌లోకి వచ్చిన బెత్ మూనీ కూడా ధాటిగా ఆడి 84 బంతుల్లో 10 ఫోర్లు, ఒక సిక్స్‌తో 158 రన్స్ చేశారు. మూడో వికెట్‌కు 145రన్స్ జోడించారు. దీంతో ఆసీస్ స్కోరు 400 పరుగులు దాటింది. భారత బౌలర్లలో శ్రీ చరణి రెండు వికెట్లు తీశారు.

అనంతరం లక్ష్య ఛేదనలో తడబడ్డ భారత్ విమెన్స్ 45.1 ఓవర్లలో 224 పరుగులకే ఆలౌటైంది. భారత ఇన్నింగ్స్‌లో స్నేహ్ రాణా (44) టాప్ స్కోరర్‌గా నిలిచింది.. జెమీమా రోడ్రిగ్స్ (42) ఫర్వాలేదనిపించగా.. మిగతావారు బ్యాటింగ్‌లో విఫలమయ్యారు. ఆసీస్ బౌలర్లలో అలానా కింగ్ 4, జార్జియా 2 వికెట్లు తీశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా హీలే నిలిచింది. ఇరు జట్ల మధ్య ఏకైక టెస్టు మ్యాచ్ పెర్త్ వేదికగా మార్చి 6న ప్రారంభమవుతుంది.


అలీసా హీలే(158)

# ఇరాన్ వార్ ఎఫెక్ట్! భారీగా పెరుగుతున్న వెండి, బంగారం ధరలు



**ముంబయి, మార్చి 1:** బంగారం, వెండి ధరలు ఊహించని విధంగా పెరుగుతున్నాయి. అమెరికా ఇరాన్ ఇజ్రాయెల్ ఉద్రిక్తతలు పసిడి ధరలను అమాంతం పెంచేశాయి. ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ క్షిపణులతో విరుచుకపడడం, ఊహించని విధంగా ఇరాన్ ప్రతిదాడులు చేయడం ఇప్పుడు ప్రపంచాన్ని ఉలిక్కిపడేలా చేసింది. బంగారం ధరలు ఒక్కసారిగా పెరిగాయి. తులం బంగారం రేటు ఏకంగా రూ.7 వేల పైన పెరిగింది. కిలో వెండి రేటు ఒక్కరోజే రూ.25000 మేర పెరిగింది. ఈ క్రమంలో దేశీయ మార్కెట్లో బంగారం, వెండి రేట్లు మార్చి 1వ తేదీన భారీస్థాయిలోపెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్లో స్పాట్ గోల్డ్ రేటు ఔన్సుకు ఒక్కరోజే 100 డాలర్ల పైన పెరిగింది. ఔన్స్ పసిడి రేటు 5278 డాలర్ల పైకి ట్రేడవుతోంది. ఇక స్పాట్ సిల్వర్ రేటు ఔన్సుకు ఒక్కరోజే 7.59 శాతం పెరిగింది. ఔన్స్ వెండి రేటు 93.72 డాలర్ల పైకి చేరుకుంది. అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతలు దేశీయ మార్కెట్ పై ప్రభావం చూపించాయి. హైదరాబాద్ మార్కెట్లో బంగారం ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ఈరోజు 24 క్యారెట్ల బంగారం రేటు 10 గ్రాములకు ఏకంగా రూ.7140 మేర పెరిగింది. తులం బంగారం ధర రూ. 1,68,710 వద్దకు చేరుంది. ఇక 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములపై రూ. 6,550 మేర పెరి తులం రేటు రూ.1,54,650 వద్దకు చేరుకుంది. బంగారంతో పాటు వెండి రేటు సైతం భారీగా పెరిగింది. గత రెండు రోజులు స్థిరంగా కొనసాగుతూ వచ్చిన వెండిపై ఇరాన్ అమెరికా దాడులు ప్రభావం చూపించాయి. దీంతో ఒక్కరోజే కిలో వెండి రేటు రూ.25000 మేర పెరిగింది. దీంతో హైదరాబాద్ మార్కెట్లో కిలో వెండి ధర రూ. 3,20,000 వద్దకు చేరుకుంది.

# గెయిల్ సిఎండిగా దీపక్ గుప్తా!



**న్యూఢిల్లీ, మార్చి 1:** ఇంధనరంగంలో చీఫ్ఎగ్జిక్యూటివ్‌గా విశేష అనుభవం ఉన్న దీపక్ గుప్తా గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ గెయిల్ ఛైర్మన్‌మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఢిల్లీ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీర్ అయిన గుప్తా సహజవాయు రంగంలో విశేషానుభవం కలిగి ఉన్నారు. ట్రాన్స్‌మిషన్, మార్కెటింగ్, మౌలిక వనరుల అభివృద్ధి విభాగాల్లో విశేషానుభవం కలిగి ఉన్నారు. గెయిల్‌లోకూడా కీలక విభాగాలను ర్యవేక్షించారు. ఆపరేషన్స్, బిజినెస్ డెవలప్‌మెంట్, కార్పొరేట్ మేనేజ్‌మెంట్ వంటి విభాగాలుచూసారు. బోర్డుస్థాయి నాయకత్వ లక్షణాలున్నాయి. సాంకేతికంగా కూడా ఆయనకు విశేషానుభవం ఉంది. ప్రాజెక్టు, నిర్మాణ యాజమాన్యం, అంతర్జాతీయ కొనుగోళ్లు, కాంట్రాక్టులు, టెక్నాలజీ ఎంపిక, బిజినెస్ డెవలప్‌మెంట్, ఆపరేషన్స్ నిర్వహణ వంటి వాటిలో ఆయనకు అపారమైన అనుభవం ఉందని గెయిల్‌ప్రకటించింది. ఇప్పటివరకూ పనిచేసిన సందీప్‌కుమార్ గుప్తా స్థానంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

# మార్కెట్లకు వచ్చే వారం మూడు ఐపిఒలు

**ముంబయి, మార్చి 1:** వచ్చేవారం మార్కెట్లకు మూడు ఐపిఒలు వస్తున్నాయి. మెయిన్‌బోర్డు ఇష్యూల్లో ఒకటి మిగిలినవి ఎస్ఎంఇ ప్లాట్‌ఫామ్‌పై ఉన్నాయి. కొనుగోళ్ల స్థాయి, గ్రేమార్కెట్‌ప్రీమియమ్‌లతోపాటు లిస్టింగ్ తీరు వంటి వాటిపైనే ఇన్వెస్టర్లు ఎక్కువ ఫోకస్ ఉంటుందని రేటింగ్ సంస్థల అంచనా. మెయిన్‌బోర్డు ఐపిఒల్లో సెడెమాక్ మెచాట్రానిక్స్ ఇష్యూ మార్చి 4న ప్రారంభం అయి ఆరోతేదీ ముగుస్తుంది. ఆఫర్‌ఫర్‌సేల్‌కింద 80 లక్షల షేర్లు విక్రయిస్తుంది. మొత్తం 1087.45 కోట్లు ఆర్జించే లక్ష్యంతో ఉంది. ప్రస్తుతం ఉన్న వాటాదారులు తమ షేర్లను ప్రత్యక్షంగా పబ్లిక్‌కు విక్రయించే వెసులుబాటు ఉంటుంది. ఈ ఐపిఒ మొత్తం కేవలం షేర్‌హోల్డర్లకే వెళుతుంది. కంపెనీకి ఉండదు. తొమ్మిదో తేదీ షేర్ల కేటాయింపు ఉంటుంది. బిఎస్ఇ, ఎన్ఎస్ఇల్లో లిస్టింగ్ ఈనెల 11వ తేదీ ఉంటుందని కంపెనీ వెల్లడించింది. ఇక ఎస్ఎంఇ విభాగంలో రెండు కొత్త ఐపిఒలు వస్తున్నాయి. ఎల్ఫిన్ ఆగ్రో ఇండియా ఐదోతేదీ ప్రారంభం అయి తొమ్మిదో తేదీ ముగుస్తుంది. ఇష్యూనుంచి రూ.25.03 కోట్లు ఆర్జించే లక్ష్యంతో ఉంది. మొత్తం 53 లక్షల వాటాలను ఐపిఒకు తెచ్చింది. శ్రీనిబాస్ ప్రధాన్ కన్‌స్ట్రక్షన్స్ ఐపిఒకు వస్తోంది. ఆరోతేదీ నుంచి పదోతేదీవరకూ ఓపెన్‌చేసి ఉంటుంది. బుక్ బిల్ట్ ఇష్యూ రూ.20.32కోట్లు ఆర్జించే లక్ష్యంతో ఉంది. మొత్తంగా 17 లక్షల షేర్లు కేటాయించింది. అంటే వీటి విలువ రూ.16.79 లక్షలకోట్లుగా ఉంది. ఆఫర్‌ఫర్‌సేల్‌లో నాలుగు లక్షల షేర్లు రూ.3.53 కోట్ల విలువైనవి విక్రయిస్తోంది.




# ఫిబ్రవరి నెల జిఎస్టి వసూళ్లు రూ.1.83 లక్షలకోట్లు

**న్యూఢిల్లీ, మార్చి 1:** వస్తుసేవల పన్ను జీఎస్టీ రాబడులు ఫిబ్రవరి నెలలో రూ.1.83 లక్షలకోట్లకు చేరాయి. గత ఏడాది ఫిబ్రవరిలో రూ.1.69 లక్షలకోట్లు మాత్రమే వసూలయిన ఈ వృద్ధి 8.1శాతం పెరిగిందని కేంద్రం ప్రకటించింది. జనవరిలో జిఎస్టీ వసూళ్లు రూ.1.71 లక్షలకోట్లుగా ఉన్నాయి. వార్షికపద్ధతిలోచూస్తే జీఎస్టీ స్థూల వసూళ్ల రూ.20,27,033 కోట్లుగా ఉంది. 8.3శాతం వృద్ధిని నమోదుచేసాయి. ఫిబ్రవరిలో స్థూల జిఎస్టీ వసూళ్ల రీఫండ్‌లు కూడా 7.9శాతం పెరిగాయి. రీఫండ్‌ల తర్వాత రూ.1.61 లక్షలకోట్లుగా ఉంది. అయితే ఫిబ్రవరినెల రీఫండ్లు ప్రస్తుతం సమీక్షలో ఉన్నాయి. ఇలాంటి రివ్యూలు 10.2శాతంపెరిగి రూ.22,595 కోట్లవరకూ ఉన్నట్లు అంచనా. ఆర్థికసంవత్సరానికి గాను ప్రభుత్వం జిఎస్టీ వసూళ్లలో 11శాతం వృదిధ అంచనాలువేసింది. వార్షిక రాబడులు రూ.11.78 లక్షలకోట్లుగా ఉంటాయని తెలిపింది. వాటిలోనే కేంద్ర జిఎస్టీ, పరిహారం సెస్సులు కూడా ఉంటాయి. గతనెలలో మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, కర్ణాటకల్లో భారీ వసూళ్ల ఉన్నాయి. హార్యానా, యూపి, ఢిల్లీ, బెంగాల్ రాష్ట్రాలు తర్వాత స్థానాల్లో ఉన్నాయి.

లక్షద్వీప్, అండమాన్‌న ఇకోబార్ దీవులు, లడక్, మిజోరమ్, నాగాలాండ్; మణిపూర్‌లలో తక్కువ జిఎస్టీ వసూళ్ల నమోదయ్యాయి. అలాగే ఫిబ్రవరినెలకుగాను పరిహారం సుంకం రూ.5063 కోట్లుగా ఉంది.

# వాణిజ్య సిలిండర్ ధరలు పెంచిన చమురు కంపెనీలు!



**ముంబయి, మార్చి 1:** ఇండియన్ చమురు మార్కెటింగ్ కంపెనీలు వాణిజ్య సిలిండర్ ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. 19 కిలోల కమర్షియల్ సిలిండర్‌పై రూ.28 నుంచి రూ.31 వరకు పెరగ్గా.. డొమెస్టిక్ 14.2 కిలోల గ్యాస్ సిలిండర్ ధరలను స్థిరంగా ఉంచాయి. ప్రతీ నెలా 1వ తేదీన గ్యాస్ సిలిండర్ కొత్త ధరలను కంపెనీలు ప్రకటిస్తూ ఉంటాయి. అందులో భాగంగా మార్చి 1న గ్యాస్ సిలిండర్ ధరల్లో కంపెనీలు మార్పులు చేశాయి. డొమెస్టిక్ సిలిండర్ ధరలు గృహ అవసరాల కోసం వినియోగించే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పు జరగలేదు. హైదరాబాద్‌లో 14.2 కిలోల డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధర రూ.905.00 వద్ద కొనసాగుతోంది. రవాణా, నిర్వహణ ఛార్జీల కారణంగా ప్రాంతాలను బట్టి గ్యాస్ ధరల్లో మార్పులు ఉంటాయి. చివరిసారిగా గత ఏడాది ఏప్రిల్ 8న వీటి ధరలను సవరించగా అప్పటినుంచి ఎలాంటి మార్పు లేదు. రెస్టారెంట్లు, హోటల్స్, ధాబాలు ఇతర వ్యాపార అవసరాల కోసం ఉపయోగించే కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలు పెరిగాయి. ఫిబ్రవరిలో 19 కిలోల సిలిండర్ ధరలు రూ.48 నుంచి రూ.50 వరకు పెరగ్గా ఈనెల 1న మళ్లీ పెంచాయి. ప్రాంతాలను బట్టి రూ.28 నుంచి రూ.31 వరకు ధరలు పెరిగాయి. ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఢిల్లీలో 19 కిలోల గ్యాస్ సిలిండర్ ధర రూ.1768.50గా ఉంది. గతంలో రూ.1740.50గా ఉండేది కోల్‌కత్తాలో రూ.1844.50గా ఉండగా ఇప్పుడు రూ.1875.50కి పెరిగింది ముంబైలో గతంలో రూ.1692గా ఉండగా ఇప్పుడు రూ.1720.50కి చేరుకుంది చెన్నైలో గతంలో రూ.1899.50గా ధర ఉండగా ఇప్పుడు రూ.1929కి పెరిగింది.

# రూ.26.84 లక్షలకోట్ల యుపిఐ లావాదేవీలు!

**న్యూఢిల్లీ, మార్చి 1:** యుపిఐ లావాదేవీలు ఫిబ్రవరిలో ఆరుశాతం తగ్గాయి. 20.39 బిలియన్ లావాదేవీలు జరిగాయని అంచనా. విలువలపరంగా కూడా ఐదుశాతం తగ్గి రూ.26.84 లక్షలకోట్లుగా ఉన్నట్లు తేలింది. ఫిబ్రవరి నెలలో తక్కువ రోజులు ఉండటమే ఇందుకు కారణమని నిపుణుల అంచనా. జనవరిలో లావాదేవీలు 21.70 బిలియన్ లావాదేవీలుజరిగి రూ.28.33 లక్షలకోట్లు విలువైన చెల్లింపులు జమలు జరిగాయి. ఫిబ్రవరిలో రోజువారి లావాదేవీలు 728 మిలియన్లుపెరిగాయి. విలువలు 95,865కోట్లుగా ఉన్నాయి. జనవరిలో అయితే 700 మిలియన్ లావాదేవీల్లో రూ.91,403 కోట్లవరకూ ఉన్నట్లు అంచనా. నెలవారీగా కూడా స్వల్పస్థాయిలో మాత్రమే పెరిగాయి. ప్రపంచ వ్యాప్తంగా యుపిఐ లావాదేవీలకు మరింత బూమ్ వచ్చింది. నిరంతరాయంగా చెల్లింపులు, 24




వాణిజ్యం

గంటల్లో ఎప్పుడైనా చేసుకునే వెసులుబాటు రావడంతో యుపిఐ లావాదేవీలుభారీస్థాయిలోనే జరుగుతున్నట్లు క్యాష్‌ఫ్రీ పేమెంట్స్ సిఇఒ ఆకాష్ సిన్హా అన్నారు. డిసెంబరులో ఈ చెల్లింపులు 21.63 బిలియన్‌లవరకూ జరిగి రూ.27.97లక్షలకోట్లుగా ఉన్నాయి. వార్షిక పద్ధతిలోచూస్తే యుపిఐ లావాదేవీలు 27శాతంపెరిగాయి. విలువలపరంగా కూడా 22శాతం పెరిగినట్లు ఆయన చెప్పారు. ఇక బ్యాంకుల్లో ఉన్న ఐఎంపిఎస్ లావాదేవీలు 10శాతం తగ్గి 336 మిలియన్ల లావాదేవీలుజరిగాయి. అదే జనవరిలో 374 మిలియన్లుజరిగాయి. డిసెంబరులో 6.62 లక్షలకోట్ల విలువైన 380 మిలియన్ల ఐఎంపిఎస్ లావాదేవీలుజరిగాయి. అదే జనవరిలో 12.07 మిలియన్ల లావాదేవీలుజరిగాయి. ఇక రోజువారి ఐఎంపిఎస్ లావాదేవీలు రూ.21,709 కోట్లుగా ఉన్నట్లు అంచనా. ఇక ఫాస్టాగ్ లావాదేవీలు ఫిబ్రవరిలో ఆరుశాతం తగ్గి 350 మిలియన్లుగానే ఉన్నాయి. అదే జనవరిలో 373 మిలియన్లుజరిగాయి. విలువలపరంగా కూడా 4శాతం క్షీణించి 6925 కోట్లుగా ఉన్నాయి. జనవరిలో 7232 కోట్లు ఉన్నట్లు అంచనా. ఆధార్‌అనుసంధానితచెల్లింపులు 90 మిలియన్లుగా ఉన్నాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.

ong-7_ong-7.qxd 3/2/2026 1:02 AM Page 1





# భానుడి ప్రతాపంతో.. జనం ఉక్కిరి బిక్కిరి..!

**- భవిష్యత్తులో ఎండలు తీవ్రత అధికమే!**

(ప్రభాతవార్త, విశాఖపట్నం)

వేసవి రాకముందే భానుడి ఉష్ణ ప్రతాపం ఉక్కిరి బిక్కిరి చేసేస్తోంది. ఉష్ణోగ్రతలు రోజురోజుకి గణనీయంగా పెరుగుతున్నాయి. వేడి, ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 38 డిగ్రీల సెల్సియస్ గా నమోదైనట్లు తెలుస్తుంది. ఉత్తరాంధ్ర ప్రాంతాల్లోనూ గరిష్ఠ ఉష్ణోగ్రతలు రెండు నుంచి మూడు డిగ్రీలు తేడాగా.. ఉష్ణోగ్రతలు నమోదైనట్టు తెలుస్తుంది. నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతున్న నేపథ్యంలో భానుడి తన ప్రతాపాన్ని చూపిస్తున్నట్టు తెలుస్తుంది. భవిష్యత్తులో ఎండవేడి మరింత పెరుగుతుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. కాగా, బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రానున్న మూడు రోజుల్లో ఉత్తరాంధ్ర జిల్లాలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని చెబుతున్నారు.









విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు
వార్త 26

## ఎఆర్ఓఐ గోల్డెన్ జూబ్లీ సందర్భంగా.. క్యాన్సర్ అవగాహన బీచ్ వాక్ విజయవంతం

(ప్రభాతవార్త, విశాఖపట్నం)




అసోసియేషన్ అఫ్ రేడియేషన్ ఒంకలోజిస్ట్స్ అఫ్ ఇండియా (ఎఆర్ఓఐ) గోల్డెన్ జూబ్లీ (50 సంవత్సరాలు) వేడుకల సందర్భంగా ఆదివారం ఆర్కే బీచ్ రోడ్డులో క్యాన్సర్ అవగాహన బీచ్ వాక్ ఘనంగా నిర్వహించారు. ఖి50 ఇయర్స్ అఫ్ హీలింగ్ : రాసింగ్ టవర్డ్స్ ఏ క్యాన్సర్ ఫ్రీ టుమారోఖిఖి అనే థీమ్‌తో నిర్వహించిన ఈ వాక్ కాళీ టెంపుల్ నుంచి . వైఎంసీఎ వరకు సాగింది. ఉదయం 6:15 గంటలకు ఫ్లాగ్ ఆఫ్ చేసిన ఈ కార్యక్రమంలో సుమారు 100 మంది రేడియేషన్ ఆంకాలజిస్టులు, మెడికల్ ఫిజిసిస్టులు మరియు రేడియేషన్ టెక్నాలజిస్టులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా.. ఎఆర్ఓఐ ప్రతినిధులు మాట్లాడుతూ,"గత 50 ఏళ్లుగా ఎఆర్ఓఐ కేన్సర్‌పై పోరాటంలో ముందంజలో ఉంది. ఈ బీచ్ వాక్ మా చరిత్రను స్మరించుకోవడమే కాకుండా, రోగులకు మరింత సురక్షితమైన మరియు సమర్థవంతమైన చికిత్సలను అందించేందుకు మా కట్టుబాటును తెలియజేస్తోంది," అని పేర్కొన్నారు.

## డోలోత్సవం, వసంతోత్సవంపై సమీక్ష సమావేశం

- చంద్రగ్రహణం దృష్ట్యా 3న ఆలయ ద్వారాల మూసివేత

సింహాచలం, ప్రభాతవార్త



మంగళవారం ఫాల్గుణ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి దేవస్థానంలో నిర్వహించబోయే డోలోత్సవం, వసంతోత్సవం, మరియు గ్రామ తిరువీధి ఉత్సవాల ఏర్పాట్లపై ఆలయ కళ్యాణ మండపంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆలయ ఇంజనీరింగ్ అధికారులు, సహాయ కార్యనిర్వహణ అధికారులు మరియు ప్రధాన అర్చకులు ఈ సమావేశంలో పాల్గొని ఉత్సవాల నిర్వహణపై చర్చించారు. మార్చి 3న తెల్లవారుజామున 4.00 గంటలకు స్వామివారు మెట్ల మార్గం ద్వారా కొండ దిగువకు వేంచేస్తారు. పుష్కరిణి సత్రం వద్ద ఉన్న ఉద్యానవన మండపంలో డోలోత్సవం, వసంతోత్సవ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరుగుతాయి. ఉదయం 6.00 గంటల నుండి స్వామివారి శోభాయాత్ర గ్రామ తిరువీధి అత్యంత వైభవంగా నిర్వహించబడుతుంది. ఆ రోజున గ్రస్తోదయ చంద్రగ్రహణం సంభవించనున్న నేపథ్యంలో, ఉత్సవం ముగిసిన వెంటనే స్వామివారిని త్వరితగతిన కొండపైకి చేర్చుతారు. ఉదయం 8.00 గంటలకే ఆలయ కవాట బంధనం (ద్వారాల మూసివేత) జరుగుతుంది. గ్రహణం కారణంగా మార్చి 3న స్వామివారి దర్శనాలు నిలిపివేయబడ్డాయి. సుప్రభాత సేవతో సహా అన్ని రకాల ఆర్జిత సేవలు రద్దు చేయబడ్డాయి". భక్తులు ఈ విషయాన్ని గమనించవలసిందిగా అధికారులు కోరారు

## మధుమేహాన్ని హోమియోతో నియంత్రణ సాధ్యం

- మధుమేహాన్ని హోమియోతో సంపూర్ణ నియంత్రణ

విశాఖపట్నం, మార్చి 1 ప్రభాతవార్త




ఇండియన్ ఇన్స్టిట్యూట్ అఫ్ హోమియోపతిక్ ఫిజిషియన్స్ విశాఖ జిల్లా శాఖ లో హోమియో వైద్యులు ఆదివారం ఆంధ్రా యూనివర్సిటీ లో యాప్.యస్.యస్ భవనం లో సర్వసభ్య సమావేశం ఏర్పాటైంది. సంస్థ అధ్యక్షులు డాక్టర్ పి.రాఘువేంద్ర రావు అధ్యక్షతన జాతీయ సభ్యులు డాక్టర్.జి.రాజేంద్ర ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ పగడాల చంద్రశేఖర్ లను ముఖ్య అతిథులను ఆహ్వానించారు. అనంతరం జరిగిన నిరంతర వైద్య విద్యా కార్యక్రమాల కన్వీనర్ డాక్టర్ మహిపని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో హోమియో రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ రోనంకి ఆనందరావు, మధుమేహం , హోమియో వైద్య విధానం అనే అంశంపై క్లిష్ట పరిస్థితుల్లో చాకచక్యంగా ఎదుర్కోన్న పరిస్థితులు తన మధుమేహ రోగులకు జరిపిన చికిత్సా అనుభవాలను వైద్యులకు సమగ్రంగా వివరించారు. ఎ.యస్.ఆర్. హోమియో వైద్య కళాశాల, టి.పి.గూడెం కు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్.పి.రాధ, తన రోగి అరచేతికి సోకిన సోరియాసిస్ అనే చర్మ వ్యాధిని పూర్తిగా నయం చేసిన విధానాన్ని ఆధారిత చిత్రాల ద్వారా వివరించారు. సంస్థ మహిళా విభాగం కన్వీనర్ డాక్టర్ జగధాత్రి మాట్లాడుతూ వచ్చే ఈనెల 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మహిళలకు ప్రత్యేక ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని కోట నరవ గ్రామంలో నిర్వహించగలమని తెలిపారు. ఆఖరున కార్యనిర్వహక కార్యదర్శి డాక్టర్ సునీత వాకా వందనం సమర్పణ చేసారు.



తెలుగు సెలబ్రిటీ క్రికెట్ లీగ్ లో సంగీత దర్శకుడు ఎస్.ఎస్. తమన్, ఐ.ఎ.ఎస్. అధికారి అరుణ్ బాబు

## గ్రేటర్ నిర్లక్ష్యంతో.. రోడ్డెక్కిన మత్స్యవ్యాపారం





(ప్రభాతవార్త విశాఖపట్నం)

"గ్రేటర్" నిర్లక్ష్యంతో మత్స్య వ్యాపారం రోడ్డెక్కింది. వ్యాపారం చేసుకునేందుకు స్థిరమైన స్థలాన్ని కేటాయించవలసిన జీవీఎంసీ తమకేమీ పట్టనట్లు వ్యవహారిస్తుండడంతో.. ట్రాఫిక్ ఇబ్బందులు అధిక అవుతున్నాయి. సంపన్న ప్రాంతంగా చెబుతున్న ఎంవీపీ కాలనీ పరిధిలోని అప్పుఘర్ నుంచి

- ట్రాఫిక్ జాంతో ఇబ్బందులు
- పట్టించుకోని జీవీఎంసీ యంత్రాంగం

దాదాపుగా కామత్ హోటల్ వరకు(బీచ్ రోడ్డు) మత్స్య వ్యాపారం జరుగుతోంది. ఆదివారం వస్తే చాలు.. ఆ ప్రాంతమంతా కొనుగోలుదారులతో నిండిపోతుంది. ఈ కారణంగా రోడ్డుపై వాహనాలను పార్కింగ్ చేయడంతో.. అటువైపు రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మత్స్య వ్యాపారానికి స్థలాన్ని కేటాయించకపోవడంతో.. ఆ వ్యాపారం రోడ్డు ఎక్కినట్టు తెలుస్తుంది. ఈ సమస్యపై ఇప్పటికైనా దృష్టి సారించకపోతే, భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని స్థానిక ప్రాంతీయులు వివరిస్తున్నారు.






## "సైకిల్ థాన్ ఫిట్ ఇండియా మిషన్" ఆధ్వర్యంలో ర్యాలీ

- ఉత్సాహంగా పాల్గొన్న ఎమ్మెల్యేలు గణబాబు, విష్ణు కుమార్ రాజు

విశాఖపట్టం, మార్చి 1 ప్రభాతవార్త

దేశ వ్యాప్తంగా ఆరోగ్య స్ఫూర్తిని పెంపొందించేందుకు "ఫిట్ ఇండియా మిషన్" ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులో ఆదివారం నిర్వహించిన సైకిల్ ర్యాలీ ఉత్సాహభరితంగా సాగింది. భారత క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, నార్త్ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన సైకిల్ ర్యాలీలో గణబాబు పాల్గొని ఎన్‌టీఆర్ విగ్రహం నుంచి ర్యాలీని ప్రారంభించి అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు సైకిల్ తొక్కుకుంటూ వెళ్లారు. ఆయనతో పాటు యువత, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని సైకిల్ ల్యాలీలో కొనసాగారు. గణబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో వ్యాయామాన్ని భాగంగా చేసుకోవాలని, ఆరోగ్యమే మహాభాగ్యమనే విషయాన్ని గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. యువత క్రీడల వైపు ఆకర్షితులై, శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.







## ఉత్సవాల నిర్వహణకు ఎంవిఆర్ ఆర్థిక తోడ్పాటు అమోఘం

- నిర్వాహకుల నుండి పశ్రంసల వెల్లువ

అనకాపల్లి, మార్చి 1, (ప్రభాతవార్త)

స్థానిక విజయరామరాజు పేట మరిడిమాంబ ఉత్సవ నిర్వాహకులకు విరాళాలు అందజేసి ప్రముఖ వ్యాపార వేత్త ముత్యాల వెంకటేశ్వరరావు తన ఉదారతను చాటుకున్నారు. అలాగే కశింకోట,పరిసర ప్రాంతాలలో జరిగిన ప్రతి ఉత్సవం దిగ్విజయం లో ఎం వి ఆర్ అందించిన ఆర్థిత తోడ్పాటు అత్యంత కీలకమైనది.విజయరామరాజు పే టగ్రామ కమిటీ సభ్యులకు1,25 వేల రూపాయలు, పోలారపు బ్రదర్స్ కు 40 వేలు, యల్లంకి సత్తిబాబు కు 50 వేలు, నాని కు 25 వేల రూపాయలు చొప్పున సహాయం చేసిన ఎం వి ఆర్ సేవా స్ఫూర్తిని కొనియాడిన ఉత్సవ ప్రోగ్రాంల కన్వీనర్లు ఎం వి ఆర్ తో పాటు తనయుడు సంజయ్ ను స్వయంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,పండుగను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్ల కోసం మీరు అందించిన విరాళం కమిటీ సభ్యులకు ఎంతో తోడ్పడిందని వారు తెలిపారు. ఆయన సహకారంతో ఆలయ ప్రాంగణం విద్యుత్ అలంకరణలు, భక్తులకు అన్నప్రసాదం, సాంస్కృతిక కార్యక్రమాలు సమర్థంగా నిర్వహించగలిగామని కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. పండుగ ఘనంగా ముగిసిన సందర్భంగా ఎం.వి.ఆర్ సేవాభావాన్ని



పలువురు ప్రశంసించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అండగా నిలుస్తూ సమాజానికి ఆదర్శంగా మారుతున్న ఎం.వి.ఆర్ ను పలువురు ప్రతినిధులు, ఎం వి ఆర్ అభిమానులు అభినందించారు.దీనిలో భాగంగా ఎం వి ఆర్ తో పాటు తనయుడు సంజయ్ కు శాలువా కప్పి జ్ఞాపికను అందించి ఘనంగా సత్కరించారు.ఈ మేరకు... గ్రామ కమిటీ సభ్యులకు 1,25,000 రూపాయలు పోలారపు బ్రదర్స్ (లోకేష్ రాము) లకు 40000 రూపాయలు, ఎల్లంకి సత్తిబాబు కు 50 వేల రూపాయలు, నాని కు పాతికవేల రూపాయలను ఎం వి ఆర్ విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ చైర్మన్ ఆళ్ల శివ రామ సత్యనారాయణ, కార్యదర్శి పలక రాము కోశాధికారి పిట్ల బుద్దే శ్వర రావు, వైస్ చైర్మన్ బొబ్బిలి అప్పారావు పలు కుల సంఘాల ప్రతినిధులు తోపాటు ఎం వి ఆర్ యువసేన సభ్యులు గైపూరి రాజు, ఏపూరి వాసు తదితరులు పాల్గొన్నారు.

ong-10_ong-10.qxd 3/2/2026 1:03 AM Page 1



## నేడు డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండి

**- ఏపీఈపీడీసీఎల్ సీఎండి పృథ్వీతేజ్ ఇమ్మడి ఐఏఎస్**

**విశాఖపట్నం, మార్చి 1,(ప్రభాతవార్త**

ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని విద్యుత్ సంబంధిత సమస్యలను మరింత వేగవంతంగా పరిష్కరించే లక్ష్యంతో ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండికి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సంస్థ సీఎండి పృథ్వీతేజ్ ఇమ్మడి పేర్కొన్నారు. సంస్థ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, కాకినాడ, డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు ఫోన్ నంబరు 8688400499 ద్వారా విద్యుత్ సంబంధిత సమస్యలను తెలియజేయవచ్చని వెల్లడించారు. విశాఖపట్నం ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఉదయం 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ సీఎండి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యుత్ సంబంధిత సమస్యలను సీఎండి దృష్టికి తీసుకురావలసిన వినియోగదారులు విద్యుత్ సర్వీసు నంబరును తమ వద్ద అందుబాటులో ఉంచుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి, రూఫ్ టాప్ సోలార్, తదితర విద్యుత్ సంబంధిత సమస్యలపై ఫిర్యాదులను నేరుగా సీఎండి దృష్టికి తీసుకురావచ్చన్నారు. ఈ అవకాశాన్ని సంస్థ పరిధిలోని 11 జిల్లాల వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సీఎండి పృథ్వీతేజ్ విజ్ఞప్తి చేసారు.

## కలెక్టరేట్‌లో నేడు పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్..

**- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్**

**విశాఖపట్నం, మార్చి 1,(ప్రభాతవార్త**

విశాఖపట్నం జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 వరకు జరుగుతాయని, రెవెన్యూ అధికారులతో పాటు అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను పూర్తి వివరాలతో సమర్పించాలని సూచించారు. అలాగే "మీ కోసం కాల్ సెంటర్ 1100 "సేవలు,వెబ్‌సైట్‌ను వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. ఇప్పటివరకు ఆయా శాఖలకు అందిన ఫిర్యాదులు, తీసుకున్న చర్యలపై సమీక్ష ఉంటుందని, సంబంధిత నివేదికలతో అధికారులు నిర్ణీత సమయానికి రావాలని ప్రకటన ద్వారా ఆదేశించారు.

## ఆలోచింపజేసిన అవధానం

**విశాఖపట్నం, మార్చి 1, ప్రభాతవార్త**

ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ విశాఖ, హైదరాబాద్ ప్రతి నెల నిర్వహించే "వినోదాల విందు లో భాగంగా ఆదివారం సాయంత్రం ద్వారాకా నగర్ పౌర గ్రంథాలయంలో జరిగిన "నవ్వుకుందాం రండి" అవధాన రూపకం (పేరడీ అవధానం ) 195 వ ప్రదర్శన సాయంత్రం 6గం 30ని నుండి 8.30 ని వరకు కామెడీ షో నిర్వహించారు. ఇందులో జె ఎల్ నరసింహారావు అవధాని. కె ఎల్.



కామేశ్వరరావు, అప్రస్తుతం, నిర్వహణ ఎం వి సుబ్రహ్మణ్యం, పృచ్ఛకులు నందూరి రామకృష్ణ, రామానుజం, శ్రీధర్, రజని,జె. పి శర్మ, రాగ నాయుడు, నక్షత్ర, బోను నరసింహ రావు పాల్గొన్నారు. ముందుగా శాస్త్రీయ నాట్య ప్రదర్శన చేసిన అనంతరం "నవ్వుకుందాం రండి" అవధాన రూపకం, పేరడీ అవధానం లో హెల్మెట్ పెట్టుకుంటే లాభాలు, తెలుగు పరిస్థితి, భగవంతుని లీలాలు, వారఫలాలు, కవితలు, అంత్య ప్రాసలు, తాగడం వల్ల నష్టాలు, వాస్తు పిచ్చి, చామత్కారం మాట్లాడే ఆడవాళ్లు, అంశాలు మీద సటైర్ లతో నవ్వులు పూయించారు. తరువాత అధితులు తిలక్ పట్నాయక్, ప్రముఖ సినీ నటుడు ప్రముఖ వైద్యులు భద్రం, ఆర్ శివ కుమార్ ప్రముఖ జర్నలిస్ట్ రచియిత, లావణ్య గోల్డ్ మెడలిస్ట్ లు శాలువా మెమెంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమం నిర్వహణ ఎం వి సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాష్‌లు పాల్గొన్నారు.

## బూత్ స్థాయికి కేంద్ర పథకాలు: పి.వి.ఎన్. మాధవ్

**గాజువాక, మార్చి 1, ప్రభాతవార్త**



బీజేపీ సిద్ధాంతాలను, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను బూత్ స్థాయిలోకి బలంగా తీసుకెళ్లాలని ఆ పార్టీ రాష్ట్ర నేత పి.వి.ఎన్. మాధవ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం అనకాపల్లిలో నిర్వహించిన ఖిపండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్‌ఖిలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మార్చి 7 నుంచి ఏప్రిల్ 14 వరకు నిర్వహించనున్న మండల స్థాయి శిక్షణా తరగతులకు వక్తలుగా వెళ్లే వారికి దిశానిర్దేశం చేశారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గోపి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కరణంరెడ్డి నరసింగరావు, సుహాసిని, వివిధ జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.

## నిఖార్సయిన కార్యకర్తకు నిలువుటద్దం అప్పలనాయుడు

**- సంస్మరణ సభలో భీమిలి ఎమ్మెల్యే గంటా**

**భీమిలి, మార్చి 1, ప్రభాతవార్త**

నాగవంశీయుల భవన నిర్మాణానికి ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి, దానికి స్వర్గీయ గాడు అప్పల నాయుడు పేరు పెడతామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రకటించారు. తగరపువలస జె



కన్వెన్షన్ లో ఆదివారం జరిగిన టీడీపీ నాయకుడు అప్పలనాయుడు సంస్మరణ సభకు ముఖ్యఅతిథి గా హాజరై ఆయన మాట్లాడారు. 2023 లో జరిగిన ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అప్పలనాయుడు సతీమణి చిన్ని కుమారి లక్ష్మి పేరు ప్రకటించగా.. ఆఖరి నిమిషంలో తప్పుకోవాల్సి వచ్చినప్పటికీ, టీడీపీ అభ్యర్థి కోసం పని చేసి గెలిపించిన గొప్ప వ్యక్తిత్వం అప్పలనాయుడు సొంతమని ప్రశంసించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత గుర్తింపును ఇస్తే చాలంటూ, ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రారంభంలో ఖర్చు చేసిన డబ్బు కూడా వెనక్కి తీసుకోలేదని పేర్కొన్నారు. నిజమైన కార్యకర్త అంటే ఎలా ఉండాలనే దానికి గాడు అప్పలనాయుడు నిలువెత్తు నిదర్శనమన్నారు. సోలార్ ప్యానెల్స్ కంపెనీ ప్రారంభానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకురావాలని పట్టుబట్టి సాధించుకున్నారని గుర్తు చేసుకున్నారు. వివాదరహితుడు, విలువలకు కట్టుబడి ఉన్న నాయకుడైన అప్పలనాయుడు మరణం పార్టీకి, వ్యక్తిగతంగా తనకు ఎంతో నష్టమని చెప్పారు. అంతకుముందు గాడు అప్పలనాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి గంటా శ్రీనివాసరావు నివాళులర్పించారు. యువ నాయకులు గంటా రవితేజ, నాగవంశీయుల కార్పొరేషన్ చైర్మన్ వై.రమణ, భీమిలి జడ్పీటీసీ గాడు వెంకటప్పుడు, కార్పొరేటర్ గాడు చిన్ని కుమారి లక్ష్మి, యశ్వంత్, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, గంటా నూకరాజు, కంటుభుక్త


**వార్త CLASSIFIEDS** (VAARTHA CLASSIFIEDS)

**CHANGE OF NAME**

★ **I, TRIPURANA PREETHI** W/O TRIPURANA RAJESH KUMAR previously called TAJINDER KOUR R/O 12-43/4, VEERABADHRA NAGAR, PENDURTHI, VIZAG now changed my name from TAJINDER KOUR to TRIPURANA PREETHI. Henceforth I will be called as **TRIPURANA PREETHI** for all purposes. **(Ro.No.45261)**

★ **I, GIDITHURI NARENDRA** S/O SANYASI RAO previously called GIDUTHURI NARENDHRA R/O 18-12-10/1, KUMMARI VEEDHI, MAHARANIPETA, VIZAG now changed my name from GIDUTHURI NARENDHRA to GIDITHURI NARENDRA. Henceforth I will be called as **GIDITHURI NARENDRA** for all purposes. **(Ro.No.45262)**

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.


## సంక్షేమ హాస్టల్ సౌకర్యాలపై గంటా ఆరా

**భీమిలి, మార్చి 1, ప్రభాతవార్త**



జీవీఎంసీ 5 వ వార్డు పరదేశిపాలెం సాంఘిక సంక్షేమ హాస్టల్ లో సుమారు 200 మంది విద్యార్థినులకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదివారం ప్రభుత్వం అందించిన టవల్స్ ను పంపిణీ చేశారు. హాస్టల్ లో సౌకర్యాల గురించి విద్యార్థినులను ఆరా తీశారు.ప్రభుత్వం సంక్షేమ హాస్టల్స్ కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందని, ఎలాంటి సమస్య ఉన్నా నేరుగా తనకు ఫోన్ చేసి చెప్పాలని ఫోన్ నెంబరు చెప్పారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరక్టర్ రామారావు, ఎ.ఎస్.డబ్ల్యూ. కృష్ణారావు, హాస్టల్ వార్డెన్ పి.మోహిని, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, మొల్లి లక్ష్మణరావు, మాన్యాల సోంబాబు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వైభవోపేతంగా అనంతపద్మనాభస్వామి తెప్పోత్సవం

**పద్మనాభం, మార్చి1, ప్రభాతవార్త**



పద్మనాభం పుణ్యక్షేత్రంలో గత మూడు రోజుల నుండి జరుగుతున్న కళ్యాణ మహోత్సవాలలో భాగంగా ఆలయ ఈ ఒ పి ఎల్ ఎన్ రాజు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి జంక్షను సమీపంలో ఉన్న కన్నయ్య కోనేరులో స్వామివారి తెప్పోత్సవంను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ముందుగా శ్రీదేవి,భూదేవి సమేతుడైన అనంతునిని హంస వాహనంపై కుంతీమాధవస్వామి ఆలయం నుండి



కోనేరు వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో తీసుకొచ్చారు.అక్కడ విద్యుత్ కాంతులతో అందంగా అలంకరించిన తెప్పపై వేంచేయించి అర్చకులు ప్రత్యేక పూజలు చేసారు. అనంతరం కోనేరు స్వామివారు ఐదుసార్లు విహరించారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి కనులారా వీక్షించారు. అలాగే ఎంపీపీ రాంబాబు, ఎంపిటీసీ కె లక్ష్మి, గంటా రవితేజ,రమణ దాము, పద్మనాభం, ఎర్రినాయుడు,నాగు, పూజలు చేసారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

**ఆనందపురం, మార్చి 1, ప్రభాతవార్త**



ఆనందపురం మండలంలోని వెల్లంకి జాతీయ రహదారి పై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని పాత డెయిరి ఫామ్ ప్రాంతానికి చెందిన వల్లభ శేఖర్ (26) అనే యువకుడు పెయింటింగ్ పనులు చేస్తుంటాడు. ఇదిలా ఉండగా భోగాపురంలో ఉన్న తమ బంధువుల శుభాకార్యానికి వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి ఇంటికి వస్తున్నాడు. అతను ద్విచక్ర వాహనం పై ప్రయాణిస్తూ మండలంలోని వెల్లంకి జాతీయ రహదారి వద్దకు చేరుకునే సరికి వెనుక వైపు నుంచి వస్తున్న వ్యాన్ ఢీ కొట్టింది. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనంతో పాటు శేఖర్ రోడ్డు పై తూలి పడడంతో తీవ్రంగా గాయపడిన శేఖర్ సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. శవాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ అస్పత్రికి తరలించి ఎస్ ఐ శివ కేసుని దర్యాప్తు చేస్తున్నారు.

## జీవీఎంసీలో నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**- పునర్వ్యవస్థీకరణ చెందిన 10 జోన్లలో పిజిఆర్ఎస్**

**విశాఖపట్నం, మార్చి 1, ప్రభాతవార్త**





మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోను, పునర్వ్యవస్థీకరణ చెందిన భీమిలి, మధురవాడ, ఈస్ట్, వెస్ట్, సౌత్ ,నార్త్, పెందుర్తి, గాజువాక, అగనంపూడి అనకాపల్లి జోన్ల కార్యాలయాల్లోనూ "ప్రజా సమస్యల పరిష్కార వేదిక ( పీజీఆర్ఎస్) కార్యక్రమం" సోమవారం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు నిర్వహిస్తున్నట్లు విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. నగరంలో పారిశుద్ధం, పట్టణ ప్రణాళిక విభాగం, నీటి సరఫరా, వీధి దీపాలు,హారికల్చర్, రెవిన్యూ, యు సి డి, ఇంజినీరింగ్ మొదలగు జీవీఎంసీ విభాగాలకు సంబంధించిన సమస్యలపై సోమవారం జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో నగర ప్రజలు అర్జీల ద్వారా సమస్యలను తెలియపరుచుకోవచ్చునని నగర ప్రజలకు విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ తెలియచేశారు.

## రెండో రోజు క్రికెట్ పోటీలు ప్రారంభించిన గంటా

**మధురవాడ, మార్చి 1, ప్రభాతవార్త**



మధురవాడ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో తెలుగు సెలబ్రిటీ క్రికెట్ లీగ్ రెండో రోజు పోటీలను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బలమైన జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్ అందరికీ ఆనందాన్ని పంచుతుందని పేర్కొన్నారు. ఈరోజుతో ముగుస్తున్న సెలబ్రిటీ క్రికెట్ విశాఖ ప్రజలకు మంచి అనుభూతిని అందించిందన్నారు. ధోనీ కెరీర్ మలుపు తిప్పిన విశాఖ క్రికెట్ స్టేడియంలో సెలబ్రిటీ క్రికెట్ లీగ్ కూడా ఆడాలని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ను ఒప్పించారని నిర్వాహకుడు రాంబాబును అభినందించారు. టాస్ వేసి పోటీలను ఆరంభించారు.

## పరిహారం చెక్కులు అందజేత

**భీమిలి, మార్చి 1, ప్రభాతవార్త**



సముద్రంలో మత్స్య వేటకు వెళ్లి మరణించిన బోయివీధికి చెందిన సురివిన వీర్రాజు కుటుంబానికి రూ. 5 లక్షల ఎక్స్ గ్రేషియా చెక్కును భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదివారం తగరపువలసలో అందజేశారు. అలాగే ప్రమాదంలో మరణించిన ఆనందపురం మండలం బోని గ్రామానికి చెందిన కనకల ప్రసాద్ కుటుంబానికి ఎన్టీఆర్ ట్రస్టు తరపున రూ. 2 లక్షల ఆర్థిక సాయాన్ని ఎంపీపీ కాలనీలోని క్యాంప్ కార్యాలయంలో ఆయన అందించారు. కార్యక్రమంలో ఫిషరీస్ జేడీ లక్ష్మణరావు, జడ్పీటీసీ గాడు వెంకటప్పుడు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, గంటా నూకరాజు, సూరాల సత్య వర ప్రసాద్, గరికిన ఎల్లాజీ (కింగ్) తదితరులు పాల్గొన్నారు.

## రియల్ ఎస్టేట్ మోసం కేసులో నిందితుడు అరెస్ట్

**- రూ. 28 లక్షలు మోసం.. ఒడిశాలో పట్టుకున్న పెందుర్తి పోలీసులు**

**(విశాఖ క్రైమ్, ప్రభాతవార్త)**

విశాఖ నగరంలోని పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన రియల్ ఎస్టేట్ మోసం కేసులో ప్రధాన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఒడిశా రాష్ట్రానికి చెందిన నబీనా బాఘా అలియాస్ నవీన్‌ను శుక్రవారం సునాబేడా ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నానికి చెందిన దుగ్గిరాల ప్రసాద్ బాబు అనే వ్యక్తికి రియల్ ఎస్టేట్ స్థలం అమ్ముతామని నమ్మబలికి, నకిలీ పత్రాలు సృష్టించి రూ.28 లక్షలు దోచుకున్న ఘటనపై ఈ ఏడాది ఆగస్టు 12న క్రైం నం.362/2025గా కేసు నమోదు చేశారు.దర్యాప్తులో భాగంగా నిందితులు ఒడిశాకు చెందినవారని గుర్తించిన పోలీసులు పలుమార్లు వెతికినా వారు అందుబాటులోకి రాలేదు. కాగా గత నెల 28న నిందితుడు సునాబేడా ప్రాంతంలో సంచరిస్తున్నాడని విశ్వసనీయ సమాచారం అందడంతో, పెందుర్తి ఇన్స్పెక్టర్ కె.వి. సతీష్ కుమార్ ఆదేశాల మేరకు సబ్ ఇన్స్పెక్టర్ ఎన్.వి. భాస్కరరావు సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లి నబీనా బాఘాను అరెస్ట్ చేశారు. విచారణలో నిందితుడు నకిలీ అధీకరణ పత్రాలు తయారు చేసి, ఒక వ్యక్తిని కంపెనీ జీఎంగా చూపిస్తూ బాధితుడిని నమ్మబలికి దశల వారీగా డబ్బులు వసూలు చేసినట్లు ఒప్పుకున్నాడు. నేరానికి ఉపయోగించిన మొబైల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన నిందితుడిని 7వ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టు, విశాఖపట్నం సమక్షంలో హాజరుపరిచి జుడిషియల్ కస్టడీకి రిమాండ్ చేశారు. ఈ అరెస్టు సబ్ ఇన్స్పెక్టర్ ఎన్.వి. భాస్కరరావు ఆధ్వర్యంలో జరిగింది. రియల్ ఎస్టేట్ లావాదేవీలు చేసే ముందు సంబంధిత పత్రాలు, అధీకరణలు పూర్తిగా ధృవీకరించుకుని మాత్రమే డబ్బులు చెల్లించాలని పెందుర్తి పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## జె ఇ ఇ మెయిన్ ఫలితాల్లో సత్తా చాటిన వేదాంతు

**ఆరిలోవ , మార్చి 1, ప్రభాతవార్త**

జె ఇ ఇ మెయిన్ 2026 సెషన్ వన్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుండి విద్యార్థులు అద్భుతమైన ప్రదర్శనిచ్చారు. 118 మంది వేదాంతు విద్యార్థులు 90శాతం కంటే ఎక్కువ స్కోర్ చేయడంతో, ఈ ప్రాంతంలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుండి అత్యధికంగా సాధించిన వారిలో సాహిల్ బి ప్రథమ స్థానంలో నిలిచి 99.72 శాతం సాధించాడు. భాస్కరబట్ల సాయి ఆదిత్య 99.51 శాతం, డి ఎం అశ్వత్ 99.34 శాతంతో ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఈ ముగ్గురు ఈ ప్రాంతం నుండి అధిక స్కోరర్ల జాబితాలో ఉన్నారు. మొత్తం మీద, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుండి ముగ్గురు వేదాంతు విద్యార్థులు 99.5 శాతం కంటే ఎక్కువ స్కోర్ చేశారు. 10 మంది విద్యార్థులు 99 శాతం మార్కునుదాటారు. ఈ సందర్భంగా వేదాంతు సహ వ్యవస్థాపకుడు, సీఈఓ వంశీ కృష్ణ తో పాటు సహ వ్యవస్థాపకుడు, విద్యావేత్తల అధిపతి ఆనంద్ ప్రకాష్ మాట్లాడుతూ .. ఈ ఫలితాలు ఎన్నో ఏళ్లుగా మేం నమ్మిన విశ్వాసాన్ని, సరైన మార్గదర్శకత్వం ద్వారా అన్‌లాక్ చేయబడిన సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తాయని, విద్యార్థికి వచ్చిన శాతం వెనుక పట్టుదల, కఠోర క్రమశిక్షణ కథనం ఉంటుందని, ఈ ఫలితాలు మా సమగ్ర సాంకేతిక నమూనా, బోధనా నైపుణ్యం, వ్యక్తిగతీకరించిన విద్యామద్దతు యొక్క బలాన్ని ప్రతిబింబిస్తాయన్నారు.

## మారండి.. లేదంటే పీడీ యాక్ట్!

**- రౌడీషీటర్లకు సీపీ శంఖబ్రత బాగ్చి స్ట్రాంగ్ వార్నింగ్**

**- చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలే**

**(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)**



రౌడీషీటర్లు తమ తీరు మార్చుకోకపోతే పీడీ యాక్ట్ అమలు చేస్తామని విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి కఠిన హెచ్చరిక జారీ చేశారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, ప్రోత్సహించినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. నగరంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని తెలిపారు. సీపీ ఆదేశాల మేరకు జోన్1 పరిధిలో లా అండ్ ఆర్డర్ డీసీపీ మణికంఠ ఆదేశాలతో నార్త్ ఏసీపీ అప్పలరాజు, ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి, ద్వారక ఏసీపీ నరసింహమూర్తి పర్యవేక్షణలో సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లు తమ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు.అలాగే జోన్2 పరిధిలో లా అండ్ ఆర్డర్ డీసీపీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు హార్బర్ ఏసీపీ , సౌత్ ఏసీపీ , వెస్ట్ ఏసీపీ పృథ్వీరాజు పర్యవేక్షణలో సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లు తమ పరిధిలో గల కౌన్సిలింగ్ చేపట్టారు.అలాగే టాస్క్ ఫోర్స్ పోలీస్ స్టేషన్‌లో సీఐలు భాస్కరరావు, అప్పలనాయుడు ఆధ్వర్యంలో రెండు జోన్ల రౌడీషీటర్లకు ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు. నిఘా కంట్రోల్‌లోనే కదలికలు రౌడీషీటర్ల ప్రతి కదలికపై పోలీస్ సర్వైలెన్స్ ఉందని అధికారులు హెచ్చరించారు. నేరాలు, దౌర్జన్యాలు, బెదిరింపులు, అక్రమ కార్యకలాపాలకు సంబంధించి ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చినా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఆదివారం హాజరు.. సంతకాలు తప్పనిసరి ప్రతి ఆదివారం పోలీస్ స్టేషన్లలో హాజరై సంతకాలు చేయాలని సూచించారు. జీవనోపాధి వివరాలను నమోదు చేసుకుని, సత్ప్రవర్తనతో జీవించాలని సూచించారు. మంచి ప్రవర్తన కనబరిచినవారి రౌడీషీట్లు తొలగించే విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని వెల్లడించారు. మారితే ప్రోత్సాహం.. మంచి ప్రవర్తన చూపిస్తూ చట్టానికి లోబడే రౌడీషీటర్లకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పోలీసులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. విశాఖను నేరరహిత నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని సీపీ శంఖబ్రత బాగ్చి పేర్కొన్నారు.మారండి.. లేదంటే కఠిన చర్యలు తప్పవనీ సీపీ బాగ్చి హెచ్చరించారు.. పెందుర్తిలో పోలీస్ స్టేషన్లో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ పెందుర్తి పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఇన్స్పెక్టర్ కె.వి. సతీష్ కుమార్ సూచనల మేరకు సబ్ ఇన్స్పెక్టర్ పి. లక్ష్మి ఆధ్వర్యంలో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. వారి ప్రవర్తన కుటుంబ సభ్యులపై ప్రభావం చూపుతుందని గుర్తుచేశారు. చట్టాన్ని గౌరవిస్తూ సమాజ హితానికి తోడ్పడేలా మారాలని సూచించారు.

## బొత్స సత్యనారాయణను పరామర్శించిన అవంతి

**విశాఖపట్నం, మార్చి 1, ప్రభాతవార్త**

హైదరాబాద్ న్యూరోసిటీ హాస్పిటల్లో అనారోగ్యముతో చికిత్స పొందుతున్న మాజీ మంత్రివర్యులు, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణని మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు పరామర్శించి, తన ఆరోగ్యము గురించి యోగక్షేమాలు అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని, ఆరోగ్యంగా ఇంటికి తిరిగి రావాలని, ఏమి భయపడవద్దని, అంతా మంచే జరుగుతుందని చెప్పారు. అనంతరం డాక్టర్లతో అతని ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు, కాసేపు సత్యనారాయణ కుటుంబ సభ్యులతో సంభాషించి త్వరగా కోలుకొని ఆరోగ్యంగా ఇంటికి తిరిగి రావాలని దేవుని ప్రార్థిస్తున్నామని చెప్పారు.

# మహిళల భద్రతపై రాజీ లేదు

- వేధింపులకు ఖబడ్దార్.. జైలే గమ్యం!
- ఆత్మవిశ్వాసమే అమ్మాయిల అసలైన బలం
- ప్రేమ విఫలమైతే జీవితం ముగిసిందనే కాదు
- ఆర్థిక స్వావలంబనతోనే నిజమైన గౌరవం
- మహిళల కోసం 24 గంటల అండగా విశాఖ పోలీసులు
- దేశంలోనే సురక్షిత నగరంగా విశాఖకు గుర్తింపు
- ఇబ్బందులు ఎదురైతే వెంటనే కాల్ చేయండి: 7995095799
- పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మహిళా దినోత్సవం సందేశం





**(విశాఖ క్రైమ్, ప్రభాతవార్త)**

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి నగర మహిళల భద్రత, హక్కులు , భవిష్యత్తుపై కీలక సందేశాన్ని ఇచ్చారు. మహిళలు ఆన్‌లైన్ గానీ, ఆఫ్‌లైన్ గానీ ఎక్కడైనా వేధింపులకు గురికాకూడదని, తమ హక్కులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఆత్మవిశ్వాసమే విజయానికి మూలం టీనేజ్ వయసులో ప్రేమ వ్యవహారాల కారణంగా మనస్తాపానికి గురై ఆత్మహత్య వంటి తీవ్రమైన నిర్ణయాలు తీసుకోవద్దని యువతికి హితవు పలికారు. ఒక అమ్మాయి జీవితం ఎవరో ప్రేమిస్తారా లేదా అన్నదానిపై ఆధారపడకూడదని స్పష్టం చేశారు. సరైన సమయంలో ప్రతి ఒక్కరికీ సరైన జీవిత భాగస్వామి దొరుకుతారని, లక్ష్యాల వైపు ముందుకు సాగాలని సూచించారు. ఆర్థిక స్వావలంబనతోనే నిజమైన రక్షణ ప్రతి అమ్మాయి చిన్నప్పటి నుంచే విద్యలో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పిలుపునిచ్చారు. ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించినప్పుడే మహిళలకు నిజమైన గౌరవం, భద్రత లభిస్తాయని తెలిపారు. లక్ష్యం సాధించే వరకు కృషి ఆపకూడదని సూచించారు. గృహ హింసపై రాజీ లేదు పెళ్లి తర్వాత భర్త వేధింపులు, అనుమానాలు, వ్యసనాల వల్ల ఇబ్బంది పడుతున్న



మహిళలకు విశాఖ సిటీ పోలీసులు అండగా ఉంటారని హామీ ఇచ్చారు. బాధితుల పిల్లల చదువు ఆగకుండా ఎన్‌జీఓల సహకారంతో తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వేధింపులపై కఠిన చర్యలు మహిళలను ఇబ్బంది పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. అవసరమైతే రౌడీషీట్ ఓపెన్ చేసి జైలుకు పంపిస్తామని స్పష్టం చేశారు. ఎవరైనా వేధింపులకు పాల్పడితే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. సురక్షిత నగరంగా విశాఖ దేశంలోనే మహిళలకు అత్యంత సురక్షిత నగరంగా విశాఖపట్నం గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. ఈ గుర్తింపును ప్రపంచస్థాయికి తీసుకెళ్లేందుకు హోంగార్డు నుంచి సీపీ వరకు ప్రతి పోలీసు అధికారి కృషి చేస్తున్నారని తెలిపారు. సహాయం కోసం.. మహిళలు ఏవైనా వేధింపులకు గురైతే పగలు, రాత్రి ఎప్పుడైనా 7995095799 నంబరుకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నగర మహిళలందరికీ విశాఖ సిటీ పోలీస్ తరఫున సీపీ శంఖబ్రత బాగ్చి శుభాకాంక్షలు తెలియజేశారు.

## అంగన్వాడీ సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ప్రభుత్వ విప్ గణబాబు

**గోపాలపట్నం, మార్చి 1, ప్రభాతవార్త**



అంగన్వాడీ కార్యకర్తలు మరియు హెల్పర్ల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు) స్పష్టం చేశారు. ఆదివారం గోపాలపట్నంలోని కార్యాలయంలో అంగన్వాడీ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన ఆయన వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అంగన్వాడీలకు రెండుసార్లు గౌరవ వేతనాన్ని పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక రంగాన్ని దివాళా తీసి వెళ్ళిపోయిందని, వారు చేసిన అప్పులకు రాష్ట్రానికి వస్తున్న ఆదాయంతో పాటు ఇంకా అప్పులు తెచ్చి వడ్డీలు కట్టాల్సిన పరిస్థితి ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న వేతనాల పెంపు డిమాండ్‌పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సానుకూలంగా ఉన్నారని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బట్టి త్వరలోనే శుభవార్త వింటారని హామీ ఇచ్చారు. అంగన్వాడీల చిరకాల కోరికైన గ్రాట్యుటీని అమలు చేసే దిశగా ప్రభుత్వం గత బడ్జెట్ లోనే రూ. 20 కోట్లు కేటాయించిందని, పదవీ విరమణ పొందిన వారికి తగిన ఆర్థిక సాయం అందుతుందని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా 86 కోట్లతో తాగునీరు, మరుగుదొడ్ల వంటి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గంలోని కేంద్రాలకు కూడా ప్రాధాన్యత ఇస్తామన్నారు. కార్యకర్తలకు పనిభారం తగ్గించేందుకు మరియు పారదర్శకత కోసం రూ. 75 కోట్లతో అత్యాధునిక 5జి స్మార్ట్‌ఫోన్లను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. దీనివల్ల సేవల నాణ్యత పెరిగిందని ఆయన పేర్కొన్నారు. అంగన్‌వాడీలు ఎటువంటి అపోహలకు లోనుకావద్దని, తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు.సమావేశంలో పలువురు అంగన్వాడీ కార్యకర్తలు మరియు వార్డు ప్రెసిడెంట్లు బొడ్డేటి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నవరం సత్యదేవుని సేవలో వెన్నా శ్రీరామమూర్తి

**గాజువాక,మార్చి 1,ప్రభాతవార్త**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ మీడియా కోఆర్డినేటర్ వెన్నా శ్రీరామమూర్తి ఆదివారం కుటుంబ సమేతంగా అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు వేద మంత్రోచ్చారణలతో సాదర స్వాగతం పలికారు. స్వామి వారిని దర్శించుకున్న అనంతరం ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేసి, ఆశీర్వచనాలు పలికారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బందికి, కమిటీ సభ్యులకు శ్రీరామమూర్తి కృతజ్ఞతలు తెలిపారు.

## అనంతుని సేవకులకు దుస్తులు అందజేసిన సుంకర నారాయణరావు

**పద్మనాభం, మార్చి 1, ప్రభాతవార్త**



పద్మనాభం గ్రామంలో వేంచేసియున్న అనంతపద్మ నాభస్వామి పేరుమీద స్వామివారి సేవకుకు కృష్ణాపురం గ్రామానికి చెందిన సుంకర నారాయణరావు ఆదివారం తెప్పోత్సవం సందర్భంగా దుస్తులు పంపిణీ చేశారు. స్వామివారి కళ్యాణ మహోత్సవాలు మరో మూడు రోజులు జరగనున్నాయి. దీంతో సేవకులు స్వామివారిని గ్రామ పురవీధులలో ఊరేగించినపుడు ఈ దుస్తులు ధరించనున్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాంబాబు, మండల టీడీపీ అధ్యక్షుడు కె.రమణ,నాయకులు దామోదరరావు, తాలాడ పద్మనాభం ఎర్రినాయుడు, నాగు, సన్నిబాబు, సుమంతనాయుడు పాల్గొన్నారు.

## అంగన్వాడీలకు కూటమి అండ విపక్షాల ఉచ్చులో పడొద్దు

- తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు,గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

**గాజువాక, మార్చి 1,ప్రభాతవార్త**



రాష్ట్రంలోని అంగన్వాడీ కార్యకర్తలకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తోందని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. సోమవారం అంగన్వాడీలు చేపట్టిన ఛలో విజయవాడకు కార్యక్రమంపై ఆయన ఆదివారం పాత గాజువాకలోని పార్టీ కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. విషం చిమ్ముతున్న విపక్షాలు గత ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్తమైన వ్యవస్థలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా చక్కదిద్దుతోందని పల్లా పేర్కొన్నారు. అంగన్వాడీ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్న తరుణంలో, విపక్షాలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం అంగన్వాడీలను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆరోపించారు. "ప్రభుత్వంపై విషం చిమ్ముతూ అంగన్వాడీలను ఉద్యమాల వైపు ప్రేరేపిస్తున్న విపక్షాల మాయమాటలను నమ్మవద్దు" అని ఆయన విజ్ఞప్తిచేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వంపై నమ్మకంతో సహక రించాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దిన ఘనత తమ ప్రభుత్వానిదేనని ఆయన గుర్తు చేశారు.బాణసంచా ప్రమాదంపై దిగ్భ్రాంతి...కాకినాడ జిల్లా వేట్లపాలెంలో జరిగిన బాణసంచా ప్రమాదంపై పల్లా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతి చెందిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాద వార్త తెలియగానే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తక్షణమే స్పందించి ఘటనాస్థలికి వెళ్లడం వారి ప్రజా సంక్షేమ పాలనకు నిదర్శనమని కొనియాడారు. క్షతగాత్రులకు ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలు అందిస్తోందని తెలిపారు. ఈ సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు, కార్పొరేటర్ మొల్లి ముత్యాల నాయుడు, విల్లా రామ్మోహన్ కుమార్, బలగా బాలు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పుస్తక పఠనంతోనే విజ్ఞానం

**గాజువాక,మార్చి 1,ప్రభాతవార్త**



మల్కాపురం శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడంమాకిష్టం కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. సుమారు 40 మంది జీవీఎంసీ పాఠశాల విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కళారత్న సుంకర చలపతిరావు విద్యార్థులకు గర్వభంగం కథను వివరించి, అహంకారం వీడి సోదరభావంతో మెలగాలని హితవు పలికారు. తెలుగు భాషా విశిష్టతను వివరిస్తూ.. పిల్లలు పంచతంత్రం కథలను చదవాలని సూచించారు. గ్రంథాలయ అధికారి ఆధ్వర్యంలో విద్యార్థులు పలు పుస్తకాలను పఠించారు.

## జోరుగా జనసేన పార్టీ సభ్యత నమోదు కార్యక్రమం

**ఆరిలోవ, మార్చి 1, ప్రభాతవార్త**



తూర్పు నియోజకవర్గం స్థానిక 10వ వార్డు డైరీ ఫారం వద్ద ఆదివారం పార్టీ సీనియర్ నాయకులు పైడికొండల సునీల్ నాయుడు ఆధ్వర్యంలో చేపట్టిన జనసేన పార్టీ ఉద్యమి సభ్యత నమోదు కార్యక్రమం జోరుగా కొనసాగింది. ఈ సభ్యత నమోద కార్యక్రమంలో స్థాని కులు, యువత, మహిళలు ఉత్సా హంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేపడుతున్న ప్రజా కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, కార్యకర్తలకు అందిస్తున్న ఇన్సూరెన్స్ సదుపాయాలపై ప్రజలకు పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని, పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షులు బండి రాజా రమేష్, సీనియర్ నాయకులు అన్నం తిరుపతిరావు, కొల్లా సంతోష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలపై మండల సమావేశంలో చర్చ

**ఆనందపురం, మార్చి 1, ప్రభాతవార్త**



ఆనందపురం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం జరిగిన సాధారణ సర్వ సభ్య సమావేశంలో సభ్యులు లేవనెత్తిన పలు సమస్యలపై చర్చ నిర్వహించారు. ఎంపీపీ మజ్జి శారద ప్రియాంక అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండలంలో గల అన్ని శాఖల పనితీరు, ప్రగతి పై సమీక్షించారు. ఈ సమావేశంలో ముఖ్యంగా వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అమలు జరుగుచున్న వివిధ పథకాలు, ఎరువుల పంపిణీ, పదో తరగతి పరీక్షల సన్నద్ధత, ఆరోగ్య సేవలు, కౌమార బాలికలకు క్యాన్సర్ వ్యాక్సిన్ పంపిణీ, వీబిజి రామ్జీ పథకం ద్వారా కాలువల పూడిక పనులు చేయాలని మొదలగు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో జడ్పిటిసి సభ్యులు కోరాడ వెంకట్రావు గారు వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, పిఏసిఎస్ ఏ చైర్మన్లు గండ్రెడ్డి సోంబాబు, దొంతల నాగరాజు వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్ లు పాల్గొన్నారు.

## పరిహారం చెక్కులు అందజేత

**ఆనందపురం, మార్చి 1, ప్రభాతవార్త**



సముద్రంలో మత్స్య వేటకు వెళ్లి మరణించిన బోయివీధికి చెందిన సురివిన వీర్రాజు కుటుంబానికి రూ. 5 లక్షల ఎక్స్ గ్రేషియా చెక్కును భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదివారం తగరపువలసలో అందజేశారు. అలాగే ప్రమాదంలో మరణించిన ఆనందపురం మండలం బోని గ్రామానికి చెందిన కనకల ప్రసాద్ కుటుంబానికి ఎన్టీఆర్ ట్రస్టు తరఫున రూ. 2 లక్షల ఆర్థిక సాయాన్ని ఎంపీపీ కాలనీలోని క్యాంప్ కార్యాలయంలో ఆయన అందించారు. కార్యక్రమంలో ఫిషరీస్ జేడీ లక్ష్మణరావు, జడ్పీటీసీ గాడు వెంకటప్పడు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, గంటా నూకరాజు, సూరాల సత్య వర ప్రసాద్, గరికిన ఎల్లాజీ (కింగ్) తదితరులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాలను అలరించేలా సంప్రదాయని సుద్దిని సుద్దపూసని

**విశాఖపట్నం, మార్చి 1, ప్రభాతవార్త**



శ్రీ శివాజీ ప్రొడక్షన్ బ్యానర్‌పై శివాజీ, లయ జంటగా నటించిన సరికొత్త చిత్రం"సంప్రదాయని సుద్దిని సుద్దపూసని". ఈ నెల 6వ తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో, చిత్ర యూనిట్ ఆదివారం ఉదయం విశాఖపట్నంలో మీడియా సమావేశాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా హీరో శివాజీ, హీరోయిన్ లయ చిత్ర విశేషాలను పంచుకున్నారు. హీరో శివాజీ మాట్లాడుతూ.. ఇది ఒక విభిన్నమైన డార్క్ కామెడీ చిత్రమని తెలిపారు."గతంలో లయనేను కలిసి చేసిన మూడు సినిమాలను ప్రేక్షకులు ఎలాగైతే ఆదరించారో, ఈ సినిమాను కూడా అలాగే ఆదరించాలని కోరుతున్నాను. సాంకేతిక పరంగా అత్యున్నత ప్రమాణాలు పాటించాం. ముఖ్యంగా సినిమా ఆఖరి 45 నిమిషాలు ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది. మాస్టర్ రోహన్ పాత్ర అద్భుతంగా నటించాడు" అని పేర్కొన్నారు. రాజకీయ, సామాజిక అంశాలపై స్పందిస్తూ.."ఒక పక్క ప్రజల కోసం మాట్లాడుతూనే, మరోపక్క కుటుంబాల కోసం సినిమాలు చేస్తాను. అధికారంలో ఏ పార్టీ ఉన్నా ప్రజల శ్రేయస్సు కోసం నా గళం వినిపిస్తూనే ఉంటాను. విశాఖలో సినీ పరిశ్రమ అభివృద్ధి చెందాలి, లేదంటే ఇక్కడి వారు ఉపాధి కోసం మళ్లీ హైదరాబాద్, చెన్నై వెళ్లాల్సిన పరిస్థితి వస్తుంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో స్త్రీ వస్త్రధారణపై తాను చేసిన వ్యాఖ్యలు ఎవరినీ ఉద్దేశించినవి కావని, అవి తన వ్యక్తిగత భావనలు మాత్రమేనని ఆయన క్లారిటీ ఇచ్చారు. హీరోయిన్ లయ మాట్లాడుతూ.. విశాఖపట్నంతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు."నా తాతగారి స్వస్థలం విశాఖ కావడంతో చిన్నప్పుడు ఇక్కడే పెరిగాను. ఈ చిత్రంలో నా పాత్ర పేరు"ఉత్తర. భర్త మీద చూపించే అతి ప్రేమ ఎలాంటి ఇబ్బందులకు దారితీస్తుందనే అంశాన్ని కామెడీగా, వినోదాత్మకంగా తెరకెక్కించారు. ఇది కేవలం ఫ్యామిలీ సినిమా మాత్రమే కాదు, అన్ని వయసుల వారు చూసి ఎంజాయ్ చేసేలా ప్రమోట్ చేయాలని కోరుతున్నాను" అని తెలిపారు.

## వెల్లంకిలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

**ఆనందపురం, మార్చి1, ప్రభాతవార్త**



ఆనందపురం మండలం వెల్లంకిలో సుబ్బిరామరెడ్డి కల్యాణ మండపం వద్ద వృక్ష ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. విశాఖ శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సహకారంతో జరిగిన ఈ శిబిరంలో కంటి రోగులు పాల్గొన్నారు. 110 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించగా 20మందికి కేటరాక్ట్ సర్జరీకి ఎంపిక చేశారు. ఇంకా కంటి పొరలకు ముగ్గురు, కంటి నరాలకి సంబంధించి ఒకరు, కంటి నల్ల గుడ్డుకు సంబంధించి నలుగురికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వృక్ష ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కాకర సురేష్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు కాకర వెంకట రమణ, శంకర్ ఫౌండేషన్ ఆదిత్య, ఆప్తమాలజిస్ట్ సుర్తి, వందన నర్సింగ్, క్యాంప్ కోఆర్డినేటర్ కే.ప్రసాద్, వై. రాజు, వైద్య శంకర ఫౌండేషన్ పాల్గొన్నారు.

## ఇసుకలపాలెంలో విద్యుత్ షాక్ తగిలి ఇద్దరు తాపీ మిస్త్రీలు దుర్మరణం

**పద్మనాభం,మార్చి 1, ప్రభాతవార్త**





మండలంలో ఇసుకలపాలెం గ్రామంలో రేకుల షెడ్ నిర్మాణంలో విద్యుత్ షాక్ తగిలి ఇద్దరు తాపీ మిస్త్రీలు ఆదివారం దుర్మరణం చెందినట్లు పద్మనాభం సి.ఐ.సి.హెచ్.శ్రీధర్ చెప్పారు. ఈ సంఘటనపై ఆయన అందించిన వివరాలు ప్రకారం కృష్ణాపురం జగనన్న కాలనీకి చెందిన తాపీ మేస్త్రీ కంటుబోతు శ్రీను(40),ఇసుకలపాలెంకి చెందిన కాళ్ల సూరీడు (63),గ్రామ చివరన గోవుల కోసం రేకుల షెడ్ నిర్మిస్తుండంగా షెడ్ పైపు అక్కడే ఉన్న విద్యుత్ హెచ్ టీ వైర్లు తగిలి ఇద్దరూ అక్కడకక్కడే మృతిచెందారు.ఇంకొకరు గాయాలపాలయ్యారు.దీంతో మృతుల కుటుంబ సభ్యులు కన్నీరమున్నీరయ్యారు. మృతుడు శ్రీనుకి భార్య రాజు, పాప, బాబు , కాళ్ల సూరీడుకి భార్య కనకరత్నం, కొడుకు ఉన్నారు. మృతుల భార్యలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు సి ఐ చెప్పారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన చెప్పారు.

## చెరకు తోట దగ్ధం

**మునగపాక, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త**



మండల కేంద్రం మునగపాకలో వేగి నాగ సూరి అప్పారావుకు చెందిన చెరకు తోట దగ్ధమైన విషయం తెలిసిందే. సుమారు 75 సెంట్ల విస్తీర్ణంలో ఉన్న చెరకు పంట శనివారం మధ్యాహ్నం అగ్నికి ఆహుతైంది. ఈ ఘటనతో రైతుకు గణనీయమైన నష్టం వాటిల్లింది. ఈ రోజు ఉదయం ఘటన విషయం తెలుసుకున్న తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ , మునగపాక మండల అధ్యక్షుడు పెంటకోట తో కలిసి దగ్ధమైన తోట ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడి పరిస్థితులను సమీక్షించి, బాధిత రైతుతో మాట్లాడి సంఘటన వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సంఘటన స్థలం నుండే స్థానిక ఎమ్మార్ఓ గారికి మరియు సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి, నష్టపోయిన రైతుకు తక్షణమే న్యాయం చేయాలని, తగిన నష్టపరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. విద్యుత్ శాఖ అధికారులు ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు నిర్వహించి, బాధిత రైతుకు తగిన పరిహారం అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

## నూతన సి సి రోడ్డులు నిర్మాణ పనులు ప్రారంభం

ఎస్ రాయవరం మార్చి 1, ప్రభాతవార్త



ఎస్ రాయవరం మండలం కొత్త రేవుపోల వరం గ్రామంలో ఆదివారం నూతనంగా నిర్మి స్తున్న సి సి రోడ్డులు నిర్మాణ పనులను మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అమలకంటి అబద్ధం చేతుల మీదుగా కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ. రోడ్ల నిర్మాణ పనుల నిమిత్తం 15 లక్షలు గ్రాంట్ వచ్చిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షులు వెంకటరాజు. కొరుప్రోలు పి ఏ సి ఎస్ చైర్మన్ గుర్రం రామకృష్ణ. మండల తెలుగు యువత అధ్యక్షులు కోడ లోవరాజు, సీనియర్ నాయకులు వాసపల్లి అడవిరాజు, మైలపల్లి అప్పలరాజు, అప్పన్న, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యాన పంటల సాగు పై అవగాహన

గొలుగొండ మార్చ్ 1, ప్రభాతవార్త



రైతులు ఉద్యాన పంటల సాగు పై అవగాహన పెంపొందించుకోవాలని కొండంపూడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఎం సత్తిబాబు అన్నారు. ఎల్ పురం, విప్పలపాలెంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో సాగులో మెలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. ఉద్యానవన శాఖ కూడా పలు ప్రోత్సాహాలు అందిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకొని పంపకాలకు రైతులు మక్కువ చూపాలన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్యానవన శాఖ ద్వారా గ్రీన్ లీఫ్ ఎఫ్ పి ఓ ద్వారా రూపొందించిన గోడ పత్రికను ఏ ఎల్ పురం సర్పంచ్ లోచుల సుజాత ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి యస్. శిరీష, కె వి కె శాస్త్రవేత్త ఎన్ . సత్తిబాబు, సీఈఓ నాయుడు, న్యాచురల్ ఫార్మింగ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గణేష్, గ్రామ స్వరాజ్ సమితి ఎన్జీవో సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నూకాంబిక ఆలయాన్ని సందర్శించిన జనసేన నేత

అనకాపల్లి మార్చి1 (ప్రభాత వార్త)



ఉత్తరాంధ్ర జిల్లాల ఇలవేల్పు శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయాన్ని. అనకాపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ భీమరశెట్టి రామ్ కి ఆదివారం సందర్శించారు. మాజీ మంత్రి అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పర్యవేక్షణలో నూతన దేవాలయ నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరలోనే పునః ప్రారంభం కానున్న అమ్మవారి ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతుంది. అమ్మవారి నూతన దేవాలయ ప్రారంభోత్సవం , కళస ప్రతిష్టకు ఏర్పాట్లును పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ రాజకీయ నాయకులు విచ్చేయుచున్న సందర్భంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగ శ్రీను 81 వార్డ్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ జోగి నాయుడు, రాష్ట్ర గవరా కార్పొరేషన్ డైరెక్టర్ విల్లూరు హరి ధర్మకర్తలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలకు అండగా కూటమి ప్రభుత్వం

### రెండుసార్లు వేతనాలు పెంచిన ఏకైక ప్రభుత్వం :ఎమ్మెల్యే రాజు

చోడవరం, మార్చి 1, ప్రభాతవార్త



అంగన్వాడీ కార్యకర్తలకు అండగా కూటమి ప్రభుత్వం ఉందని, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రెండుసార్లు వేతనాలు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి దక్కిందని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు చెప్పారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల ముందు అంగన్వాడీలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. అలాగే అంగన్వాడి కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు కూడా చర్యలు చేపడుతున్నట్లు ఆయన అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అంగన్వాడి కేంద్రాల్లో మరుగుదొడ్లు మంచినీటి సౌకర్యాలు కల్పనకు 86 కోట్ల 68 లక్షల రూపాయలు ప్రభుత్వ విడత చేసిందన్నారు. అలాగే 58,2శ4 మంది అంగన్వాడి కార్యకర్తలు ఆయాలకు సూపర్వైజర్లకు కోఆర్డినేటర్లకు ఎదుగుదలతో 5జి స్మార్ట్ ఫోన్లు అందించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. అలాగే ప్రతి నెల ఒకటో తేదీన జీతం అందే విధంగా చర్యలు తీసుకుంటూ ఆలస్యం జీతాలుకి చెక్ పెట్టినట్లు చెప్పారు. అలాగే అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులు హాజరు శాతం 70% నుంచి 96% పెరగడం కూటమి ప్రభుత్వ పాలనదీక్షకు నిదర్శనం అన్నారు. ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న గ్రాడ్యుటీ కలను ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. ఇందుకోసం 20 కోట్లు కేటాయించి అధికారులకు వచ్చిన 9 నెలలోనే అందించడం జరిగిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గల 5000 మినీ అంగన్వాడి కేంద్రాలను ప్రధాన అంగన్వాడి కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుం టున్నట్లు చెప్పారు. అలాగే మినీ అంగన్వాడి కేంద్రాల్లో పని చేస్తున్న కార్యకర్తలను టీచర్లుగా పదోన్నతి కల్పించి వేతనాలు అందించేందుకు కృషి జరుగుతుందని చెప్పారు. అంగన్వాడీలు కోరుతున్న డిమాండ్లలో ఎప్పటికైనా డిమాండ్లు పరిష్కారం అయ్యాయన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. గత ప్రభుత్వం ఆర్థిక రంగాన్ని దివాళీ తీసి వెళ్లిందని ఫలితంగా తమ ప్రభుత్వం వారు చేసిన అప్పులను రాష్ట్రానికి వస్తున్న ఆదాయంతో పాటు కొత్తగా అప్పులు తెచ్చి వడ్డీలు కట్టవలసిన పరిస్థితి రాష్ట్రంలో నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## పెద్ద గుమ్మలూరు గ్రామంలో వాలీబాల్ పోటీలు

(ఎస్ రాయవరం మార్చి1 ప్రభాతవార్త



పెద్ద గుమ్ములూరు గ్రామంలో వేంచేసి యున్న శ్రీ శ్రీ శ్రీ నూకాంబిక అమ్మవారు, మరిడిమాంబ అమ్మవారి నూతన ఆలయ పునర్నిర్మాణ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా ఆదివారం వాలీబాల్ పోటీలు మాజీ ఎంపీపీ ఏజర్ల వినోద్ రాజు ప్రారంభించారు. పలు గ్రామాల నుండి 20 పురుషులు జట్లు 6 స్త్రీలు జట్లు పాల్గొన్నరని ఆయన తెలియ జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గురువారం నూతన ఆలయ పునర్నిర్మాణ విగ్రహ ప్రతిష్ట భాగంగా ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ పోటీల్లో పాల్గొని గెలుపొందిన వారికి ఒకటో బహుమతి 10000. రెండో బహుమతి 8000. మూడో 5000. అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అనకాపల్లి కేంద్రంగా ఎస్సీ ఎస్టీ బీసీ ప్రభుత్వ మహిళా హాస్టల్స్ ఏర్పాటు చేయాలి

### మార్చి 9నుండి 14 వరకు రిలే నిరాహార దీక్షలు

చోడవరం, మార్చి 1, ప్రభాతవార్త

అనకాపల్లి జిల్లా కేంద్రంగా ఎస్సీ, ఎస్టీ,బీసీ మహిళ హాస్టల్స్ ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ విజ్ఞప్తి చేసింది. ఇందుకు సంబంధించి మార్చి 9వ తేదీ నుండి 14వ తేదీ వరకు చేసే రిలే నిరాహార దీక్షలను చేపడుతున్నట్టు తెలిపారు. ఈ మేరకు ఆదివారం చోడవరం ఎస్సీ బాలుర హాస్టల్ వద్ద గోడ పత్రిక లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా కేంద్రంలో మహిళా హాస్టల్స్ ఏర్పాటుకై గతంలో అనేక సార్లు జిల్లా అధికారులకు స్థానిక ప్రజా ప్రతినిధికి విన్నవించుకున్న ఎటువంటి స్పందన లేదన్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రంలో ఒకే ఒక బీసీ మహిళ హాస్టల్ ఉంది. అందులో కూడా వందమంది పట్టే బిల్డింగ్లో దాదాపు 200 మంది విద్యార్థులు ఇబ్బంది పడుతూ ఉంటున్నారు. జిల్లా కేంద్రానికి అనేకమంది విద్యార్థులు చదువుకోవడానికి వచ్చి ప్రభుత్వ హాస్టల్స్ లో ఖాళీ లేక విద్యకు దూరమయ్యే పరిస్థితి ఉంది. ఈ సమస్యను ఉన్నత అధికారులకు ఎన్నోసార్లు వివరించిన ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. కాబటి అనకాపల్లి జిల్లా కేంద్రంగా ఎస్సీ ఎస్టీ బీసీ మహిళ కళాశాల హాస్టల్స్ ఏర్పాటుకై మార్చి 9 నుంచి 14వ తేదీ వరకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేసే రిలే నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని నిర్ణయించమన్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి వచ్చే విద్యా సంవత్సరానికి ఎస్సీ ఎస్టీ బీసీ ప్రభుత్వ మహిళా హాస్టల్స్ ఏర్పాటుకై చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున విద్యార్థినిలను సమీకరించి పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు జగదీష్,సింహాద్రి,బాబీ,గణేష్ తదితరులు పాల్గొన్నారు.




## ఉపమాక వెంకన్నపై మొట్టమొదటి పాట ఆవిష్కరణ.!

(నక్కపల్లి, ప్రభాతవార్త)



నక్కపల్లి మండలం ఉపమాక గ్రామంలో గరుడాద్రి పర్వతంపై స్వయం వ్యక్తంగా వేంచేసియున్న తిరుమల తిరుపతి దేవస్థానం వారి అనుబంధ దేవాలయమైన శ్రీ కల్కి వేంకటేశ్వర స్వామి వారిపై రావోయి ఉపమాక దేవా పరా మొట్టమొదటి పాటను ఆదివారం సాయంత్రం దేవాలయం ప్రాంగణంలో ఆవిష్కరించారు. దీనికి సంబంధించి ప్రముఖ అష్టావధాని కవిత్రి డాక్టర్ గొట్టుముక్కల గాయత్రీ దేవి రచించిన పాటను తిరుమల తిరుపతి దేవస్థానం డోలు విద్వాన్ ఎన్. సింహాచలం స్వరపరచగా కళ్యాణి రాగంలో ఆదితాళంలో స్వర రచన చేశారు. పురాతనమైన స్వామివారి ఆలయం పై మొట్టమొదటిసారిగా రచన చేసి స్వరపరచడం పట్ల నక్కపల్లి పీఏసీఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రచన చేసిన గాయత్రీ దేవిని స్వర రచన చేసిన ఎన్. సింహాచలం లను తిరుమల తిరుపతి దేవస్థానం సూపరింటెండెంట్ క్రాంతి కుమార్, డి పి విశాఖపట్నం ఇంచార్జ్ సత్యనారాయణ, నక్కపల్లి, ఎస్. రాయవరం మండలాల బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు డివి రామారావు, కార్యదర్శి శ్రీపాద ప్రణవ్ ,దేవస్థానం ప్రధాన అర్చకుడు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దేవస్థానం డోలు విద్వాన్ స్వరరచన చేసిన సింహాచలంకు దేవస్థానం ప్రధాన అర్చకుడు వరప్రసాదాచార్యులు పదివేల రూపాయలు పారితోషకాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన నందూరి వెంకట రాజ గోపాలచార్యులు, చెరుకూరి వెంకటేశ్వరరావు, దవరసింగి సన్యాసిరావు పలు గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉత్సవాల నిర్వాహణకు ఎంవిఆర్ ఆర్థిక తోడ్పాటు అమోఘం

### నిర్వాహకుల నుండి ప్రశంసల వెల్లువ

అనకాపల్లి,మార్చి1 ( ప్రభాత వార్త)



స్థానిక విజయ రామరాజు పేట మరిడిమాంబ ఉత్సవ నిర్వాహకులకు విరాళా లు అందజేసి ప్రముఖ వ్యాపార వేత్త ముత్యాల వెంకటేశ్వరరావు తన ఉదారతను చాటు కున్నారు. అలాగే కశింకోట,పరిసర ప్రాంతాలలో జరిగిన ప్రతి ఉత్సవం దిగ్విజయంలో ఎం వి ఆర్ అందించిన ఆర్థిక తోడ్పాటు అత్యంత కీలకమైనది.విజయరామరాజు పేట గ్రామ కమిటీ సభ్యులకు1,25 వేల రూపాయలు, పోలారపు బ్రదర్స్ కు 40 వేలు, యల్లంకి సత్తిబాబు కు 50 వేలు, నాని కు 25 వేల రూపాయలు చొప్పున సహాయం చేసిన ఎంవిఆర్ సేవా స్ఫూర్తిని కొనియాడిన ఉత్సవ ప్రోగ్రాంల కన్వీనర్లు ఎం వి ఆర్ తో పాటు తనయుడు సంజయ్ ను స్వయంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండుగను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్ల కోసం మీరు అందించిన విరాళం కమిటీ సభ్యులకు ఎంతో తోడ్పడిందని వారు తెలిపారు. ఆయన సహకారంతో ఆలయ ప్రాంగణం విద్యుత్ అలంకరణలు, భక్తులకు అన్నప్రసాదం, సాంస్కృతిక కార్యక్రమాలు సమర్థంగా నిర్వహించగలిగామని కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. పండుగ ఘనంగా ముగిసిన సందర్భంగా ఎం.వి.ఆర్ సేవాభావాన్ని పలువురు ప్రశంసిం చారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అండగా నిలుస్తూ సమాజానికి ఆదర్శంగా మారుతున్న ఎం.వి.ఆర్ ను పలువురు ప్రతినిధులు, ఎం వి ఆర్ అభిమానులు అభినందించారు.దీనిలో భాగంగా ఎం వి ఆర్ తో పాటు తనయుడు సంజయ్ కు శాలువా కప్పి జ్ఞాపికను అందించి ఘనంగా సత్కరించారు.ఈ మేరకు... గ్రామ కమిటీ సభ్యులకు 1,25,000 రూపాయలు పోలారపు బ్రదర్స్ (లోకేష్ రాము) లకు 40000 రూపాయలు, ఎల్లంకి సత్తిబాబు కు 50 వేల రూపాయలు, నాని కు పాతికవేల రూపాయలను ఎం వి ఆర్ విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ చైర్మన్ ఆళ్ల శివ రామ సత్యనారాయణ, కార్యదర్శి పలక రాము కోశాధికారి పిట్ల బుద్దే శ్వర రావు, వైస్ చైర్మన్ బొబ్బిలి అప్పారావు పలు కుల సంఘాల ప్రతినిధులు తోపాటు ఎం వి ఆర్ యువసేన సభ్యులు గైపూరి రాజు, ఏపూరి వాసు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మేకల కాపరి మృతి

(రాంబిల్లి మార్చి 01 ప్రభాతవార్త)

రాంబిల్లి మండలం గోవిందపాలెం గ్రామంలో మేకల కాపరి జోగా అప్పారావు (75) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు, శనివారం సాయంత్రం సుమారు మూడు గంటల ప్రాంతంలో వాడ నరసాపురం గ్రామ పరిధిలో ఉన్న దుర్గాలమ్మ గుడి మరియు నావికాస్త్రావరం ప్రధాన ద్వారం మధ్యలో వాడ నరసాపురం గ్రామానికి చెందిన కులకరి లికిత్ (16) టీవీఎస్ జూపిటర్ వాహనాన్ని అధిక వేగంతో నిర్లక్ష్యంగా నడుపుతూ వచ్చి మేకల కాపరిని ఢీకొట్టడంతో తలకి, నడుముకి బలమైన గాయాలు తగిలాయి, తల నుండి అధిక రక్తస్రావం కావటంతో అచ్యుతాపురం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం ఐదు గంటల సమయంలో మరణించాడు, ఈ విషయంపై ఫిర్యాదు అందిన మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని స్థానిక సీఐ సిహెచ్ నర్సింగరావు తెలిపారు.

## వైభవంగా శ్రీ సిద్ధి వినాయక 26వ వార్షికోత్సవం

(ఎస్ రాయవరం మార్చి 1 ప్రభాత వార్త



పెద ఉప్పలం గ్రామంలో వేంచేసియున్న శ్రీ సిద్ధి వినాయక 26వ వార్షికోత్సవంఆదివారం వైభవంగా జరిగింది. భక్తులు ఉదయం నుండి ఆలయంనకు చేరుకొని స్వామివారి ప్రత్యేక పూజాల్లో పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమం లో పాల్గొని తీర్థ ప్రసాదములు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోశేటి వెంకటరమణ.గ్రామ ప్రజలు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

## బహిరంగమార్కెట్ కు గురుకులకళాశాల నిత్యావసర సరుకులు..?

### రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న పిడి ఉదయ్, సెక్యూరిటీ సిబ్బంది

కొయ్యూరు మార్చి1 ప్రభాతవార్త



మండలంలోని కాకరపాడు గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల వసతి గృహం నుండి బహిరంగంగా మార్కెట్కు అక్రమంగా తరలిపోతున్న నిత్యవసర సరుకులను కళాశాల పిడి చెట్టి ట్టి ఉదయ్, సెక్యూరిటీ సిబ్బంది ఆదివారం రాత్రి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. కళాశాల వసతి గృహంలో రోజువారి వేతనానికి పనిచేస్తున్న ఒక వర్కర్ ద్వారా ఈ నిత్యవసర సరుకులు బహిరంగ మార్కెట్కు తరలిస్తుండగా తాము పట్టుకున్నామని, ఈ విషయాన్ని వెంటనే గిరిజన సంక్షేమ శాఖ డిడి, ఏటిడబ్ల్యూఓ లకు తెలియజేసినట్టు పిడి వివరించారు. కాగా ఈ విషయమై నిందితుడైన వర్కర్ మాట్లాడుతూ- తనకు డిప్యూటీ వార్డెన్ సరుకులను ఇచ్చి బయటకు పట్టికెళ్ళమన్నారని తెలిపాడు.

## చిట్టంపాడు ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ...!

### డా.సురేష్ కుమార్ ను సన్మానించిన స్థానిక నేతలు

కొయ్యూరు, మార్చి1, ప్రభాతవార్త



మండలంలో చిట్టంపాడు ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు డా. వైఎస్ఆర్ టీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పరీక్షలకు అవసర మైన సామగ్రి (పెన్నులను అట్టలను) వైఎస్సార్సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ తెడబారికి సురేష్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ- 10వ తరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థులకు ముందుగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసి పరీక్ష కేంద్రానికి వెళ్ళే ముందు ఎటువంటి ఒత్తిడికి ఆందోళనకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి ఉత్తమ ప్రతిభను కనబరిచి పాఠశాల సిబ్బందికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నేమాని నూకాలమ్మ , ఎంపీటీసీ బిడిజన అప్పారావు ,యువ నాయకులు వారా నూకరాజు,వారా గంగమ్మ,దేపూరి రాజు,స్కూల్ కమిటి చైర్మన్ ధవళ చిన్నారావు ,వార్డెన్ సతీష్ ,మాస్టర్ వారా కన్నబాబు ,గ్రామస్తులు పీటర్,బాలరాజు ,ప్రసాద్ తదితరులు పాల్గొని, డా. సురేష్ కుమార్ ను ఘనంగా సన్మానించారు.

## 3న అమ్మవారి ఆలయం మూసివేత

పాడేరు,మార్చ్1,ప్రభాతవార్త:



పాడేరు శ్రీశ్రీశ్రీ మోదకొండమ్మ వారి ఆలయంలో ఈ నెల 3వ తేదీ మంగళవారం రోజున సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా అమ్మవారి ఆలయం ముసి వేయబడునని ఆలయ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే ఆలయంలో మంగళవారం జరగనున్న అన్న సమారాధన కార్యక్రమం నిలుపుదల చేయనున్నామని బుధవారం రోజు నుండి యధావిధి భక్తులకు అమ్మవారి దర్శనాలు యధావిధిగా జరుగుతాయని అమ్మవారి భక్తులు గమనించాలని ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కోటిబాబు తెలియజేశారు.

## చింతాలమ్మ ఘాట్లో రోడ్డు ప్రమాదం..!

### తీవ్రగాయాలపాలైన వీఆర్వో సత్యనారాయణ, తనయుడు రవికిరణ్

కొయ్యూరు మార్చి1 ప్రభాతవార్త



ఆదివారం సాయంత్రం మండలంలోని చింతాలమ్మ ఘాట్ హైవే రోడ్డుపై జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో కారు బైక్ ఢీకొని రాజేంద్రపాలెం విఆర్ఓ సత్య నారాయణ, అతని తనయుడు రవికిరణ్ తీవ్ర గాయాల పాల య్యారు. వీఆర్వో సత్యనారాయణ, తనయుడు రవి కిరణ్ కొయ్యూరు నుండి కృష్ణదేవపేట వైపు బైక్ పై వెళుతుండగా, చింతాలమ్మ ఘాట్ మధ్యలో ఎదురుగా వస్తున్న కారు బలంగా ఢీకొట్టడంతో, బైక్ పై ఉన్న విఆర్ఓ అతని తనయుడు తీవ్ర గాయాల పాలయ్యారు. క్షతగాత్రులను 108 వాహనంపై నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## గిరిజనుల సమస్యలు తక్షణమే పరిష్కరిస్తా

### రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్



రంపచోడవరం. మార్చి 1 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టి కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జి రెడ్డి ఆదివారం రంపచోడవరం ఆయన నివాసంలో గిరిజనుల సమస్యలపై అర్జీలు స్వీకరించడం జరిగింది. వై.రామ వరం మండలం, యార్లగడ్డ పంచాయతీ, శేషరాయి గ్రామానికి చెందిన గ్రామ ప్రజలు రోడ్డు సమస్యలపై చైర్మన్ ను కలిసి తమ వినతిపత్రాన్ని అందజేశారు. అలాగే యార్లగడ్డ గ్రామం నుంచి వయా కొమరవరం, గంగవరం మీదుగా పెరికవలస వరకు సుమారు 20 కిలోమీటర్ల రహదారి నిర్మాణం చేపట్టాలని కోరారు. అదేవిధంగా వై.రామవరం నుంచి గురమంద శివాలయం వరకు రహదారి నిర్మాణం చేయాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా నూకలమిద్ది గ్రామం, దారలోవ గ్రామం పరిధిలోని గ్రామ సచివాలయం, పాత వాటర్ ట్యాంక్, ఆశ్రమ పాఠశాల మరియు సమీప 5 గ్రామాలకు ఇప్పటివరకు విద్యుత్ కనెక్షన్ లేకపోవడంతో విద్యుత్ సౌకర్యం కల్పించాల్సిందిగా దరఖాస్తు సమర్పించారు. చైర్మన్ బొజ్జిరెడ్డి గిరిజన ప్రజల రోడ్లు, విద్యుత్ సమస్యలను విని, అందిన దరఖాస్తులను పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో చర్చించి, తమ వంతుగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా చైర్మన్ బొజ్జిరెడ్డి తెలిపారు.

## మహిళల భద్రత.. ప్రతి ఒక్కరి బాధ్యత..!

### అంతర్జాతీయ మహిళా దినోత్సవవారోత్సవాల అవగాహన ర్యాలీ...!



కొయ్యూరు, మార్చి 1, ప్రభాతవార్త

కొయ్యూరు పోలీస్ సర్కిల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల భాగంగా ఆదివారం మండలకేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని రాజేంద్రపాలెం వారపు సంత నుండి గుడ్లపల్లి జంక్షన్ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల విద్యార్థినులు, పాఠశాల సిబ్బంది కొయ్యూరు ప్రాంతానికి చెందిన మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ర్యాలీ సందర్భంగా మహిళా భద్రత, మహిళా సాధికారత, బాల్య వివాహాల నిరోధం మరియు గంజాయి వ్యతిరేక సందేశాలతో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. అందరూ ఒకే స్వరంతో నినాదాలు చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. గుడ్లపల్లి జంక్షన్ వద్ద మానవ హారం ఏర్పాటు చేసి మహిళల గౌరవం, భద్రత మరియు సామాజిక బాధ్యతపై బలమైన సందేశాన్ని ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుండి మంచి స్పందన లభించింది. మహిళల భద్రత, గౌరవం మరియు సమానత్వం కోసం పోలీస్ శాఖ కట్టుబడి ఉందని ఈ సందర్భంగా కొయ్యూరు సీఐ శ్రీనివాసరావు తెలియజేశారు.

## పంచదార్లలో ఉచిత కంటి శిబిరం

(రాంబిల్లి మార్చి 01 ప్రభాతవార్త)




రాంబిల్లి మండలం పంచదార్ల గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు, అనకాపల్లి భువనేశ్వరి ఐ కేర్ క్లినిక్ డాక్టర్ లండా నరసింహ మూర్తి ఆధ్వర్యం లో కంటి పరీక్షలు నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాంబిల్లి మండల పార్టీ మాజీ అధ్యక్షులు వసంతవాడ వెంకటేశ్వర్లు (దినుబాబు) పాల్గొన్నారు, ఈ శిబిరానికి నిపుణులైన వైద్యులు వచ్చి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు మరియు తగిన సూచనలు అందించడం జరిగిందన్నారు, కంటి సమస్యలపై అవగాహన కల్పిస్తూ చికిత్స వివరాలు తెలియజేశారు, చుట్టుపక్కల గ్రామ ప్రజలు కూడా శిబిరానికి విశేషంగా హాజరై సద్వినియోగం చేసుకున్నారు, సుమారు 80 మంది రోగులు తమ కళ్ళను పరీక్షించుకున్నారని సిబ్బంది తెలిపారు. సిబ్బంది శేషు, మిత్రా, నాయుడు, స్థానిక స్కూల్ మాజీ చైర్మన్ రామారావు మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం..!

కొయ్యూరు, మార్చి1 ప్రభాతవార్త



మండలంలోని రామరాజుపాలెం గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో చెదల గణేష్ (25) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. వలసంపేటకు చెందిన గణేష్ వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై రామరాజు పాలెం వెళ్లి తిరిగి వస్తుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడగా ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. సంఘటనకు సంబంధించి పోలీసులకు సమాచారం అందించారు. కొయ్యూరు ఎస్సై కిషోర్ వర్మ సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

pages (2):pages (2).qxd 02-03-2026 00:04 Page 4



## ముగిసిన ద్వితీయ సోపానం శిక్షణ శిబిరం



అరకు రూరల్, మార్చి, 1 ప్రభాతవార్త

అరకు లోయ మండలంలోని రవలగుడ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో నిర్వహిస్తున్న భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వితీయ సోపానం శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా సర్వమత ప్రార్థనలో స్థానిక ప్రధానోపాధ్యాయులు టి. నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశం పట్ల దేశభక్తిని దేశ సేవా చేయాలని సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలన్నారు అన్ని మతాలు సమానమని అందరూ అన్ని మాతాలను గౌరవించాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బాక లవకుశ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న పీఎం శ్రీ పాఠశాల స్కౌట్స్ అండ్ గైడ్స్ కోసం ఫిబ్రవరి 25 నుండి మార్చి 1 , వరకు ద్వితీయ సోపాన ట్రైనింగ్ క్యాంప్ నిర్వహించడమైనదన్నారు. ఈ శిబిరంలో 11 మండలాల నుండి 96 మంది స్కౌట్స్, గైడ్స్, స్కౌట్ మాస్టర్స్ మరియు గైడ్ కెప్టెన్లు పాల్గొన్నారని తెలిపారు. జిల్లాలో గల అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలల్లో యూనిట్ కేంద్రాలు తెరవాలని, యూనిట్ లో ఉన్న స్కౌట్ అండ్ గైడ్స్ లకు తప్పనిసరిగా క్యాంప్ నిర్వహించాలన్నారు. ఈ శిక్షణ శిబిరంలో ఎల్ ఓ సి మారుతి హరీష్ కుమార్, పద్మావతి, ధనుంజయ్ , శివప్రసాద్, ఎర్రయ్య, రామ్మోహన్, హర్షవర్ధిని, తదితరులు పాల్గొన్నారు.

## 19న పాడేరు గిరి కైలాస క్షేత్రంలో ఉగాది ఆస్థాన వేడుకలు

### వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

పాడేరు,మార్చ్ 1,ప్రభాతవార్త:

సుప్రసిద్ధ అతి పురాతన శైవ క్షేత్రం, బ్రహ్మసూత్ర శివలింగ స్వరూపిణిగా వెలసిన పాడేరు శ్రీ ఉమా నీలకంఠేశ్వర స్వామి వారు, శ్రీ సక్ర రిస్తాన దేవత శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారు కొలువై ఉన్న పాడేరు గిరి కైలాస క్షేత్రంలో ఉగాది పర్వదినాన దేవాలయంలో ఈ నెల 19వ తేదీన ఉగాది ఆస్థాన వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలం నాయుడు ఆదివారం పేర్కొన్నారు. 19 వ తేదీ గురువారం ఉదయం స్వామివారికి, శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ప్రత్యేక పూజలు, అభిషేకములు,.. దర్శనాలు, సాయంత్రం సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు, సాయంత్రం 6 గంటల నుండి వేద పండితులచే పంచాంగ శ్రవణ కార్యక్రమం ఘనముగా నిర్వహించనున్నామన్నారు. 6-30 నుండి ఉగాది ఆస్థాన వేడుకలు ఆధ్యాత్మిక సేవ పురస్కారాలు.. తదుపరి ఉగాది ఆధ్యాత్మిక సేవా పురస్కారములు.. (సామాజిక ఆధ్యాత్మిక సంస్కృతిక కలలు సహహించ రంగాల్లో కృషి చేసిన వారికి స్వామి వారి ఆశీస్సులతో అందజేయనున్నామన్నారు.స్వామివారి ప్రసాద పంపిణీ, ఉగాది పచ్చడి భక్తులకు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కావునా స్వామివారి భక్తులు,పట్టణ ప్రజలు వ్యాపారులు,ఉద్యోగ ఉపాధ్యాయులు హాజరై ఉగాది.వేడుకను విజయవంతం చేయవలసిందిగా ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలం నాయుడు కోరారు.

## అమ్మవారి ఆలయంలో భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం

పాడేరు, మార్చ్ 1,ప్రభాతవార్త:



పాడేరు గిరిజన ఆరోగ్య దైవం కోరికలు తీర్చే కొంగు బంగారం పాడేరు శ్రీ శ్రీ మోదకొండమ్మ వారి సన్నిధిలో శాసనసభ్యులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఆదేశాల మేరకు ఆదివారం చంద్రు పుట్టు వాస్తవ్యులు మోద అప్పలస్వామి భార్య కాంతమ్మ కుమారుడు మోద గడ్డి నాయుడు మరియు వారి కుటుంబ సభ్యులు ఆర్థిక సహాయంతో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ జడ్పిటిసి రోబ్బ ఉషారాణి, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటి బాబు,ఆలయ కమిటీ సభ్యులు కిల్లు చంద్రమోహన్, కుమార్ నాయుడు, కొణతాల సతీష్, గూడపు సూర్య ప్రకాష్, లకే రత్నబయి, బింగన అమ్మ వారి సహాయకులు కిల్లు వరప్రసాద్, నాయుడు, గుంట ముక్కల వెంకటరమణ, దేవుడు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మెగా ఫాన్స్ పాడేరు అధ్యక్షులు జగన్ జన్మదిన వేడుకలు



పాడేరు, మార్చ్1,ప్రభాతవార్త:

ఎస్ రాజు మెగా ఫ్యాన్స్ స్టేట్ వైడ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఆధ్వర్యంలో డి.జగన్ జన్మదిన వేడుకలు ఆదివారం జిల్లా కేంద్రం పాడేరులో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి సెక్రెటరీ వై మోహన్ వైస్ ప్రెసిడెంట్ సిహెచ్ వెంకట్, జాయింట్ సెక్రెటరీ కె బాబురావు, ఆర్గనైజర్స్ దేవి రెడ్డి శ్రీను, దామోదల కిరణ్, కాళీ ప్రసాద్, లింగేశ్వర రావు,కృష్ణ మహేష్‌బాబు ఫ్యాన్స్ అధ్యక్షులు వియ్యపు అప్పలరాజు, అభిమానులు పాల్గొన్నారు.

## మెగా క్రికెట్ టోర్నమెంట్ విజేతగా చొంపి జట్టు

అరకులోయ, మార్చి 1, ప్రభాతవార్త



అరకులోయ మండలం మారగడ పంచాయతీ లో హోలీ ( ఓల్ పొడ ) ను పురస్కరించుకుని నిర్వహిస్తున్న మెగా క్రికెట్ టోర్నమెంటులో చొంపి గ్రామ క్రికెట్ జట్టు విజేతగా నిలిచింది. మాడగడ ఆదివాసి గిరిజన ఆచార సాంప్రదాయంలో భాగమైన హోలీ (ఓల్ పొడ ) సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ను నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం నిర్వహించిన టోర్నమెంట్ ఫైనల్ పోటీల్లో చొంపి - దొరగుడ జట్లు తలపడగా చొంపి జట్టు విజేతగా నిలిచింది. టోర్నీ విజేతకు మొదటి బహుమతి కింద 20 వేల రూపాయలు, రెండో బహుమతి కింద 10 వేల రూపాయలు ను స్థానిక సర్పంచ్ మండ్యకేడ్డి జ్యోతి అందించనున్నారు. అలాగే హోలీ సందర్భంగా వాలీబాల్ టోర్నమెంట్ ను కూడా గ్రామంలో నిర్వహించనున్నారు. వాలీబాల్ టోర్నమెంట్లు మొదటి బహుమతి 10 వేల రూపాయలు, రెండో బహుమతి 5 వేల రూపాయలు ఇవ్వనున్నట్లు స్థానిక మాడగడ పెసా - ఉపాధ్యక్షుడు బాలరాజు ఈ సందర్భంగా తెలిపారు. గ్రామంలో 3 వ తేదీ మంగళవారం నాడు హోలీ ని నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, అర్జున్, సోమరాజు, కృష్ణ, మత్యరాజు పాల్గొన్నారు.

## ఇత్తడి నాగవరణాన్ని కానుకగా అందజేసిన భక్తులు



పాడేరు,మార్చ్ 1,ప్రభాతవార్త:

సుప్రసిద్ధ పాడేరు గిరి కైలాస క్షేత్రంలో కొలువై ఉన్న శ్రీ ఉమానిలకంటేశ్వర స్వామివారికి ఇత్తడి నాగాభరణాన్ని లగిసి పల్లి పెళ్లి గ్రామకాపరస్తులు లకే ధనలక్ష్మి కుమారుడు లకే గిరీష్ పాత్రుడు మేనమామ గారు ప్రముఖ వైద్యులు డాక్టర్ అడపా రామకృష్ణ నాయుడు స్వామివారికి భక్తి పూర్వకంగా అందజేశారు. వారికి స్వామి వారి శ్రేష్ట వస్త్రాన్ని అందజేసి శివ ఆశీర్వచనాన్ని పండితులు ఇచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల సీతారామ శాస్త్రి, ఆలయ ధర్మకర్త కొట్ట గొల్లి సింహాచలం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఉప్పల వెంకటరత్నం ఆలయ ముఖ్యకారణర్వాహక సభ్యులు ఉపాధ్యక్షులు కొట్టగుల్లి రామారావు, శివరాత్రి శ్రీని వాసు కుమార్, బొడ్డు ముకుందరావు, కీముడు ప్రభాకర్ రావు, సిద్దనాతి కొండలరావు,దేశి ది బాబురావు,కొట్టగుల్లి పోతురాజు పలాసి బాలన్న ,చీపురు వరప్రసాద్, కోనే శివ, యాదగిరి శ్రీనివాసరావు, దాసరి నాగు,దిలీప్ పాల్గొన్నారు.

## అడ్డతీగలలో ఘనంగా మహిళా సాధికారత వారోత్సవాలు

### విద్యార్థినిలు విద్యార్థులతో భారీ ర్యాలీ మరియు మానవహారం నిర్వహించిన పోలీసు శాఖ

అడ్డతీగల, మార్చి 01, ప్రభాతవార్త



మండల కేంద్రంలో మహిళా సాధికారత వారోత్సవాల ను పురస్కరించుకుని పోలీసు శాఖ ఆధ్వర్యంలో భారీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళల భద్రత, రక్షణ పట్ల ప్రజల్లో మరియు యువతలో చైతన్యం తీసుకురావడమే లక్ష్యంగా అడ్డతీగల సర్కిల్ ఇన్స్పెక్టర్ సిఐ బీ. నరసింహమూర్తి, అడ్డతీగల ఎస్సై బి.వినోద్, గంగవరం ఎస్సై వెంకయ్య మరియు వారి సిబ్బంది ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా చేపట్టారు. ఇందులో భాగంగా వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులతో కలిసి స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ నుండి ప్రారంభమై సీతపల్లి సెంటర్ వరకు ఒక భారీ ర్యాలీని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ ర్యాలీ సీతపల్లి సెంటర్ కు చేరుకున్న అనంతరం, విద్యార్థులు మరియు పోలీసు అధికారులు అంతా కలిసి ఒక పెద్ద మానవహారంగా ఏర్పడి మహిళా సాధికారతకు, భద్రతకు మద్దతుగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ, సమాజంలో మహిళల ప్రాముఖ్యతను మరియు వారి హక్కులను వివరించారు. ముఖ్యంగా మహిళల రక్షణ కోసం పోలీసు శాఖ తరపున తీసుకుంటున్న కట్టుదిట్టమైన చర్యల గురించి, మహిళా సంరక్షణ చట్టాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆపద సమయంలో పోలీసులను ఎలా ఆశ్రయించాలి, అందుబాటులో ఉన్న సహాయక నంబర్లు మరియు భద్రతా యాప్స్ ఏ.పి.పి.ఎస్ వినియోగం తదితర అంశాలను సవివరంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తాళ్లపాలెంలో 10 మద్యం బాటిళ్ళతో ఒకరు అరెస్టు

రాజవొమ్మంగి, మార్చి 01, ప్రభాతవార్త



కిర్రాబు పంచాయితీ తాళ్ళపాలెం గ్రామంలో ఆదివారం ఉదయం రాజవొమ్మంగి ఎస్. ఐ. శివకుమార్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని 10 మద్యం బాటిళ్ళతో పట్టుకోవడం జరిగింది. మద్యంతో పట్టుబడిన వ్యక్తి పై కేసు నమోదు చేసామని ఎస్. ఐ. శివకుమార్ వెల్లడించారు.

## పైడిపుట్టలో అల్లూరి రచ్చబండ పునర్నిర్మాణానికి శ్రీకారం



అడ్డతీగల, మార్చి 1, ప్రభాతవార్త

అడ్డతీగల మండలం పైడిపుట్ట గ్రామంలో అల్లూరి సీతారామ రాజు జ్ఞాపకార్థం పలు అభివృద్ధి కార్యక్రమాల కు శ్రీకారం చుట్టినట్లు అల్లూరి శ్రీరామరాజు యువజన సంఘం నాయకులు తెలిపారు. ఆదివారం సంఘం నాయకులు, సభ్యులు గ్రామాన్ని సందర్శించి ముందుగా రామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.స్వాతంత్ర్య పోరాట యోధుడైన అల్లూరి అడుగుజాడలు మిగిలిన ప్రాంతంగా గుర్తింపు పొందిన పైడిపుట్టలో అల్లూరి రచ్చబండ ను పునర్నిర్మించాలనే సంకల్పంతో సంఘం నడుం బిగించింది. రచ్చబండ వరకు రహదారి నిర్మాణం, ప్రధాన ముఖద్వారం ఏర్పాటు, అనంతరం శ్రీరామరాజు విగ్రహ ప్రతిష్ట వంటి కార్యక్రమాలను దశలవారీగా చేపట్టనున్నట్లు సభ్యులు వెల్లడించారు. అంతేకాక రచ్చబండ పరిసర ప్రాంతాన్ని సుందరీకరించి ఉద్యానవనంగా అభివృద్ధి చేయాలని గ్రామస్థులతో కలిసి తీర్మానం చేసినట్లు తెలిపారు. చారిత్రక వారసత్వాన్ని సంరక్షిస్తూ, యువతలో దేశభక్తి భావాలను పెంపొందించేలా ఈ కార్యక్రమాలు దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షులు మంతెన వెంకట సత్యనారాయణ రాజు, వైస్ ప్రెసిడెంట్ వేటుకూరి కృష్ణంరాజు, జనరల్ సెక్రటరీ ఇళ్ల శ్రీకాంత్, జాయింట్ సెక్రటరీ హరి దీపక్, సాగా విజయరామరాజు, కొమ్మనా శ్రీనివాస్, దంగేటి సత్తిబాబు, స్టార్ శ్రీను, పార్వతి, రాధమ్మ తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రైవేట్ ఎలక్ట్రికల్ అసోసియేషన్ అధ్యక్షులుగా కొమ్ము సురేష్ బాబు

పాడేరు,మార్చ్1,ప్రభాతవార్త:



అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రైవేట్ ఎలక్ట్రికల్ అసోసియేషన్ నెలవారి సమావేశం లో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా గౌరవ అధ్యక్షులు కొట్టగుల్లి రామారావు ఆధ్వర్యంలో పాడేరు డివిజన్ సంబంధించి నూతన అధ్యక్షులుగా కొమ్ము సురేష్ బాబు, ఉపాధ్యక్షులుగా బేరా శ్రీనివాసరావు, కార్యదర్శిగా సింగారపు వినోద్ కుమార్,ఉప కార్యదర్శిగా పీలా రవితేజ, ప్రధాన కోశాధికారిగా మట్టం స్వామి నాయుడు, ఉప కోశాధికారి సర్మండ వరప్రసాద్ నూతనంగా ఎన్నుకోవడం జరిగింది.ఈ యొక్క నెలవారీ సమావేశంలో పాల్గొన్న జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి దామోదర్,పొట్నూరి బబ్లు,జి. శివశంకర్, పాంగి వెంకటరమణ మూర్తి,బాలరాజు, సతీష్, చంటిబాబు, వెంకటరావు, రమేష్, గౌరీ కుమార్, యశోద,మనోజ్, మధు, కార్తీక్,అధిక సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన అంతరిక్ష అవగాహన వారోత్సవాలు

### జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం:గ్రహాలను వీక్షించిన 600 మంది విద్యార్థులు



పాడేరు,మార్చి1,ప్రభాతవార్త

జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా 'సైన్స్ ఫర్ బెటర్ సొసైటీ' మరియు 'ఆశాజ్యోతి' సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అంతరిక్ష అవగాహన వారోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈ ముగింపు వేడుకలకు అల్లూరి సీతారామరాజు జిల్లా సైన్స్ అధికారి కే.జే. రామారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కే.జే.రామారావు మాట్లాడుతూ, విద్యార్థులు చిన్నతనం నుండే శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. సమాజంలో ప్రతి అంశాన్ని శాస్త్రీయంగా ఆలోచించి, "ప్రశ్నించే తత్వాన్ని" అలవరుచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఇలాంటి స్పేస్ సైన్స్ కార్యక్రమాలను జిల్లాలోని మరిన్ని పాఠశాలలకు విస్తరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. సైన్స్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు సిహెచ్. జగదీశ్ విద్యార్థులకు టెలిస్కోపుల పనితీరును వివరిస్తూ, అంతరిక్ష విజ్ఞానంపై లోతైన అవగాహన కల్పించారు. విద్యార్థులు అడిగిన పలు ఆసక్తికరమైన ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చి వారి సందేహాలను నివృత్తి చేశారు. లోచలిపుట్టు, ఏపీ రెసిడెన్షియల్, శ్రీక్రిష్ణాపురం పాఠశాలలకు చెందిన సుమారు 600 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. టెలిస్కోపుల ద్వారా అంతరిక్షంలోని గ్రహాలను, నక్షత్రాలను వీక్షించి విద్యార్థులు మంత్రముగ్ధు లయ్యారు. ఈ కార్యక్రమం తమలో సైన్స్ పట్ల కొత్త జిజ్ఞాసను రేకెత్తించిందని విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

## జడ్డంగి మల్లిఖార్జునస్వామిని దర్శించుకొన్న ఇంద్రకీలాద్రి ప్రధాన అర్చకులు

రాజవొమ్మంగి, మార్చి 01, ప్రభాత వార్త



జడ్డంగి శ్రీశ్రీశ్రీ భ్రమరాంభికా మల్లిఖార్జునస్వామి ఆలయాన్ని ఆదివారం విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకులు మురళీధరశాస్త్రి దర్శించుకొన్నారు. ఆలయ చరిత్ర, విశిష్టతను సిద్ధాంతి కాళ్ళకూరి రామాంజనేయులు (రాంబాబు ) ఆయనకు తెలియజేసారు. పురాతన. చరిత్రగల ఈ ఆలయం చుట్టూ ఉన్న జలపాతాల ప్రాంతాలు, జల్లుఘట్టం, ఆలయ ప్రాంగణమంతా చూసారు. మండపాన్ని చేరి ఉన్న ప్రధాన ఆలయ విగ్రహాలు పైభాగంలో ఎవరూ నడవకుండా చూడాలని సూచించారు. ఈ శైవక్షేత్రం చూడటం అదృష్టమని అయన అన్నారు. అనంతరం జడ్డంగి గ్రామం తరుపున సర్పంచ్ కొంగర మురళీకృష్ణ పండితులు మురళీధరశాస్త్రిని పూలమాలలు వేసి శాలువాను కప్పి సత్కరించారు. దుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో పూజలను చేసిన పెన్నులు, అమ్మవారి కుంకుమ ను విద్యార్థినీ, విద్యార్థులకు అందజేశారు.ఈకార్యక్రమంలో కొంగర మురళీకృష్ణ, అడపా కామేశ్వరరావు, ఆద్య రమేష్, పోకల పూర్ణ ప్రసాద్, కొంగర నాగు పాల్గొన్నారు. ఇదే రోజున పోలవరం జిల్లా దేవీపట్నం మండలం గండి పోశమ్మ తల్లి ఆలయ ఇ. ఓ గండి లక్ష్మీ కుమార్, జూనియర్ అసిస్టెంట్ కొంగర వెంకటేశ్వరరావు కూడా శివాలయాన్ని దర్శించు కొని పూజలను చేసారు.

## అంగన్వాడీలకు అండగా కూటమి ప్రభుత్వం.. ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

రాజవొమ్మంగి, మార్చి 01, ప్రభాతవార్త



ఎన్నికల్లో అంగన్వాడీలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడానికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని రంపచోడవరం ఎమ్మెల్యే రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి అన్నారు. ఈ విషయంపై ఆదివారం ఆమె ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్వాడీ కేంద్రాల మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల్లో తాగునీటి సౌకర్యాలు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.86.68 లక్షలు విడుదల చేసి, ఒక్కో కేంద్రానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. అంగన్వాడీలకు ప్రతి నెల ఒకటో తేదీనే వేతనాలు, 58,204 మంది అంగన్వాడీ వర్కర్లు, సూపర్వైజర్లు, బ్లాక్ కోఆర్డినేటర్లకు రూ.75 కోట్ల వ్యయంతో 5జి స్మార్ట్ ఫోన్లు అందించినట్లు పేర్కొన్నారు. ఏళ్ల తరబడి అంగన్వాడీలు ఎదురుచూసిన గ్రాట్యుటీ చెల్లింపుల కోసం 2025 ఆంధ్రప్రదేశ్ బడ్జెట్లోనే రూ.20 కోట్లు కేటాయించినట్లు అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే అంగన్వాడీలకు అండగా నిలిచిందన్నారు. అంగన్వాడీ సెంటర్ కు టి. వి., , ఆర్వోలు,టాయిలెట్ సౌకర్యం, టీచర్లు, ఆయాలకు వేసవిలో 15 రోజులు సెలవులు, ఆటవస్తువులు, పాఠాలు చెప్పడానికి వీలుగా చార్టులు," ఇండక్షన్ స్టవ్, నాణ్యమైన వంట పాత్రలు ఇచ్చామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 5,000 మినీ అంగన్వాడీ కేంద్రాలను పూర్తి స్థాయి అంగన్వాడీ కేంద్రాలుగా అప్గ్రేడ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా మినీ అంగన్వాడీ కార్యకర్తలకు టీచర్ల కు పదోన్నతి కల్పించి, పూర్తి స్థాయి వేతనాలు అందించనుంది. అలాగే కొత్తగా 5,000 మంది అంగన్వాడీ సహాయకులను నియమించనుంది. అంగన్వాడీలు ప్రతిపాదించిన డిమాండ్లలో 9 డిమాండ్లను ఇప్పటికే కూటమి ప్రభుత్వం పరిష్కరించిందన్నారు. వేతనాల పెంపు అంశాన్ని కూడా వీలైనంత వరకు అమలు చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

## సొసైటీ ఆపరేటర్‌కు శ్రీమంతం

రాజవొమ్మంగి, మార్చి 01, ప్రభాత వార్త



రాజవొమ్మంగి వ్యవసాయ సహకార పరపతి సంఘం లో కంప్యూటర్ ఆపరేటర్ గా పనిచేయుచున్న సింగిరెడ్డి భవానీకి సొసైటీ ఆఫీసులో ఆదివారం శ్రీమంత కార్యక్రమం చేయడం జరిగింది. పసుపు, కుంకుమ, గాజులు, పండ్లు, నూతన వస్త్రాలు ఇచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ముప్పన కేశవ్, ఏ. యం. సి చైర్మన్ లోతా లక్ష్మణరావు, సీఈఓ గోపాలకృష్ణ, సహాయ కార్యదర్శి అప్పారావు, శ్రీను, ప్రసాద్, వరద సత్తిబాబు పాల్గొన్నారు

## పాడేరులో అంతర్జాతీయ మహిళా దినోత్సవంర్యాలీ

పాడేరు,మార్చి1,ప్రభాతవార్త:



అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పాడేరు పోలీస్ వారు సమాజంలో మహిళల పాత్ర మరియు వారి భద్రత గురించి పోలీసు వారు తీసుకునే చర్యల గురించి తెలియజేస్తూ ఈ కార్యక్రమంలో భాగంగా సెయింట్ ఆన్స్ స్కూల్ నుండి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీని నిర్వహించారు.




## అంతర్జాతీయ మహిళా సాధికారిత ర్యాలీ.. మానవహారం




రాజవొమ్మంగి, మార్చి 01, ప్రభాతవార్త

జడ్డంగి గ్రామంలో ఆదివారం ఎస్. ఐ. చిన బాబు ఆధ్వర్యంలో మహిళా సాధికారిత ర్యాలీ, మానవహారాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్.ఐ చినబాబు మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవంను ప్రతీ ఏడాది మార్చి 8 తేదీన నిర్వహించడం జరుగుతుందన్నారు. మహిళల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ సాధనలను గౌరవించే రోజు అని అన్నారు. మహిళల హక్కులు, భద్రత, సమానత్వం మరియు సాధికారతపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు. మహిళలపై జరిగే నేరాల నివారణ, సైబర్ మోసాలపై జాగ్రత్తలు, విద్య, స్వయం ఉపాధి అవకాశాల ప్రాముఖ్యత గురించి వివరించారు. మహిళలు తమ హక్కులను తెలుసుకొని, ధైర్యంగా ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. ఎస్. ఐ చినబాబు, హెడ్ కానిస్టేబుల్ శాస్త్రి, హోం గార్డు పడాల్, ఏ. పి. ఎస్. పి.సిబ్బంది, మహిళలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## నా జీతంతోనే బస్సు షెల్టర్.. మరుగుదొడ్లు ఏర్పాటు

### ఎమ్మెల్యే ,రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి

రాజవొమ్మంగి, మార్చి 01, ప్రభాతవార్త



రాజవొమ్మంగి మండలం కేంద్రంలో బస్సు షెల్టర్ ప్రాంగణంలో ప్రయాణీకుల ఇక్కట్లు చూసి నాజీతం సొమ్ములతో బస్సు షెల్టర్, మరుగు దొడ్లను నిర్మించడం జరుగుతుందని రంప చోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణ పనులు పర్యవేక్షించారు. పూర్తి నాణ్యతతో చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏ. యం. సి చైర్మన్ లోతా లక్ష్మణరావు, సొసైటీ చైర్మన్ ముప్పన కేశవ్ , ఏ. యం. సి డైరెక్టర్ గట్టి మాణిక్యం, తెదేపా సీనియర్ నాయకులు గణజాల తాతారావ్, మండల పార్టీ కార్యదర్శి వాసంశెట్టి గంగాధరరావు, కె.వీరబాబు ,చెక్క పండు, మాజీ సర్పంచ్ కోపూరి రత్నం, సాగిన చిన్నమ్ములు, మాజీ జడ్పీటీసీ కోసూరి బుచ్చి చిన్నాలమ్మ , బీసీ విభాగం నాయకులు మాకిరెడ్డి లోవరాజు, ముర్ల వీరబాబు, నమ్మి అప్పారావు, సి. హెచ్.కాసులమ్మ అధిక సంఖ్యలో కూటమి పార్టీ నేతలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 10వ తరగతి విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మోడల్ టాలెంట్ పరీక్ష



అరకులోయ, మార్చి 1, ప్రభాతవార్త

అరకులోయ మండలం పరిధిలో పలు పాఠశాలల విద్యార్దిని, విద్యార్థులకు ఆదివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 10 వ తరగతి మోడల్ టాలెంట్ పరీక్ష జరిగింది. అరకులోయ లోని సి ఏ హే చ్. స్కూల్, పివిటిజీ, ఏపీఆర్ స్కూల్, బాలికల ఆశ్రమ పాఠశాల కంట బౌసు గూడ, రవ్వలగుడ బాలుర ఆశ్రమ పాఠశాల లోని పలువురు విద్యార్దిని విద్యార్థులు ఎస్ఎఫ్ఐ నిర్వహిస్తున్న మోడల్ టాలెంట్ పరీక్షలో పాల్గొన్నారని ఎస్ఎఫ్ఐ మండల కమిటీ కార్యదర్శి టీ ప్రేమ్ సాగర్ ఈ సందర్భంగా తెలియజేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా టాలెంట్ పరీక్షలు నిర్వహిస్తున్నారని, ఆసక్తి కలిగిన విద్యార్దిని, విద్యార్థులు టాలెంట్ పరీక్షలో పాల్గొంటున్నట్లు చెప్పారు. విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టడానికి ఎస్ఎఫ్ఐ అన్ని ప్రాంతాల్లో మండల పరిధిలో టాలెంట్ పరీక్ష లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా అరకులోయ మండలంలో టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరిగిందన్నారు జరిగిందన్నారు. పదో తరగతిలో మంచి మార్కులుతో ఉత్తీర్ణులవ్వాలని, పాఠశాలలు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్న ఉద్దేశంతో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ అభినందనలు తెలియజేసింది. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు చందు, ఉపాధ్యక్షులు ఎస్ ఐసు బాబు , మండల కమిటీ సభ్యు లు ,రమాదేవి ,రిషి విద్యార్దిని విద్యార్థులు పాల్గొన్నారు.

## సైన్స్ ప్రయోగాల్లో గిరిజన విద్యార్థినుల ప్రతిభ అద్భుతం..

రాజవొమ్మంగి, మార్చి 01, ప్రభాతవార్త



గిరిజన విద్యార్థినులు సైన్స్ ప్రయోగాల్లో వారి ప్రతిభ అద్భుతమని రాజవొమ్మంగి మండల విద్యాధికారి కె. వి. వి. సత్యనారాయణదొర అన్నారు. సింగంపల్లి గిరిజన సంక్షేమ బాలికొన్నత పాఠశాలలో హెచ్. యం. సుబ్రమన్యేశ్వరి అధ్యక్షతన శనివారం జాతీయ సైన్స్ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన విద్యార్థినుల సైన్స్ ప్రయోగాలను యం. ఇ. ఓ లు అభినందించారు. మానవ జీవితమంతా సైన్స్ తో ముడిపడి ఉందని యం. ఇ. ఓ సత్యనారాయణ దొర విద్యార్థినులకు వివరించారు. ఇరువురు యం. ఇ. ఓ లు, ఇద్దరు సిఆర్పీలను ఉపాధ్యాయులు శాలువాలను కప్పి పూలమాలలను వేసి సన్మానించారు. ఈకార్యక్రమంలో హెచ్. యం. సుబ్రమన్యేశ్వరి, విద్యాకమిటీ చైర్మన్ రామలక్ష్మి, సి. ఆర్. పి. లు సతీష్, విష్ణువర్ధన్, వి. లక్ష్మీబాయి, కె. ఆర్.శాంతిపాప, యం.సత్యవతి , విక్టోరియారాణి, డి .స్రవంతి, ఫ్లొరెన్సమణి , కె. వరలక్ష్మి, కె.శాంతి , కె భవాని, ఏ.లక్ష్మి , కె.వీరలక్ష్మీ , వీరబాబు , సీతాలక్ష్మి ,భీమిరెడ్డి, గౌతమిదేవి, అటెండర్ లక్ష్మీ, విద్యార్థినులు పాల్గొన్నారు.

## నూకాలమ్మ తల్లి జాతర కు ఏర్పాట్లు



రాజవొమ్మంగి, మార్చి 01, ప్రభాత వార్త

రాజవొమ్మంగి ప్రసిద్ధి చెందిన శ్రీ శ్రీ శ్రీ నూకాలమ్మ తల్లి దేవాలయం జాతరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు రాజవొమ్మంగి గ్రామ సర్పంచ్ గొల్లపూడి రమణి తెలిపారు. ప్రతి సంవత్సరం నిర్వహించే జాతరకు వేలాది మంది భక్తులు సుదూర ప్రాంతాలు నుండి వచ్చి పూజలను చేసి మొక్కులను తీర్చుకొంటారు. ప్రత్యేక పూజలు, గరగల ఊరేగింపులు, అమ్మవారికి అర్చనలు, అన్నసమారాధన కార్యక్రమాలు జరుగుతాయి. సాంస్కృతిక కార్యక్రమాలు కూడా జరుగుతాయి. ఆదివారం రాత్రి నుంచి గరగలతో ప్రారంభమయ్యాయి. ఆలయానికి వచ్చే భక్తులకు ఏ విధమైన అసౌకర్యం కలుగకుండా కమిటీ ఏర్పాట్లు చేస్తున్నారని సర్పంచ్ గొల్లపూడి రమణి అన్నారు. గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సమిష్టి సహకారంతో నూకాలమ్మ తల్లి జాతరను విజయవంతం చేయాలని ఏ. పి. ఐ. ఐ. సి డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు కోరుతున్నారు.

## పోలీసుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ ర్యాలీ

అరకు రూరల్, మార్చి 1: ప్రభాత వార్త:-




ఈనెల 8వ తేదీ న జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం అరకులోయలో పోలీసుల ఆధ్వర్యం లో ర్యాలీ కార్యక్రమం జరిగింది. పాడేరు డిఎస్పి అభిషేక్ నేతత్వంలో జరిగిన ర్యాలీ స్థానిక పోలీస్ స్టేషన్ నుండి ఆర్టిసి కాంప్లెక్స్ నాలుగు రోడ్ జంక్షన్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా డి ఎస్ పి అభిషేక్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోని ముందున్నారని, మహిళలు చదువుకుంటే వారికే కాకుండా వారి పిల్లలకు, కుటుంబానికి, బావితరానికి ఆదర్శంగా ఉంటారన్నారు. కాగా ఇల్లాలి చదువు ఇంటికి వెలుగని , స్త్రీ శక్తి భారత్ భవిష్యత్తు అనే నినాదంతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ గోపాల్ రావు, పోలీస్ సిబ్బంది, స్థానిక కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పనకు తొలి ప్రాధాన్యత



కోటబొమ్మాళి, మార్చి 1 ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు ప్రజల నుంచి అధిక సంఖ్యలో వినతులు వచ్చాయి. నియోజకవర్గంలో టెక్కలి, నందిగాం మండలాల నుంచి ప్రజల నుంచి వచ్చిన వినతులు పరిశీలించి సంబంధిత అధికారులతో చరవాణిలో మాట్లాడి త్వరిగతిన ప్రజలకు మేలు చేసే విధంగా సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విధులలో అలసత్వం లేకుండా అధికారులు పని చేయాలని సూచించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన, మెరుగుదలే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో మెరుగైన రీతిలో మౌలిక వసతుల కల్పనకు కట్టుబడి ఉన్నామని అన్నారు. సాగు, తాగు నీరు అందించేందుకు అవజరమైన చర్యలు తీసుకుంటామని ప్రజలకు వివరించారు. ప్రధానంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని వినతులు వచ్చాయి. నూతన ఫించన్లు మంజూరు చేయాలని, నూతన గృహాలు మంజూరు చేయాలని ప్రజల నుంచి పెద్దఎత్తున వినతులు అందాయి. ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రణాళిక తయారు చేస్తున్నట్లు వివరించారు. ఫించన్లు విషయంలో అర్హత ఉన్న వారికి నూతన ఫించన్ మంజూరు చేయడం జరుగుతుందని, అనర్హుల పించన్లు తొలగించి అర్హులకు మంజూరు చేయడం జరుగతుందని అన్నారు. నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు. వినతులు ఇచ్చేందుకు ముందుగా నిర్దేశించిన మండల నాయకులు ప్రజలు వినతులు అందజేయాలని సూచించారు.

### గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి: మంత్రి ఆదేశం

గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని పంచాయతీరాజ్ మరియు రహదారులు భవనాల శాఖ అధికారులకు మంత్రి ఆదేశించారు. అన్ని గ్రామాల్లో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థలు, ఇంటింటి తాగునీరు పథకం అమలులో ఎక్కడా ఆలస్యం జరగకుండా చూడాలని సూచించారు.నిర్దేశించిన గడువు కంటే ముందుగానే పనులు పూర్తి చేయాలని, ముఖ్యంగా నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆయన స్పష్టం చేశారు. ప్రమాణాలు పాటించకపోతే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. అభివృద్ధి పనుల్లో పారదర్శకత, సమయపాలనతో పాటు ప్రజలకు ఉపయోగకరంగా ఉండే విధంగా అధికారులు పనిచేయాలని మంత్రి తెలిపారు. టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, అధికారులు సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రులను ప్రాణదాతలుగా మార్చిన విద్యార్థులు!

### న్యూ సెంట్రల్ స్కూల్ రక్తదాన శిబిరానికి అపూర్వ స్పందన..ఒకే రోజు 215 యూనిట్ల రక్తం సేకరణ



శ్రీకాకుళం, మార్చి 1 ప్రభాతవార్త: పుస్తకాల్లో చదువుకున్న సామాజిక బాధ్యతను ఆ విద్యార్థులు ఆచరణలో చూపారు. తమ తల్లిదండ్రులను ఒప్పించి, మెప్పించి రక్తదాన శిబిరానికి తీసుకువచ్చి ప్రాణదాతలుగా నిలబెట్టారు. స్థానిక పి.ఎన్. కాలనీలోని న్యూ సెంట్రల్ స్కూల్, రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం విశేష స్పందనతో విజయవంతమైంది. పాఠశాల ఆవరణలో ఉదయం నుంచి సాయంత్రం వరకు సాగిన ఈ సామాజిక యజ్ఞంలో మొత్తం 215 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో పాఠశాల జూనియర్ రెడ్ క్రాస్ విద్యార్థులు కీలక పాత్ర పోషించారు. "మా నాన్న ఒక సూపర్ హీరో" అనే నినాదంతో విద్యార్థులు తమ తల్లిదండ్రులను, బంధువులను, శ్రేయోభిలాషులను రక్తదానం వైపు మళ్లించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. సుమారు 250 మందికి పైగా రక్తదాతలు తరలిరాగా, ప్రాథమిక ఆరోగ్య పరీక్షల అనంతరం 215 మంది రక్తాన్ని అందజేశారు. రక్తదాతలందరికీ రెడ్ క్రాస్ సంస్థ మరియు పాఠశాల యాజమాన్యం తరపున అభినందన పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ పి.శ్రీకాంత్ మాట్లాడుతూ జూనియర్ రెడ్ క్రాస్ విద్యార్థులు అద్భుతం సృష్టించారని కొనియాడారు. గత ఎనిమిదేళ్లుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, సేకరించిన రక్తాన్ని తలసీమియా, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న చిన్నారులకు ఉచితంగా అందజేస్తామని పేర్కొన్నారు. విద్యార్థుల్లో సేవాభావాన్ని పెంపొందించడమే తమ ప్రధాన ఉద్దేశమని ఆయన తెలిపారు. రెడ్ క్రాస్ జిల్లా ఛైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా, సమాజం పట్ల బాధ్యతను విద్యార్థులకు నేర్పించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానాచార్యులు, విశ్రాంత విద్యాశాఖాధికారి బలివాడ మల్లేశ్వరరావు, డైరెక్టర్లు పి.రమాకుమారి, పి.శ్రీదేవి, పి.వి.ఆర్.ఎం. పట్నాయక్, కె.సోమసుందర్రావు పాల్గొన్నారు. అలాగే రెడ్ క్రాస్ ప్రతినిధులు కొనుగల దుర్గ, శ్రీనివాసరావు, పి.వైకుంఠరావు, నిక్కు అప్పన్న, ఎం.కళ్యాణ్ చక్రవర్తి, కె.సత్యనారాయణ, పి.చైతన్య కుమార్, జి.రమణ, బి.సతీష్ కుమార్, సామాజిక కార్యకర్త ఉర్లం శివతేజ, పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ 20 ప్రత్యేక టీమ్స్‌తో పర్యవేక్షణ

### శానిటేషన్ సిబ్బంది ఉదయం 5:30 నుంచే విధుల్లో ఉండాలని ఆదేశం



శ్రీకాకుళం, మార్చి 1 ప్రభాతవార్త: నగరంలో పారిశుధ్య నిర్వహణ తీరును స్వయంగా జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక మేధర వీధి, మార్కెట్ ఏరియా, ఇప్పిలి వీధి, చిన్న బజార్, పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. డయేరియాను పూర్తిగా అరికట్టేందుకు 20 ప్రత్యేక టీమ్స్‌తో పర్యవేక్షణ జరుగుతుందని అందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సందర్భంలో డయేరియాను పూర్తిగా అరికట్టేందుకు ప్రభుత్వం అన్ని చర్యలను తీసుకుంటుండగా కొంతమంది వ్యాపారులు చికెన్ షాపులను తెరవడంపై కలెక్టర్ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. మార్కెట్లో పర్యవేక్షిస్తూ వివిధ వ్యాపారులు తమ వ్యాపారాలు చేయు స్థలాల్లో వేస్టేజ్‌గా పడి ఉన్న వ్యర్థాలను ఎందుకు తొలగించలేదని వర్తకులను ప్రశ్నిస్తూ కొన్ని షాపులను మూయించి వేశారు. ఇకపై ఈ విధంగా జరిగినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సచివాలయ సిబ్బందికి మరియు ప్రజలకి మధ్య సమన్వయం ఉండాలనీ, వ్యర్థాలను సేకరించుటకు వచ్చిన పారిశుద్ధ్య కార్మికులకు సహకరించాలని వర్తకులను మరియు ప్రజలను కోరారు.



పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లు ఉండకూడదని, యుద్ధ ప్రాతిపదికన పూడికతీత, వ్యర్థాల తొలగింపు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్య కార్మికులకు కేటాయించిన ట్రాక్టర్ మరియు జేసీబీ యంత్రాల సహాయంతో నగరంలో ఎక్కడ కూడా చెత్త కనిపించకుండా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆవులు తిరిగే ప్రదేశంలో పేడ కనిపించడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరుకుగా ఉన్న రోడ్లలో చిరు వ్యాపారులు డ్రైనేజీ కాలువకు దగ్గరలో వ్యాపారాలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. డయేరియా వ్యాప్తి చెందడానికి ఒక్క త్రాగునీరే కారణం కాదని ఆహార వ్యవహారాలు మరియు అపరిశుభ్రతే ప్రధాన కారణమని తెలిపారు. నగరంలో డయేరియా బాధితుల సంఖ్య నిలకడగా ఉందని, భయపడాల్సిన పని లేదని కలెక్టర్ తెలిపారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, మునిసిపల్ శాఖ అధికారులు, సిబ్బంది మరియు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రికి వెళ్ళి పించను అందజేత



కోటబొమ్మాళి, మార్చి 1 (ప్రభాతవార్త): మండలం నారాయణవలస గ్రామానికి చెందిన బోగాది అప్పల నరసమ్మ గత ఐదు రోజులుగా శ్రీకాకుళంలోని రిమ్స్ అసుపత్రిలో ఊపిరితిత్తుల వ్యాధి బారిన పడి చికిత్స పొందుతుంది. గమనించిన ఆ గ్రామ జూనియర్ అసిస్టెంట్ రామక్రిష్ణ అసుపత్రికి వెళ్లి అమెకు పింఛను అందజేశారని ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్ ఆదివారం తెలిపారు.

## జల జీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన చేసిన భానోజీనాయుడు



రణస్థలం, మార్చి 1 ప్రభాతవార్త : మండలంలోని రణస్థలం పంచాయతీ పరిధిలో గల చిన్న లంకపేట గ్రామంలో ఆదివారం జల జీవన్ మిషన్ పనులకు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు, రణస్థలం సర్పంచ్ పిన్నింటి వెంకట భానోజీనాయుడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల జీవన్ మిషన్ ద్వారా అందిస్తున్న తాగునీరు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుదన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కృషి చేస్తుండడంపై ఆయన వారికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్తుల దాహార్తిని తీర్చడంతో పాటు గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న సర్పంచ్ భానోజీనాయుడును గ్రామస్థులు అభినందించారు. ఎంపీటీసీ ప్రతినిధి మజ్జి వెంకటరమణ, ప్రదీప్, శంకర్, కూటమి నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లు రోడ్డు నియమాలు పాటించాలి



వీరఘట్టం, మార్చి 1 ప్రభాతవార్త ఆటో డ్రైవర్లు ఖచ్చితంగా రోడ్డు నియమాలు పాటించాలని, లేదంటే కఠిన చర్యలు తప్పవని ఎస్సై షణ్ముఖరావు హెచ్చరించారు. ఆదివారం మన గ్రోమోర్ సెంటర్‌లో వాహనాలను తనిఖీ చేసిన సందర్భంగా మాట్లాడారు. వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు తమ వద్ద ఉంచుకోవాలని, అలాగే పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించరాదని, అతి వేగంతో వాహనాలను నడపకూడదని, యూనిఫామ్ తప్పనిసరిగా ధరించాలని ఆయన ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. అలాగే వాహనాలకు సంబంధించి ఇటీవల పెండింగ్ చలానాలు ఉంటే తక్షణమే చెల్లించాలని ఆయన సూచించారు.

## బొగాబెణి డీలర్‌పై చర్యలేవి?

### మండల సమావేశంలో రెవెన్యూ అధికారులను ప్రశ్నించిన సర్పంచ్




కంచిలి, మార్చి 1 ప్రభాతవార్త బొగాబెణి డీలర్‌పై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన చర్యలు లేవని సర్పంచ్ గణప సింహాచలం ప్రశ్నించారు. ఎంపీపీ పైల దేవదాసురెడ్డి అధ్యక్షతన, ప్రత్యేక అధికారి కే.అప్పలస్వామి ఆధ్వర్యంలో జరిగిన సర్వసభ్య మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సింహాచలం రెవిన్యూ అధికారి కూర్మారావును ప్రశ్నిస్తూ గతంలో జరిగిన మండల సమావేశంలో భోగాబేని డీలరు రేషన్ సరుకులు లబ్ధిదారులకు సక్రమంగా అందించడం లేదని బియ్యముకు బదులు లబ్దిదారులకు 20 రూపాయలు చొప్పున నగదు చేస్తుందని దీనిపై ఫిర్యాదు చేసిన అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో ఆశ్చర్యంగా ఉందని అన్నారు. అలాగే కొన్ని పంచాయతీల్లో హౌసింగ్ బిల్లులు ఇంకా అందలేదని హౌసింగ్ ఏఈను ప్రశ్నించడం జరిగింది. ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి భావోద్వేగంతో మాట్లాడుతూ సర్పంచులకు ఇది చివరి సమావేశం అని ఐదు సంవత్సరాలలో పార్టీలు కచ్చితంగా అందరూ కలుసుకొని పోయామని సర్పంచులు పదవి కాలం ముగుస్తుండటం ఎంతో బాధ కలిగిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వి.తిరుమలరావు, పి ఓ సత్యవతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎరువులు అందలేదని నిలదీసిన సర్పంచ్‌లు




జలుమూరు, మార్చి 1 ప్రభాతవార్త: స్థానిక మండల పరిషత్‌లో మండల సర్వసభ్య సమావేశం ఆదివారం మండలాధ్యక్షులు వాన గోపి అధ్యక్షతన జరిగినట్టు ఎంపీడీవో బంట్రోతు చిన్నమ్మడు పేర్కొన్నారు. వ్యవసాయ శాఖపై ఏవో రవికుమార్, గుగ్గిలి సర్పంచ్ ప్రతినిధి కూర్మారావు మా సచివాలయ పరిధికి మీరు సక్రమంగా ఎరువులు ఎందుకు అందజేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దానికి అతను దగ్గర సమాధానం లేకపోగా వెనుతిరిగి కూర్చునిపోయాడు. అదేవిధంగా శ్రీముఖలింగం ఎంపీటీసీ కరుకోలా హరి ప్రసాదరావు ఈ ఎరువులు సమస్యపై మాట్లాడారు. వంశధారకి సంబంధించి బసవలస సర్పంచ్ గుద్దల శ్రీనివాసరావు మా రబీ పంటకు మీరు అందకపోవడం వల్ల 20 నుండి 25 ఎకరాలు ఎండిపోతుందని కాలువలు ద్వారా నీరు అందించాలని వేడుకొన్నారు. ఆ శాఖకు సంబంధించిన అధికారులు లేకపోవడంతో సమాధానం ఇవ్వలేకపోయారు. ఆర్డబ్ల్యూ జె ఈ కు సంబంధించి పెద్దదు గ్రామ సర్పంచ్ ప్రతినిధి భాస్కరరావు మాట్లాడుతూ తమ గ్రామానికి ఇంటింటి కొళాయి 95 అయిపోయిందని, వాల్స్ వేసి, వాటర్ విడుదల చేస్తే మాకు సమస్య తీరిపోతుందని తెలిపారు. ఇంటింటి కొళాయిలు వేయడం వల్ల రోడ్లు పోయాయి. రోడ్లు వేయించాలని తెలిపారు. ఆ శాఖకు సంబంధించిన జేఈ ఇన్‌చార్జ్‌గా పని చేయడం వల్ల రాలేకపోయారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రతినిధి మెండ రాంబాబు, డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ కింజరాపు సత్యనారాయణ, పిఎసిఎస్ అధ్యక్షులు వెలమల చంద్రభూషణరావు, దుంగ స్వామి బాబు,ఏవో రఘు, వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు, ఎంపీటీసీ భారతి, సర్పంచులు పంచరెడ్డి రామచంద్రావు, పీస పద్మావతి, సర్పంచ్ ప్రతినిధి బగ్గు గోవిందరావు, వైద్యాధికారులు గొలివి సుజాత, పొన్నాన గురునాధరావు, ప్రసన్నలక్ష్మి, మండల ఇంజనీరు శ్రీధర్, ఎలక్ట్రికల్ ఏఈ ఎం సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ చేసిన ధోనుభాయి ఎస్సైకి ఘన సన్మానం



సీతంపేట, మార్చి 1 ప్రభాతవార్త సీతంపేట మండలం ధోను భాయి ఎస్సైగా విధులు నిర్వహించి ఆదివారం పదవీ విరమణ చేసిన ఎస్సై షేక్ మస్తాన్‌కి పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి ఘనంగా దుశ్శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శేష జీవితం మంచి ఆరోగ్యంతో ఆనందంగా గడపండి, మీ సేవలు చిరస్మరణీయం అన్నారు. ఉద్యోగ విరమణ అనేది వృత్తికే గాని శరీరానికి కాదు అన్నారు. పోలీస్ శాఖలో 36 సంవత్సరాల సుదీర్ఘకాలం పాటు ఉత్తమ సేవలు అందించి ఎన్నో సమస్యలను ఎదురొడ్డి, కష్ట నష్టాలు ఓర్చి ఆరోగ్యంగా, ఆనందంగా పదవీ విరమణ చెందటం అదృష్టమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, ఏఆర్ డిఎస్పీ థామస్ రెడ్డి, పాలకొండ డీఎస్పీ రాంబాబు. ఎస్బీ సిఐ రమణమూర్తి, సోషల్ మీడియా సిఐ శ్రీనివాసరావు, ఏఆర్ ఆర్ఐలు నాయుడు, రాంబాబు, పాలకొండ సబ్ డివిజన్ పరిధిలో ఉన్న అన్ని మండలాలకు చెందిన ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటండి

### ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన



ఆమదాలవలస, మార్చి 1 (ప్రభాతవార్త) పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు బీఆర్ నగర్ పార్కులో మొక్కలు నాటే కార్యక్రమం ఎమ్మెల్యే రవికుమార్ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రతి ఇంటా కనీసం ఒక మొక్క నాటాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పట్టణాల్లో పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించేందుకు పార్కులు, రహదారుల వెంట విస్తృతంగా మొక్కలు నాటడం చేపట్టాలని అధికారులకు సూచించారు. మున్సిపల్ అధికారులు మొక్కలు నాటి వాటిని సంరక్షించడం కూడా అంతే ముఖ్యమని ఎమ్మెల్యే సూచించారు. పర్యావరణ పరిరక్షణ దిశగా ఇటువంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.ఎమ్మెల్యే రవికుమార్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు మొదలవలస రమేష్, జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ పేడాడ రామ్మోహన్ రావు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, మాజీ వైస్ చైర్మన్ కె.వి.రాజ్యలక్ష్మి, పట్టణ పార్టీ అధ్యక్షులు సంపదరావు మురళి, కూన ఆంజనేయులు, పైడి వరాహ నరసింహులు, నాగళ్ళ మురళీధర్, పొన్నాడ వరాహ నరసింహులు, కూన అప్పలనాయుడు, బిఆర్ నగర్ ప్రజలు, పాల్గొన్నారు.

## చంద్రగ్రహణం సందర్భంగా పాతపట్నం ఆలయాల మూసివేత



పాతపట్నం, మార్చి 1 ప్రభాతవార్త: పాతపట్నంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన శ్రీ నీలమణిదుర్గ అమ్మవారి దేవస్థానం, శ్రీ నీలకంఠేశ్వర స్వామి మరియు శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాలు ఈ నెల 3వ తేదీన మూతపడనున్నాయి. సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు, అర్చకులు ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 3వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు ఆలయ ద్వారాలు మూసి వేయబడతాయని, మరుసటి రోజు అనగా మార్చి 4వ తేదీ బుధవారం ఉదయం గ్రహణ సంప్రోక్షణ అనంతరం 7 గంటలకు ఆలయాలను తిరిగి తెరచి యధావిధిగా నిత్య పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించబడతాయని ఆలయ ఈఓ టి.వాసుదేవరావు పేర్కొన్నారు. ఈ విషయాన్ని భక్తులు గమనించి తమ దర్శన సమయాలను సర్దుబాటు చేసుకోవాలని వారు కోరారు.

## స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర వాహనాలు పంపిణీ



జలుమూరు, మార్చి 1 ప్రభాతవార్త: మండలంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర వాహనాలను (12 పుష్కార్ట్స్) అందజేసినట్లు ఎంపీడీవో బి.చిన్నమ్మడు ఆదివారం తెలిపారు. ఈ వాహనాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ వాన గోపి తెలిపారు. జడ్పిటిసి ప్రతినిధి మెండ రాంబాబు, డిస్ట్రిబ్యూట్ ది చైర్మన్ కింజరాపు సత్యనారాయణ, ఏఓ రఘు, అధికారులు, సర్పంచులు పంచిరెడ్డి రామచంద్రావు, పీస పద్మావతి, నాయకులు బగ్గు గోవిందరావు, ఎంపీటీసీలు, పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం



కంచిలి, మార్చి 1 ప్రభాతవార్త: కంచిలి మండలం ఎంఎస్‌పల్లి గ్రామపంచాయతీ రాగుపురం గ్రామంలో 15 లక్షల రూపాయలు నిధులతో సీసీ రోడ్డు పనులు కంచిలి మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాదిన రామారావు చేతుల మీద ప్రారంభించడం జరిగింది. పైల పురుషోత్తం కిషోర్, శ్రీకాంత్, ఆనంద్, వెంకట్రావు, మన్మధరావు,పాల్గొన్నారు.

## శ్రీ నోరినన్న సంబర మహోత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



పాతపట్నం, మార్చి 1 ప్రభాతవార్త: మండలంలోని సింగుపురం గ్రామంలో నిర్వహించిన శ్రీరామ వంశ కులదైవం శ్రీ నోరినన్న సంబర మహోత్సవాలలో శ్రీరామ బ్రదర్స్ ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆదివారం ముఖ్య అతిథిగా పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజల శ్రేయస్సు, నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రార్థనలు చేశారు. గ్రామీణ సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలు సమాజ ఐక్యతకు బలమైన పునాది అని ఎమ్మెల్యే గోవిందరావు పేర్కొన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

శ్రీకాకుళం వార్త

## జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు గురుకుల విద్యార్థులు

సీతంపేట, మార్చి 1 ప్రభాతవార్త : కేరళ రాష్ట్రంలో జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు సీతంపేట గురుకుల రెసిడెన్షియల్ బాలుర పాఠశాలకు చెందిన నిమ్మక సూర్య చంద్రకుమార్ 8వ తరగతి సవర శ్రీధర్ 9వ తరగతికి చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ జాతీయస్థాయి ఆర్చరీ పోటీల్లో వీరు ఈ స్థాయికి తర్ఫీదు ఇవ్వడంలో ఆర్చరీ కోచ్ ఎస్.మధు పాఠశాల పిఈటి సూర్యనారాయణ ప్రిన్సిపాల్ మధుసూదన్ రావు విద్యార్థులకు అభినందించారు.

## వినియోగదారులకు నాణ్యమైన వస్తువులు అందించాలి: ఎమ్మెల్యే కూన



ఆముదాలవలస, మార్చి 1 (ప్రభాతవార్త) వినియోగదారులకు నాణ్యమైన వస్తువులు అందించిన ఆ షాపులకు గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ తెలిపారు. ఆదివారం కొత్త రోడ్ నందు ఎస్ఎస్ ఎలక్ట్రానిక్స్ హోల్సేల్ మాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన, సరసమైన ధరలకు వస్తువులు అందించిన నాడే హోల్ సేల్ మాల్‌కు గుర్తింపునిస్తుందన్నారు. నేటి కాలంలో ఆన్లైన్ బిజినెస్ ఎక్కువైందని దాన్ని అధిగమించి నాడే హోల్ సేల్ మాల్‌కు వినియోగదారులు వస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో షాప్ యజమాని ఎస్ సుధాకర్, డిసిసిబి చైర్మన్ శివాల సూర్యనారాయణ, జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ పేడాడ రామ్మోహన్రావు, తాండ్ర హరి, బుడుమూరు సీతారాం, హనుమంతు బాలకృష్ణ, పొన్నాడ గణపతి, తాండ్ర కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎస్సీ మాదిగ అమరవీరుల దినోత్సవం



వీరఘట్టం, మార్చి 1 ప్రభాతవార్త ఎస్సీ వర్గీకరణ పోరాటంలో అసువులు బాసిన మాదిగ అమరవీరుల సంస్కరణ దినోత్సవం సందర్భంగా ఆదివారం మండల కేంద్రం వీరఘట్టంలో నిర్వహించిన అమరవీల సంస్మరణ ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జాతీయ కమిటీ వ్యవస్థాపక పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడారు. ఈ ఉద్యమంలో జాతి కోసం పోరాడిన ప్రాణాలు కోల్పోయి అందరి హృదయాల్లో స్థిర స్థాయిగా నిలిచిన వారిని స్మరించుకుంటూ వారికి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా ఇన్‌చార్జ్ బోస్ మన్మధరావు, ఏ.రామ్ కుమార్, ఎన్.విజయభాస్కరరావు ఎస్.శశి కుమార్, ఎస్.ప్రకాష్, ఎన్.రిసీరోసన్ ఎస్.ప్రేమ కుమార్ వి.ప్రశాంత్, ఎన్.రాహుల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్సీపీ మండల కమిటీల నియామకంలో కొత్తూరు జోరు



కొత్తూరు, మార్చి 1 (ప్రభాతవార్త): శ్రీకాకుళం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో కొత్తూరు మండలం తనదైన ముద్ర వేస్తోంది. పార్టీ సంస్థాగత బలోపేతంలో భాగంగా చేపట్టిన మండల కమిటీల నియామక ప్రక్రియలో కొత్తూరు మండలం జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచి అందరి దృష్టిని ఆకర్షించింది. జిల్లా వ్యాప్తంగా కమిటీల పునర్వ్యవస్థీకరణ జరుగుతున్నప్పటికీ, అన్ని మండలాల కంటే ముందుగా అత్యంత వేగంగా నియామకాలను పూర్తి చేసి కొత్తూరు నేతలు ఫుల్ స్పీడ్‌లో దూసుకుపోతున్నారు. ఈ ఘనత సాధించిన కొత్తూరు మండల వైఎస్ఆర్సీపీ నాయకులను పార్టీ ముఖ్య నేత రెడ్డి శాంతి ప్రత్యేకంగా అభినందించారు. పార్టీ పట్ల అంకితభావంతో పని చేస్తూ, క్షేత్రస్థాయిలో కేడర్‌ను సమన్వయం చేసుకుంటూ అతి తక్కువ కాలంలోనే కమిటీల నియామకాన్ని కొలిక్కి తీసుకు రావడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కొత్తూరు మండల నేతలు చూపుతున్న చొరవ మిగిలిన వారికి ఆదర్శమని ఆమె కొనియాడారు. ప్రస్తుతం మండల కమిటీల్లో ఉత్సాహవంతులైన నాయకులకు, కష్టపడే కార్యకర్తలకు ప్రాధాన్యత కల్పించడంతో పార్టీ శ్రేణుల్లో కొత్త జోష్ నెలకొంది. ఈ కమిటీల ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, ప్రజల పక్షాన పోరాడేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని మండల నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోనే కొత్తూరు మండలాన్ని నంబర్ వన్ స్థానంలో నిలిపినందుకు స్థానిక నాయకత్వంపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

## కొత్త పింఛన్ల మంజూరుతో లబ్ధిదారుల్లో ఆనందం : ఎమ్మెల్యే కూన



ఆమదాలవలస, మార్చి 1, (ప్రభాతవార్త) కొత్త పింఛన్ల మంజూరుతో లబ్దిదారులకు ఆనందం కలుగుతుందని ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. ఆమదాలవలస నియోజవర్గంలో కొత్తగా మంజూరైన 59 పింఛన్లను ఆదివారం మున్సిపల్ కార్యాలయం వద్ద పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ లబ్దిదారులకు అండగా నిలుస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ చేయూతను అందించాలన్నారు. ప్రతినెల లబ్ధిదారుల ఇంటికే వెళ్లి పెన్షన్ అందించడంతో వారి ఇళ్లలో ఆనందాన్ని చూస్తున్నామని అన్నారు. కుటుంబంలో భర్తకు పెన్షన్ వచ్చి ఆ భర్త మరణిస్తే వెంటనే భార్యకు పెన్షన్ బదిలీ చేసే విధానాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. దీనివలన అర్హులైన ప్రతి లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్లు అందేలా కృషి చేస్తుందని అన్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల లబ్ధిదారులందరికీ ఇంటి వద్దనే పెన్షన్ పంపిణీ చేయడం సంతోషంగా ఉందని అన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి క్రమం తప్పకుండా పెన్షన్ పంపిణీ చేయడం కూటమి ప్రభుత్వానికే సాధ్యమని, సామాజిక పింఛన్ల పంపిణీలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తూ, అర్హులైన వారికి నెల మొదటి తేదీనే నేరుగా పింఛను అందించడంతో ఈ ప్రభుత్వం తమ వెంట ఉందన్న భరోసా, ధైర్యం, నమ్మకం వారికి కలుగుతున్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్ పెంపుదల చేసి గడప వద్దకే అందించడం జరుగుతుందన్నారు. సూపర్ సిక్స్ హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ పేడాడ రామ్మోహన్రావు, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తమ్మినేని గీత, మాజీ వైస్ చైర్మన్ కె.వి రాజ్యలక్ష్మి, టిడిపి పట్టణ పార్టీ అధ్యక్షులు సంపదరావు మురళి, నూకరాజు, బోయిన సునీత, కూన ఆంజనేయులు,ఎన్ని శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలకు అండగా కూటమి ప్రభుత్వం

### ఎమ్మెల్యే మామిడి గోవిందరావు




పాతపట్నం, మార్చి 1 ప్రభాతవార్త: అంగన్వాడీలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పత్రికా సమావేశం నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, సూపర్వైజర్లు మరియు ఇతర చిరు ఉద్యోగుల సంక్షేమంపై కూటమి ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాలను ఆయన వివరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా చరిత్రలో తొలిసారిగా రెండు సార్లు వేతనాలు పెంచిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికే దక్కిందని తెలిపారు. అలాగే ప్రతి నెల ఒకటో తేదీనే వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకుని, జీతాల ఆలస్యానికి శాశ్వతంగా చెక్ పెట్టామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 58,204 మంది అంగన్వాడీ వర్కర్లు, సూపర్వైజర్లు, బ్లాక్ కోఆర్డినేటర్లకు రూ.75 కోట్ల వ్యయంతో 5జీ స్మార్ట్‌ఫోన్లు అందించామని, వీటి ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు మరింత వేగంగా సేవలు అందుతున్నాయని వెల్లడించారు. అంగన్వాడీ కేంద్రాల హాజరు 70 శాతం నుండి 96 శాతానికి పెరగడం కూటమి పాలన ఫలితమని అన్నారు. అలాగే అంగన్వాడీ కేంద్రాల్లో తాగునీరు, టాయిలెట్లు, ఆర్డీఓ ప్లాంట్లు, టివిలు, ఇండక్షన్ స్టవ్‌లు, నాణ్యమైన వంట పాత్రలు, ఆటవస్తువులు, బోధన చార్టులు వంటి సదుపాయాలు కల్పించామని పేర్కొన్నారు. వేసవిలో 15 రోజుల సెలవులు ఇవ్వడం ద్వారా కార్యకర్తలకు ఉపశమనం కల్పించామని వివరించారు. ఏళ్ల తరబడి ఎదురుచూసిన గ్రాట్యుటీ కలను నిజం చేస్తూ బడ్జెట్‌లో రూ.20 కోట్లు కేటాయించామని తెలిపారు. అంగన్వాడీలకు అండగా నిలిచి, వారి గౌరవాన్ని పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ సమావేశంలో మండల కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## రామ మందిరము నిర్మాణం కోసం విరాళం



మెరకముడిదాం మార్చి1, ప్రభాతవార్త

మండలంలోసీరియల్ పేట గ్రామంలోరామ మందిరం నిర్మాణం కోసం విరాళంగా 105000 రూపాయలు, 2 బియ్యం బస్తాలు ఇవ్వటం జరిగింది జిల్లా వైఎస్ఆర్ పార్టీ బూత్ కన్వీనర్ లా అధ్యక్షులు బి నరేష్ కుమార్ దంపతులు అందించటం జరిగింది ఈ నెల 6,7, 8తేదీ లో రామాలయం ప్రతిష్ట జరుగుతుంది గ్రామ ప్రజలు యువత హర్షం వ్యక్తం చేయటం జరిగినది.

## గొర్రెల పెంపకం మాటున పశువులు వధ..

### అమ్మకాలు సాగిస్తున్న వైనం..ఇద్దరు వ్యక్తులు అరెస్ట్..

శృంగవరపుకోట,మార్చి1,ప్రభాతవార్త



గొర్రెల పెంపకం మాటున పశువులు వధించి అమ్మకాలు చేపడుతున్న సంఘటన మండలం లోని గోపాలపల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామంలోని పాత ఎస్సీ కాలనీలో సుల్తాన్,షేక్ బాషా అనే ఇద్దరు వ్యక్తులు ఒక షెడ్ వేసుకుని గొర్రెల పెంపకం సాగిస్తున్నారు.గొర్రెల పెంపకం మాటున ఆవులను వధించి అమ్మకాలు సాగిస్తున్నట్లు స్థానికులు గుర్తించారు. ఈమేరకు ఎస్.కోట పోలీసులకు స్థానికులు ఇచ్చిన సమాచారంతో సీఐ వీఎన్.మూర్తి వెంటనే స్పందించి గ్రామంలో ఉంటున్న ఇద్దరు వ్యక్తుల నివాసం ఇంటిపై దాడి చేశారు.ఆవులను వధించిన మాంసాన్ని సీజ్ చేసి అలాగే వారిద్దరిని అరెస్ట్ చేశారు.జరిగిన సంఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

## రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్సీ రఘురాజు..



శృంగవరపుకోట,మార్చి1,ప్రభాతవార్త..

మండలంలోని వసి గ్రామంలో బర్ల వారి కల్లాలు నుండి తాటితోట కల్లాలు వరకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన డబ్ల్యూబీఎం రోడ్డుకు సంభందించి సుమారు 30 లక్షల వ్యయంతో నిర్మించనున్న రోడ్డుకు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఆదివారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. టూరిజం డెవలప్మెంట్ బోర్డు డైరెక్టర్,వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాణి,ఎంపీపీ సండి సోమేశ్వరరావు,వసి సర్పంచ్ వబ్బిన పార్వతి,తిమిడి సర్పంచ్ వబ్బిన త్రినాథమ్మ,ఎంపీటీసీ మజ్జి దేవి నాయకులు కె.వెంకటరావు,బి.గోవింద్, వబ్బిన సతీష్,మోపడా శ్రీను,గ్రామస్థులు పాల్గొన్నారు.

## సీనియర్ అసిస్టెంట్ జోగారావుకు పదోన్నతి

నెల్లిమర్ల, మార్చి 1,ప్రభాతవార్త



స్థానిక సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల సీనియర్ అసిస్టెంట్ జోగారావుకు సూపరింటెండెంట్గా పదోన్నతులు లభించింది. జోగారావును శ్రీకాకుళం జిల్లా డివి ఈవో కార్యాలయంలో సూపరిండెంట్గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని కళాశాల ప్రిన్సిపాల్ మజ్జి సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జోగారావును కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ తో పాటు అధ్యాపకులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు.

## అంగన్వాడీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం : మార్క్ ఫెడ్ చైర్మన్ బంగార్రాజు



నెల్లిమర్ల, మార్చి 1, ప్రభాతవార్త

అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, చిరు ఉద్యోగుల సంక్షేమానికి తమ కూటమి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ఏపీ మార్క్ ఫెడ్ చైర్మన్ టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్చార్జ్ కర్రోతు బంగార్రాజు అన్నారు. పూసపాటిరేగ మండలం వెంపడాం గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఈ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, చిరు ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి. గతంలో ఎన్నడూ లేని విధంగా చరిత్రలోనే తొలిసారిగా రెండు సార్లు అంగన్వాడీ వేతనాలు పెంచిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికీ, చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని అన్నారు.ఎన్నికల్లో అంగన్వాడీలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడానికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు.అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్వాడీ కేంద్రాల మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల్లో తాగునీటి సౌకర్యాలు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.86.68 లక్షలు విడుదల చేసి, ఒక్కో కేంద్రానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించిందని బంగార్రాజు వివరించారు. అంగన్వాడీలు ప్రతిపాదించిన డిమాండ్లలో 9 డిమాండ్లను ఇప్పటికే కూటమి ప్రభుత్వం పరిష్కరించిందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పిన్నింటి సన్యాసినాయుడు , క్లస్టర్ ఇన్చార్జులు పిన్నింటి శ్రీనివాసరావు, దంగా భూలోక, టిడిపి నాయకులు ఇజ్జిరోతు ఈశ్వరరావు , కొరటాల ప్రసాద్ రావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొండ లక్ష్మీపురం సమస్యలపై చంద్రబాబుకి వినతిపత్రం

గరివిడి మార్చి,1 ప్రభాత వార్త

మండలంలోని కొండ లక్ష్మీ పురం గ్రామ పంచాయతీలో నెలకొన్న సమస్యలపై ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడుకి ఆ గ్రామ సర్పంచ్ పాండ్రంకి కామేశ్వర రావు వినతిపత్రం సమర్పించారు. ముఖ్యమంత్రి చీపురుపల్లి విచ్చేసిన సందర్భంగా ప్రజల నుండి వచ్చే వినతులను సి ఎం సిబ్బంది స్వీకరించారు. ఈ సందర్భంగా కొండ లక్ష్మీ పురం గ్రామ రైతు భరోసా కేంద్రానికి, వెల్నెస్ కేంద్రానికి, స్మశానంకి విద్యుత్తు సరఫరా చేయాలని ఈ మేరకు విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. రహదారులు నెలకొల్పాలని కోరారు. అలాగే తల్లిదండ్రులు లేనినిరుపేదలైన సీమల మంగ,కొనిసి సంతోషి, జానకి,,కె.తులసి, లకుఆదుకోవాలని, వారి జీవనోపాధి కల్పించాలని ముఖ్యమంత్రికి ఇచ్చిన వినతిపత్రంలో సర్పంచ్ పాండ్రంకి కోరారు. కాగా పాండ్రంకి వినతుల పై అమరావతి కార్యాలయం నుండి స్పందన లభించింది. వినతుల ను సంబంధిత శాఖలకు బదిలీ చేస్తున్నట్లు వారు ఫోన్ ద్వారా సమాచారం అందించారు.

## క్రికెట్ పోటీల విజేతలు... నెల్లిమర్ల, కొండవెలగాడ జట్లు

నెలిమర్ల, మార్చి 1, ప్రభాతవార్త

జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు నెల్లిమర్ల ఎస్సై బి గణేష్ ఆధ్వర్యంలో మండలంలోని సతివాడ గ్రామంలో నిర్వహించిన పోలీస్ ప్రీమియర్ లీగ్ 2026 క్రికెట్ పోటీల విజేతగా నెల్లిమర్ల రామతీర్థం జంక్షన్ జట్టు ప్రథమ బహుమతి సాధించింది. ఈ పోటీల్లో కొండ వెలగాడ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. పోటీలలో 36 జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు. ఆ గ్రామంలో ఆదివారం జరిగిన పోటీలు ముగింపు కార్యక్రమానికి భోగాపురం రూరల్ సిఐ జి రామకృష్ణ, నెల్లిమర్ల పోలీస్ స్టేషన్ ఎస్ఐ బి గణేష్ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐ రామకృష్ణ మాట్లాడుతూ యువకులు విద్యుత్తో పాటు క్రీడల్లో రాణించేందుకు కృషి చేయాలని అన్నారు. సమయాన్ని వృధా చేయకుండా, చెడు వ్యసనాలకు బానిస కాకుండా ముందుచూపుతో వ్యవహరించే ఉన్నత స్థితికి చేరుకునేందుకు ప్రయత్నించాలని అన్నారు. ఈ పోటీల్లో బెస్ట్ బ్యాట్స్మెన్ గా ఉదయ్ కిరణ్, బెస్ట్ బౌలర్గా నాగేంద్ర ఎంపికై వ్యక్తిగత బహుమతులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, క్రీడాకారులు, పోలీసు సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.



## అంగన్వాడీలకు అండగా కూటమి ప్రభుత్వం:విప్ తోయక జగదీశ్వరి



కురుపాం, ఫిబ్రవరి1 ప్రభాతవార్త

అంగన్వాడీల సంక్షేమమే దిశగా కూటమి ప్రభుత్వము అండగా ఉంటుందని ప్రభుత్వ విప్ కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. ఆదివారం తమ క్యాంప్ హౌస్ వద్ద విలేకర్ల సమావేశము ఏర్పాటు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా చరిత్రలోనే తొలిసారిగా రెండు సార్లు అంగన్వాడీ వేతనాలు పెంచిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికీ, చంద్రబాబు నాయుడు కే దక్కుతుంది అన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, చిరు ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంది అని పేర్కొన్నారు. ఎన్నికల్లో అంగన్వాడీలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడానికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది ఆమె అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్వాడీ కేంద్రాల మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది అని అలాగే రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల్లో తాగునీటి సౌకర్యాలు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.86.68 లక్షలు విడుదల చేసి, ఒక్కో కేంద్రానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించిందిన్నారు .అంతే కాకుండా అంగన్వాడీలకు ప్రతి నెల ఒకటో తేదీననే వేతనాలు అందేలా చర్యలు తీసుకుని, జీతాల ఆలస్యానికి శాశ్వతంగా చెక్ పెట్టింది మా కూటమి ప్రభుత్వం అని 58,204 మంది అంగన్వాడీ వర్కర్లు, సూపర్వైజర్లు, బ్లాక్ కోఆర్డినేటర్లకు రూ.75 కోట్ల వ్యయంతో 5జి స్మార్ట్ఫోన్లు అందించడం జరిగింది అన్నారు.ఈ స్మార్ట్ఫోన్ల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు మరింత వేగంగా, సమర్థవంతంగా సేవలు అందుతున్నాయిన్నారు.గ్రాట్యుటీ చెల్లింపుల కోసం 2025 ఆంధ్రప్రదేశ్ బడ్జెట్లోనే రూ.20 కోట్లు కేటాయించి, అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే అంగన్వాడీలకు అండగా నిలిచిందిన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 5,000 మినీ అంగన్వాడీ కేంద్రాలను పూర్తి స్థాయి అంగన్వాడీ కేంద్రాలుగా కూటమి ప్రభుత్వం అప్గ్రేడ్ చేస్తో ఇందులో భాగంగా మినీ అంగన్వాడీ కార్యకర్తలకు టీచర్గా పదోన్నతి కల్పించి, పూర్తి స్థాయి వేతనాలు అందించింది అన్నారు. అంగన్వాడీలు ప్రతిపాదించిన డిమాండ్లలో 9 డిమాండ్లను ఇప్పటికే కూటమి ప్రభుత్వం పరిష్కరించిందిన్నారు.గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక రంగాన్ని దివాళ తీసి వెళ్ళింది. వారు చేసిన అప్పులకు రాష్ట్రానికి వస్తున్న ఆదాయంతో పాటు ఇంకా అప్పులు తెచ్చి వడ్డీలు కట్టాల్సిన పరిస్థితి నేడు రాష్ట్రంలో ఉంది అని ఆమె పేర్కొన్నారు.

## వైభవంగా మజ్జి గౌరమ్మభద్రకాళి జాతర

### అమ్మవారికి మొక్కులు చెల్లించిన జడ్పిటిసి రౌతురాజేశ్వరి

దత్తిరాజేరు మార్చి 1 ప్రభాతవార్త



మండలంలోని పెదమానాపురం సంతలో నిర్మించబడ్డ శ్రీ మజ్జి గౌరమ్మ భద్రకాళి 21వ జాతర మహోత్సవం జాతర ఘనంగా చేపట్టారు. ఈ పూజ కార్యక్రమానికి మండల జడ్పిటిసి సభ్యురాలు రౌతు రాజేశ్వరిసర్పంచ్ దంపతులు పూజలో పాల్గొన్నారు వీరికి పురోహితులు రాపాక వెంకటరమణ శర్మ శ్రీనివాస శర్మ గోత్రనామాలు చదివి అభిషేకం జరిపించారు అనంతరం అమ్మవారికి మొక్కులు చెల్లించారు చుట్టుపక్క గ్రామాల భక్తులు తెల్లవారు అయిదు గంటల నుండి క్యూ లైన్ లో నిలబడి పూజలు చేశారు పురోహితులు వేడికి గోత్రనామాలు అభిషేకం చేశారు భక్తులు అమ్మవారికి కోళ్లు గొర్రెలను సమర్పించుకుని మొక్కలు చెల్లించుకున్నారు భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించామని ఆలయ నిర్వాహకులు రౌతు జగదీష్ నాయుడు తెలిపారు రాత్రికి సాంస్కృతికకార్యక్రమాలు నిర్వహించాలని జాతర మహోత్సవం విజయవంతం చేస్తున్న కమిటీ సభ్యులు అభినందనలు తెలిపానన్నారు.

## మంత్రి సంధ్యారాణి సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్న భీమందోరవలస గిరిజన కుటుంబాలు



పాచిపెంట మార్చి ఒకటి ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వం సీఎం చంద్రబాబు నాయుడు అధికారంలో వచ్చినప్పటి నుంచి ప్రజలకు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై రాయిగుడ్డి వలస పంచాయితీలో గల భీమందోరవలస గ్రామానికి చెందిన 100 కుటుంబాలు మండల టిడిపి అధ్యక్షుడు గూడెపు యుగంధర్ఆధ్వర్యంలో (వైయస్సార్ పార్టీ నుండి) తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వచ్చిన కార్యకర్తలకు గిరిజన మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి కండువా కప్పి ఆహ్వానించారు. ఆదివారం తమ పార్టీ కార్యాలయంలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడుతూ తమ కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యను పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయమని వారికి భరోసా ఇచ్చారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమన్నారు.భీమశీదొర వలస కార్యకర్తలతో కొద్దిసేపు మచ్చటించారు. వారి మంచి చెడులు తెలుసుకొని గ్రామం సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముఖి మండల టిడిపి అధ్యక్షులు యుగంధర్, మండల టిడిపి యువ నాయకుడు కోరిపిల్లి సురేషు ఏం సి డైరెక్టర్ పూసర్ల నర్సింగరావు, పాచిపెంట ఎంపీటీసీ సభ్యులు ఉమామహేశ్వరరావు కర్రివలస బ్రహ్మన్న మండల టిడిపి నాయకులు హాజరయ్యారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి

రామభద్రపురం, మార్చి ఒకటి ప్రభాతవార్త



రామభద్రపురం మండలం పరిధిలో గల బుసయవలస సాయి కోల్డ్ స్టోరేజ్ వద్ద ఈ వృద్ధుని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టగ అక్కడకక్కడే చనిపోయినట్టు హెడ్ కానస్టేబుల్ ఎమ్. సత్య నారాయణ తెలిపారు. రామభద్ర పురం పోలీస్ వారు అందించిన వివరాలు ప్రకారం చనిపోయిన వృద్ధుని పేరు కల్లూరి భైరగి (84) సన్ అఫ్ లేట్ లచ్చన్న, పద్మశాలి కులం, వాడాడ గ్రామం, బాడంగి మండలం, ఇతడు ఈరోజు తెల్లవారి జామున 4:00 గంటలకు తన కుమార్తె ఇంటి వద్ద నుంచి బయలుదేరి వాడాడ వెళ్ళుటకు వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టగ వృద్ధుడు అక్కడక్కడే చనిపోయాడు అక్కడ వున్నా వారు మృతుని కుమార్తె మాసబత్తుల అప్పలనారసమ్మకు తెలియ పరచగా కుమార్తె వచ్చి చూసి అందరికి తెలియపరచ్చినట్టు చెప్పిరి మృత్తునికి ఇద్దరు కుమారులు ఇద్దరు కుమార్తెలు మృతుని కుమారుడు కల్లూరి కృష్ణ సదరు విషయాన్ని గుర్తుంచి రామభద్రపురం పోలీసువారికి రిపోర్ట్ చేసియున్నారు. రిపోర్ట్ మేరకు కేసు నమోదు చేసి హెడ్ కానస్టేబుల్ సత్య నారాయణ ధర్యాప్తు చేస్తున్నారు.

## ప్రశాంతంగా అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలు

గరుగుబిల్లి, మార్చ్1, ప్రభాతవార్త



గరువుబిల్లి మండలం కేంద్రంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల, 2026–27 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతితో పాటు ఇంటర్మీడియట్, ఐఐటీ–నీట్ విభాగాల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్షలకు విద్యార్థినులు పెద్ద ఎత్తున ఆదివారం హాజరయ్యారు. ఉదయం 9:30 నుంచి 11 గంటల వరకు జరిగిన ఐదవ తరగతి ప్రవేశ పరీక్షకు మొత్తం 97 మంది విద్యార్థినులకు గాను 76 మంది హాజరయ్యారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుండి 1:30 గంటల వరకు జరిగిన ఇంటర్మీడియట్ జనరల్ ప్రవేశ పరీక్షకు 122 మంది దరఖాస్తు చేసుకోగా, 104 మంది విద్యార్థులు హాజరయ్యారు. చివరిగా మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 4:30 గంటల వరకు నిర్వహించిన ఐఐటీ–నీట్ ప్రవేశ పరీక్షకు 66 మందికి గాను 52 మంది విద్యార్థినులు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ మరియు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ రజనీకుమారి వెల్లడించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. అబ్జర్వర్ గా కొమరాడ పీజీటీ (గణితం) శ్రీమతి పి. ఉషారాణి, స్టేట్ అబ్జర్వర్ గా ఎన్.టి. మార్టిన్ వ్యవహరించారు. పార్వతీపురం మన్యం మరియు విజయనగరం జిల్లాల పర్యవేక్షణలో భాగంగా జరిగిన ఈ పరీక్షా ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, క్రమశిక్షణతో కూడిన వాతావరణంలో జరిగినట్లు చీఫ్ సూపర్ండెంట్ మరియు ప్రిన్సిపాల్ రజనీకుమారి తెలిపారు.

## ప్రభుత్వం అంగన్వాడీ సమస్యలు సమగ్రపరిశీలన : మంత్రి

సాలూరు మార్చి 1 ప్రభాతవార్త



అంగన్వాడీ పదిడిమాండ్లలో తొమ్మిది ప్రభుత్వం ఇప్పటికే పరిష్కరించిందని అలాగే ఇంకా మిగిలినవి ప్రభుత్వం సమగ్రంగా పరిశీలన చేస్తుందని మంత్రి సంధ్యారాణి చెప్పారు.ఆదివారం ఆమె మీడియా సమావేశంలో మాట్లాడుతు గతంలో అంగన్వాడీలు 40 రోజులు ధర్నా చేస్తే జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదని గుర్తు చేశారు.కానీ సీఎం చందబాబు తప్పకుండా మీ సమస్యలు పరిష్కరిస్తారని భరోసా ఇచ్చారు.అలాగే రాష్ట్ర ఆర్థికపరిస్థితి బాగాలేకపోయిన సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని క్లారిటీ ఇచ్చారు.అంతేకాకుండా అంగన్వాడీ చేపట్టిన ధర్నాలు ఆందోళనలు విరమించి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.అలాగే ముఖ్యమంత్రి దృష్టికి జీతాలు పెంపు విషయం తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తారని మంత్రి స్పష్టం చేశారు.

విజయనగరం
పార్వతీపురం మన్యం
వార్త

## ఎల్ కోటలో గడ్డి మేటుకు నిప్పు అంటుకొని ధాన్యం బస్తాలు దగ్ధం




లక్కవరపుకోట మార్చి 1 ప్రభాత వార్త

మండలంలోని ఎల్ కోట మేజర్ పంచాయతీ జామి వీధికి దగ్గర లో గల రైతులకు చెందిన కల్లా లు లో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఇద్దరు రైతులకు చెందిన గడ్డి మేట్లు పూర్తిగా కాలిపోవడంతో పాటు అక్కడే కళ్ళములో దాచు కున్న 50 ధాన్యం బస్తాలు కూడా కాలి పోయాయి వివరాలలోకి వెళితే జామి అప్పలనారాయణ తమ కిచెందిన పంటను ఈ మధ్య నే నూర్పు వేసి ధాన్యం బస్తాలులో నింపి మిల్లికి తరలించేందుకు సిద్ధం చేసి ఉంచగా ఆదివారం మధ్యాహ్నం అందరు పొలం లో పశువులు మేపు తున్న సమయం లో ఎలా జరిగిందో తెలియదు గడ్డి మేటుకు నిప్పు అంటుకుని ప్రక్కన నే గల బస్తాలు కూడా అగ్నికి అహుతి అయ్యాయి ఈ మంటలు కారణం గా దగ్గర లో గల ఇంకో రైతు బుర్లే సూరి బాబు కి చెందిన గడ్డి మేటు కూడా కాలి పోయింది మంటలు అర్పేందుకు ఎంత ప్రయత్నం చేసినా సాధ్యం కాక పోవడం తో అగ్ని మాపక సిబ్బంది కి సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలు అదుపులోకి తెచ్చారు ఈ ప్రమాదం లో జామి అప్పలనారాయణ 70 వేలు విలువ కలిగిన ధాన్యం ఆలాగే బుర్లే సూరి బాబు కి చెందిన 30 వేలు విలువ కలిగిన గడ్డి మేటు కాలిపోవడము వలన దాదాపు లక్ష విలువ చేసే ఆస్థి నష్టం వాటిల్లింది అని బాధితులు తెలిపారు మంటలు సకాలంలో అర్పడం వలన ఇతర రైతులకు చెందిన గడ్డి ధాన్యం కి చుట్టూ ప్రక్కన గల ఇళ్ళకి అగ్ని ప్రమాదం తప్పింది ఎల్ కోట పోలీసులు గ్రామస్థులు మంటలు అర్పేందుకు అగ్ని మాపక సిబ్బంది కి సహాయం చేశారు.

## తోటపల్లి ఐటీడిఏ పార్కులో పర్యాటక హంగులు: జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి



పార్వతీపురం, మార్చి1, ప్రభాతవార్త

తోటపల్లి ఐటీడిఏ పార్కును పర్యాటక పరంగా మరింత అభివృద్ధి చేసే దిశగా అడుగులు పడుతు న్నాయి. జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి ఆదివారం ఐటీడిఏ పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన స్పీడ్ బోట్ ను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన స్వయంగా బోటులో ప్రయాణించి భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తోటపల్లి రిజర్వాయర్ పరిసర ప్రాంతాలను పర్యాటక హబ్ గా మార్చడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇప్పటికే పార్కులో ఉన్న వసతులకు తోడు, యువతను మరియు పర్యాటకులను ఆకర్షించేందుకు ఈ స్పీడ్ బోట్ రైడింగ్ను, గుడిసె రాట్నం ( గ్రామీణ క్రీడ )ను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక ప్రోత్సాహంతో గత కొద్ది కాలంగా తోటపల్లి పార్కు రూపురేఖలు మారిపోయాయి. పర్యాటకుల కోసం ఇప్పటికే అందుబాటులోకి మరిన్ని ఆకర్షణలు వచ్చాయి, ప్రకృతి ప్రేమికుల కోసం ఆకట్టుకునేలా తీర్చిదిద్దిన పచ్చదనం, పిల్లలు ఆడుకునేందుకు వీలుగా ఏర్పాటైన ఆధునిక ఆట పరికరాలు, సాయంత్రం వేళల్లో పార్కును చూసేందుకు వీలుగా విద్యుత్ అలంకరణలు ఏర్పాటయ్యాయి. బోటింగ్ చేసే పర్యాటకుల కోసం లైఫ్ జాకెట్లు మరియు శిక్షణ పొందిన ఆపరేటర్ల నియామకం. పర్యాటకులు ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని, పార్కు పరిశుభ్రతను కాపాడటంలో అధికారులకు సహకరించాలని కలెక్టర్ కోరారు. రానున్న రోజుల్లో మరిన్ని వినోద కార్యక్రమాలను ఇక్కడ ప్రవేశపెట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఐటీడిఏ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ కాలనీని చుట్టిముట్టిన పోలీసు బలగాలు



గరివిడి మార్చి 1 ప్రభాత వార్త

గరివిడి పట్టణ పరిధి, శివారు కాలనీ అయిన ఇందిరమ్మ కాలనీని పోలీసు బలగాలు చుట్టిముట్టాయి. గంజాయి, ఇతర మాదకద్రవ్యాలు అక్రమంగా కలిగి ఉండటాన్ని గుర్తించే ప్రక్రియలో బాగంగా పోలీసులు కాలనీలో సోదాలు చేపట్టారు. అక్రమ వస్తువులు,అక్రమ వాహనాలు కలిగి ఉండే అనుమానిత వ్యక్తుల ను వారు తనిఖీ చేపట్టారు. చీపురుపల్లి డి ఎస్ పి సూరాడ రాఘవులు ఆధ్వర్యంలో చేపట్టిన మెగా సెర్చ్ ఆపరేషన్ లో రాజాం,చీపురుపల్లి అర్బన్, రూరల్ పరిధిలో గల పోలీసులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఇందిరమ్మ కాలనీ వాసులను అప్రమత్తం చేశారు. ఆకస్మికంగా పోలీసు బలగాలు తమ కాలనీ ని చుట్టిముట్టడంతో కాలనీ వాసులు ఒక్కసారిగా సంభ్రమచ్చార్యాలకు గురయ్యారు. పోలీసులు కాలనీలో కి ప్రవేశించే సందర్భంలో బూటు చప్పుళ్ళు అలికిడి కి కాలనీ వాసులు ఒక్కసారిగా కలవర పాటుకి గురయ్యారు. ఏ మైందని వారు ఆందోళన చెందారు. పోలీసులు అక్రమ మాదక ద్రవ్యాలు తనిఖీ, ఇతర అంశాల పరిశోధన చేపట్టడం తో వారు ఊపిరి పీల్చుకున్నారు. కాలనీ వాసులకు పలు అంశాలపై పోలీసులు చైతన్య పరిచారు. కార్యక్రమంలో డిఎస్పీ సూరాడ రాఘవులు , చీపురుపల్లి సి ఐ శంకర రావు, గరివిడి ఎస్ ఐ బి.లొకేశ్వర రావు,తో పాటు చీపురుపల్లి, రాజాం సర్కిల్ పరిదిలోగల సి ఐ లు, ఎస్ ఐ లు పాల్గొన్నారు.

## బస్టాండ్ వద్ద గుంతలు పూడ్చి వేయించిన అంధవరపు

కురుపాం, ఫిబ్రవరి1 ప్రభాతవార్త.



స్థానిక బస్టాండ్ వద్ద ప్రధాన రహదారిలో సీసీ రహదారి గుంతలు గుంతలుగా ఏర్పడడంతో మాజీ జడ్పిటిసి అంధవరపు కోటేశ్వరరావు ఆ గుంతలను పూడ్చి వేయిస్తున్నారు. ఆదివారం రాత్రి మానవతా దృక్పథంతో తన సొంత ఖర్చులతో పూడ్చి వేయించారు. ఈ రహదారి గుండా ఒరిస్సా గుమ్మ లక్ష్మం పురం వాహనాలు భారీ వాహనాలు నిత్యము తిరుగుతూ రద్దీగా ఉంటుంది. గత ఏడాది కురుపాంలో రహదారి అభివృద్ధిలో భాగంగా సిసి రోడ్లను నిర్మించారు అప్పట్లో ఆర్ అండ్ బి శాఖ నిర్లక్ష్యంతో అర్ధరాత్రి వర్షం కురుస్తున్న రహదారిని సిసి వేయటంతో అప్పట్లోనే గుంతలు ఏర్పడ్డాయి. దీనిని ఆర్ అండ్ బి శాఖను స్థానికులు నిలదీయడంతో తూతూ మంత్రంగా పనులు చేపట్టారు. ఆ పనులు ఎంత కాలం నిలవకుండా మరల గుంతలు గొంతులోగా ఏర్పడడంతో వాహనదారులతోపాటు స్థానికులు కూడా ఇబ్బంది పడుతున్నారు. దీనిని మరల ఆ శాఖకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎప్పటికి స్పందించటంతో స్థానిక మాజీ జెడ్పిటిసి అందవరపు కోటేశ్వరరావు స్పందించి తన సొంత నిధులతో గుంతలను పూడ్చి వేయించారు. దీంతో స్థానికులు వ్యాపారులు వాహనదారులు అభినందనలు తెలిపారు.



## బ్రహ్మోత్సవాల సందర్భంగా పందిరి రాట

ఎలమంచిలి మార్చ్ 0 1 ప్రభాతవార్త

మండలంలోని ములకలాపల్లి గ్రామంలో గల మై హోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ (సిమెంట్ ఫ్యాక్టరీ) శ్రీనగర్ కాలనీలో గల శ్రీ వ్యూహ లక్ష్మీ సమేత వెంకటేశ్వర స్వామి సన్నిధిలో తొమ్మిది తారీకు నుండి 12వ తారీకు వరకు జరుగు వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం స్వామివారి కల్యాణమునకు పందిరి రాట వేసినట్లు ఫ్యాక్టరీ యూనిట్ హెడ్ బి రామస్వామి తెలిపారు. ప్రతి సంవత్సరం వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఈ సంవత్సరం కూడా అదే విధముగా బ్రహ్మోత్సవాలను అతి వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డిజిఎం (పి అండ్ ఏ) ఎల్ శ్రీనివాసరావు, ఫ్యాక్టరీ ఉద్యోగులు, కార్మికులు కాలనీవాసులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలకు అండగా కూటమి ప్రభుత్వం: ప్రగడ నాగేశ్వరరావు

ఎలమంచిలి మార్చ్ 0 1 ప్రభాతవార్త



పట్టణములోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ , నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు ,మాజీ ఎంపీ, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు పప్పల చలపతిరావు పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ అంగనవాడి కార్యకర్తలు, హెల్పర్లు, చిరు ఉద్యోగాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, గతంలో ఎన్నడూ లేని విధంగా చరిత్రలోనే తొలిసారిగా రెండుసార్లు అంగన్వాడీలకు వేతనాలు పెంచిన ఘనత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వానికి చంద్రబాబు నాయుడు దక్కుతుందని, ఎన్నికల్లో అంగన్వాడీలకి ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడానికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని, అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్వాడీ కేంద్రాల మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సాధించిందని, రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాలలో తాగునీటి సౌకర్యాలు, మరుగుదొడ్ల నిర్మాణానికి 86.68 లక్షల కోట్లు విడుదల చేసి, ఒక్కొక్క కేంద్రానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించిందని, అంగన్వాడీలకు ప్రతినెలా ఒకటో తేదీని వేతనాలు అందించేలా చర్యలు తీసుకొని జీతాలు ఆలస్యానికి చెక్ పెట్టిందని, 58,204 మంది అంగన్వాడి వర్కర్లు, సూపర్వైజర్లు, బ్లాక్ కోఆర్డినేటర్లకు 75 కోట్ల వ్యయంతో 5జి స్మార్ట్ ఫోన్లు అందించిందని, ఈ స్మార్ట్ ఫోన్ల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు కు మరింత వేగంగా మరియు సమర్థవంతంగా సేవలు అందుతున్నాయని, అంగన్వాడి కేంద్రాల హాజరు 70 శాతం నుండి 96 శాతానికి పెరగడం కూటమి పాలనకు వచ్చిన ప్రత్యక్ష ఫలితమని, ఏళ్ళ తరబడి అంగన్వాడీలు ఎదురుచూసిన గ్రాడ్యుటీ కలను కూటమి ప్రభుత్వం నిజం చేసిందని, గ్రాడ్యూటీ చెల్లింపుల కోసం 2025 ఆంధ్రప్రదేశ్ బడ్జెట్లో 20 కోట్లు కేటాయించి, అధికారంలోకి వచ్చిన 9 నెలల్లో అంగన్వాడీలకు అండగా నిలిచిందని, అంగన్వాడి సెంటర్ కు టీవీ , ఆర్వో ప్లాంట్లు, హైలెట్ సౌకర్యం కల్పించిందని, వేసవిలో 15 రోజులు సెలవులు, ఆట వస్తువులు ,పాఠాలు చెప్పడానికి వీలుగా చాట్లు, ఇండక్షన్ స్టవ్ నాణ్యమైన వంటపాత్రలు ఇచ్చారని, రాష్ట్ర వ్యాప్తంగా ఐదువేల మినీ అంగన్వాడి కేంద్రాలను పూర్తిస్థాయి అంగన్వాడీ కేంద్రాలుగా అప్ గ్రేడ్ చేస్తుందని, ఇందులో భాగంగా మినీ అంగన్వాడీ కార్యకర్తలకు టీచర్ గా పదోన్నతి కల్పించి, పూర్తిస్థాయి వేతనాలు అందించడం ఉందని, కొత్తగా 5000 మంది అంగన్వాడి సహాయకులను నియమించిందని, అంగన్వాడీలు ప్రతిపాదించిన డిమాండ్లలో 9 డిమాండ్లను ఇప్పటికే కూటమి ప్రభుత్వం పరిష్కరించిందని, వేతనాల పెంపు అంశాన్ని కూడా వీలైనంత త్వరగా ప్రభుత్వం కృషి చేస్తుందని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కృష్ణంగా ఉన్నప్పటికీ, ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వ ఎప్పటికీ ప్రాధాన్యం ఇస్తుందని, గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక రంగాన్ని దివాలా తీసి వెళ్లిందని, వారు చేసిన అప్పులు రాష్ట్రానికి వస్తున్న ఆదాయంతో పాటు ఇంకా అప్పులు తెచ్చి వడ్డీలు కట్టాల్సిన పరిస్థితి నేడు రాష్ట్రంలో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష కార్యదర్శులు గొర్లె శివన్నారాయణ మూర్తి, ఆడారి ఆదిమూర్తి,సీనియర్ నాయకులు రాజాన సూర్య నాగేశ్వరరావు, క్లస్టర్ ఇంచార్జ్ కరణం రవికుమార్ , తెలుగుదేశం పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు దంట్ల వెంకటస్వామి, పాల్గొన్నారు.

## బాణాసంచా తయారీ కేంద్రాలపై పోలీసుల ఉక్కుపాదం

### నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు :జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా



అనకాపల్లి, మార్చి 1 (ప్రభాత వార్త):

కాకినాడ జిల్లా వేట్లపాలెంలో జరిగిన దురదృష్టకర సంఘటనను దృష్టిలో ఉంచుకుని, రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా వారి ఆదేశాల మేరకు, అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా బాణాసంచా తయారీ నిల్వ కేంద్రాలలో జిల్లా పోలీస్ యంత్రాంగం ఆదివారం ముందస్తు తనిఖీలు చేపట్టింది. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా స్వయంగా రంగంలోకి దిగి, జిల్లాలోని అన్ని సబ్ విజన్ల పరిధిలో తనిఖీలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు అనకాపల్లి, నర్సీపట్నం, పరవాడ డీఎస్పీల పర్యవేక్షణలో అన్ని స్టేషన్ల హౌస్ ఆఫీసర్లు, ఫైర్ రెవెన్యూ శాఖల సమన్వయంతో జిల్లావ్యాప్తంగా లైసెన్స్ ఉన్న అనధికారిక యూనిట్లపై దాడులు నిర్వహించారు. తనిఖీల్లో ప్రధానంగా పరిశీలించిన ఎక్స్‌ప్లోజివ్ రూల్స్ , నిబంధనల ప్రకారం చెల్లుబాటు అయ్యే తయారీ , నిల్వ లైసెన్స్‌లు ఉన్నాయా లేదా అని తనిఖీ చేశారు. షెడ్లలో అనుమతించిన పరిమితికి మించి పేలుడు పదార్థాలను నిల్వ చేయకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. మిక్సింగ్, ఫిల్లింగ్, ప్యాకింగ్ మరియు ఎండబెట్టే విభాగాలు నిబంధనల ప్రకారం నిర్ణీత దూరంలో ఉన్నాయో లేదో పరిశీలించారు. శిక్షణ పొందిన వ్యక్తులే పని చేస్తున్నారా? చైల్డ్ లేబర్ ఉన్నారా? సింథటిక్ దుస్తులు ధరించకుండా కాటన్ దుస్తులనే వాడుతున్నారా అనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా అనధికారికంగా బాణాసంచా తయారు చేసినా లేదా నిల్వ ఉంచినా తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే ఏ ఒక్కరిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా ఈ తనిఖీలు నిర్వహించడమైనది. ప్రజలు కూడా తమ పరిసరాల్లో ఎవరైనా అక్రమంగా పేలుడు పదార్థాలను నిల్వ ఉంచితే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## అట్టహాసంగా సైన్స్ దినోత్సవం.!

(నక్కపల్లి ,ప్రభాతవార్త)



జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా మండలంలోని పలు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు శనివారం అట్టహాసంగా నిర్వహించారు . జాతీయ విజ్ఞాన దినోత్సవం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిన్నదొడ్డిగళ్ళు తోపాటు దేవవరం, వేంపాడు, జానకయ్యపేట, డిఎల్ పురం, ఉద్దండ పురం పాఠశాలలో పాఠశాల విద్యార్థులు వివిధ రకాల సైన్స్ మోడల్స్ ను తయారు చేసి ప్రదర్శించారు. ముఖ్యంగా వాతావరణ కాలుష్యం దాని నివారణ, ఆర్గానిక్ ఫార్మింగ్, మంకీ గన్, నీటి శుద్ధి పరకరం వంటి మోడల్స్ చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి. బాలాజీ, వేమగిరి నూకరాజు లు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కూడా శాస్త్ర విజ్ఞాన విషయాలపై దృష్టి పెట్టాలని అన్నారు. పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు నాగశివరామ్, ప్రసాద్ పాల్గొన్నారు.

## పారా వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో పేటకు చోటు.!

### జాతీయ ఉపాధ్యక్షులుగా "బోడపాటి"



(నక్కపల్లి, ప్రభాతవార్త)

జాతీయస్థాయి పారా వాలీబాల్ ఫెడరేషన్ లో పాయకరావుపేట నియోజకవర్గం చోటు దక్కింది.! ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మీరట్లో జరిగిన జాతీయ స్థాయిలో వాలీబాల్ నేషనల్ ఛాంపియన్ షిప్ ఫైనల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు పాల్గొనడం సంతోషంగా ఉంది. ఆ పోటీ సందర్భంగా జాతీయస్థాయిలో జరిగిన కార్యక్రమంలో పాయకరావుపేట నియోజక వర్గానికి ఫెడరేషన్ లో జాతీయస్థాయి ఉపాధ్యక్ష పదవి జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్ దక్కింది. ఈ సందర్భంగా శివ దత్ మాట్లాడుతూ అవకాశం కల్పించడం ఎంతో ఆనందంగా ఉందని స్థానిక విలేకరులకు తెలిపారు. జాతీయ పారా వాలీబాల్ ఫెడరేషన్ లో ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా జనసేన పార్టీ కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శివదత్ జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో పాటు రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ లతోపాటు పలువురు జనసేన పార్టీ నాయకులకు ఎమ్మెల్యేలకు, పార్టీ కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## వినయ్ కాలేజీలో ఫేర్వెల్ డే అలరించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

(ఎస్ రాయవరం ప్రభాత వార్త



మండల కేంద్రమైన ఎస్ రాయవరం గ్రామంలో వినయ్ కాలేజీలో ఫేర్వెల్ డే ఫంక్షన్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల తల్లిదండ్రులను ఆకట్టుకు న్నాయి. అనంతరం విద్యలో విద్యా ర్థుల ప్రతిభను కనబరిచినటువంటి విద్యార్థిని విద్యార్థులకు బహుమతులను పాఠశాల కరస్పాండెంట్ బత్తుల శ్రీనివాసరావు బహుమ తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ అప్పారావు. ఉపాధ్యాయులు. విద్యా ర్థులు తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

## కేంద్రీయ విద్యాలయాన్ని తక్షణమే నిర్మించాలి..సిపిఐ డిమాండ్



అనకాపల్లి మార్చి 1,(ప్రభాత వార్త)

అనకాపల్లి మండలం సీతానగరం రెవెన్యూ పరిధిలో గల సుందరయ్య పేట పంచాయతీ సీతానగరం రెవెన్యూ పరిధిలో గలఅచ్చియ్యా పేట గ్రామంలో సర్వే నంబర్ 511లో పది ఎకరలలో కేంద్ర విద్యాలయాన్ని నిర్మించాలని సిపిఐ మండల కార్యదర్శి వియ్యపు రాజు చేపట్టిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సిపిఐ జిల్లా కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. అచ్చియ్యపేట గ్రామంలో కేంద్రీయ విద్యాలయం కోసం రైతుల నుండి పది ఎకరముల జీడి తోటను తీసుకుని కేంద్రీయ విద్యాలయం నిర్మాణం చేపట్టక పోవడం చూస్తుంటే విద్యావ్యవస్థపై పాలకులకు ఎంత చిత్తశుద్ధి ఉందో తెలుస్తుందని అన్నారు. ఇప్పటికే ప్రభుత్వ మెడికల్ కాలేజీలను నర్సీపట్నం తరలించారని, దీన్ని కూడా జిల్లా కేంద్రం నుంచి నర్సీపట్నం తరలించే ఆలోచనలు ప్రభుత్వం ఉందని తక్షణమే ఈ ఆలోచన విరమించుకొని అచ్చయ్యపేట గ్రామం లోనే నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. 10 సంవత్సరాలు గడిచిన కేంద్రీయ విద్యాలయం నిర్మాణం చేపట్ట లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారని అన్నారు తక్షణమే నిర్మాణం చేపట్టాలని భూములు కోల్పోయి రోడ్డు న పడ్డ రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. తక్షణమే కూటమి ప్రభుత్వం డబుల్ ఇంజన్ సర్కార్ ఎంపీ సీఎం రమేష్, స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తక్షణం స్పందించి కేంద్రీయ విద్యాలయం నిర్మాణం కోసం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గం సభ్యులు జి ఫణీంద్ర కుమార్, సిపిఐ అనకాపల్లి మండల కార్యదర్శి వియ్యపు రాజు , వియ్యపు గణేష్, ఒమ్మి సతీష్, గొంప్ప రవికుమార్, బోయిన ధనజి రావు, ఉరిగిటి ఆదినారాయణ, బర్నికాన అప్పారావు, సుందర య్య పేట వైస్ సర్పంచ్ బాధపు హరికృష్ణ, ముల్లి కిరణ్, నమ్మి అప్పారావు, రాము తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు పులిహోర పంపిణీ.!

(నక్కపల్లి, ప్రభాతవార్త)

మండలంలోని ఉపమాక వెంకటేశ్వర స్వామి కళ్యాణ ఉత్సవాల్లో భాగంగా శనివారం ఊహించిన రీతిలో భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో వారికి నక్కపల్లి పట్టణానికి చెందిన ఆర్యవైశ్యులు నున్న సుబ్రమణ్యం గుప్తా, సోదరుడు నున్న నర్సింహమూర్తి తో పాటు స్వర్గీయ శేషు డాక్టర్ జ్ఞాపకార్థంగా పులిహోర పెద్ద ఎత్తున పంపిణీ చేశారు. రెండో రోజు కూడా సేవా కార్యక్రమాలను కొనసాగించారు. వీరిని ఆలయ అధికారులు, నిర్వాహకులు అభినందించారు.

## ఒకరోజు ముందు పింఛన్లు ఇచ్చిన ఘనత కూటమిదే: "మెరుగు"

( అడ్డురోడ్డు, ప్రభాతవార్త)



ముందు రోజు ఆదివారం కావడంతో పింఛన్లకు అవకాశం లేకపోవడం గుర్తించిన కూటమి ప్రభుత్వం ఒక రోజు ముందుగా పింఛన్ ఇచ్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వాన్ని దేనని ఎంపీటీసీ సభ్యులు మెరుగు నాగేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని పెద్ద తీనార్ల పంచాయతీలో అన్ని రకాల పింఛన్లను అందజేశారు. ఆయనతోపాటు వీఆర్వో కొప్పిశెట్టి చిట్టిబాబు, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ప్రశాంతంగా గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలు

(నక్కపల్లి, ప్రభాతవార్త)



నక్కపల్లి అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి తో పాటు ఇంటర్మీడియట్ జనరల్,ఐఐటి, నీట్‌లకు సంబంధించిన ప్రవేశానికి ప్రిన్సిపాల్ ఉషారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఐదో తరగతి ప్రవేశానికి 87 మంది ఐఐటి, నీట్‌కు 155 మంది హాజరయ్యారు. వైస్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి ఉన్నారు.

## సంగీత పిడుగులకు సత్కారం.!

(నక్కపల్లి ,ప్రభాతవార్త)



ఉపమాక వెంకటేశ్వర స్వామి వార్షిక కళ్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం కళావేదిక వద్ద విజయనగరానికి చెందిన తమ్మిన సంయుక్త ప్రియ, సాహితి ప్రియా అక్క చెల్లెలు ప్రదర్శించిన శాస్త్రీయ సంగీతం, కచేరి వయోలిన్, అన్నమాచార్య కీర్తనలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. వీరితోపాటు కూచిపూడి నాట్యం ప్రదర్శించిన చిన్నారులు వారి ప్రదర్శన ఇంకా చెప్పనక్కర్లేదు.. భక్తుల హృదయాలను దోచేశారు. అటువంటి ఈ సంగీత పిడుగులను ఆలయ అధికారి కూర్మిశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిసెట్టి బుజ్జి, గ్రామానికి చెందిన పెద్దలు ఈశ్వరరావు, దొరబాబు ,కురం దాసు అప్పలరాజు ,కొప్పిశెట్టి శ్రీను, తోలేటి శ్రీను తదితరులు సత్కరించారు.

## మందు గుండు సామగ్రి తయారీ కేంద్రాల తనిఖీ.!

నక్కపల్లి, ప్రభాతవార్త



మండలంలోని వేంపాడు- కాగిత మధ్యన ఉన్న మందుగుండు సామాగ్రి తయారీ దుకాణాన్ని జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డిఎస్పి శ్రీనివాస్ పర్యవేక్షణలో సీఐ జూరెడ్డి మురళి ఆధ్వర్యంలో ఎస్సై సన్నీ బాబు ఆదివారం ఈ మేరకు తనిఖీ నిర్వహించారు. తయారీ కేంద్రానికి సంబంధించి లైసెన్స్ ఉన్నప్పటికీ యజమాని రమేష్ తప్ప కూలీలు ఎవరూ లేకపోవడం మందు గుండు తయారీ కనిపించకపోవడంతో భవిష్యత్తులో మందు గుండు సామగ్రి తయారు చేస్తే పూర్తిస్థాయిలో భద్రత చర్యలు చేపట్టాలని సూచనలు చేశారు.

## పదిలో శతశాతం ఫలితాలే లక్ష్యం:డిఈవో" అప్పారావు నాయుడు"

(నక్కపల్లి,ప్రభాతవార్త)



ఈనెల 16 నుండి నిర్వహించనున్న పదవ తరగతి ఫలితాలలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపడమే తమ లక్ష్యమని జిల్లా విద్యాశాఖ అధికారి జి. అప్పారావు నాయుడు తెలిపారు. వందరోజుల కార్యాచరణ ప్రణాళిక అమలులో భాగంగా ఆదివారం మండలంలోని వేంపాడు ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ముఖ్యంగా పదవ తరగతి విద్యార్థుల 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను పరిశీలించి గంట సమయం విద్యార్థులతో మాట్లాడారు .పరీక్షల ప్రాముఖ్యతను సన్నద్ధతను గురించి మాట్లాడి సూచనలు సలహాలు ఇచ్చారు .భౌతిక శాస్త్రం మరియు తెలుగు స్లిప్ టెస్ట్ పేపర్లను క్షుణ్ణంగా పరిశీలించి ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. 10వ తరగతి విద్యార్థులు అందరూ ఉత్తీర్ణత చెందడమే కాకుండా ఆరవ తరగతి విద్యార్థులపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించేలా చూడాలని ,సిలబస్ తో సంబంధం లేకుండా తెలుగులో చదవడం రాయడం మాట్లాడడం గణితంలో చతుర్విధ ప్రక్రియలు వచ్చేలా క్రింది తరగతులలోనే ఉపాధ్యాయులు శిక్షణ ఇవ్వాలన్నారు. పరీక్షల సమయంలో ఆహార నియమాలపై ఆయన సూచనలు అందించారు. ఉపాధ్యాయులు చెప్పిన సూచనలు పాటించాలన్నారు. విద్యార్థుల యొక్క వేషధారణ ఆదర్శంగా ఉండాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు అమలవుతున్న ప్రతి ఆదివారం హలో టీచర్ కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసుకోవాలని ఆయన తెలిపారు. ఇప్పటికే జిల్లా అకాడమిక్ మోనిటరింగ్ టీం మరియు మండల అకాడమిక్ మోనిటరింగ్ టీం లు జిల్లాలో అన్ని పాఠశాలలు సందర్శించి పదవ తరగతి విద్యార్థులకు రాబోయే పరీక్షల్లో మంచి మార్కులను సాధించేలా సబ్జెక్టు నిపుణులచే అవగాహన కల్పిస్తున్నామని ,పదవ తరగతి పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణతకు ఉపాధ్యాయులందరూ కృషి చేయాలని ఆయన అన్నారు.

## రేపు నూకాంబిక అమ్మవారి దర్శనాలు నిలిపివేత

అనకాపల్లి మార్చి 1 (ప్రభాత వార్త)



ఈనెల 3 తేదీన సంపూర్ణ చంద్రగ్రహణం ఉన్న నేపథ్యంలో అనకాపల్లి శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయం 3 తేదీ ఉదయం 10 గంటల నుండి అమ్మవారి దర్శనాలు నిలిపివేయబడుతున్నాయని ఆలయ కమిటీ చైర్మన్ పీలా నాగ శ్రీనివాస్, ఆలయ కార్య నిర్వహణ అధికారి వై శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి 4 తేదీ బుధవారం అమ్మవారి ఆలయంలో సంప్రోక్షణ అనంతరం యధావిధిగా అమ్మవారి దర్శనాలు కొనసాగుతాయని తెలిపారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారమే సంఘం లక్ష్యం: "దెందుకూరి"





నక్కపల్లి, ప్రభాతవార్త

పంచాయతీరాజ్ మినిస్ట్రియల్ ఉద్యోగుల అసోసియేషన్ ఏకైక లక్ష్యం ఉద్యోగుల సమస్యల పరిష్కారమేనని ఉమ్మడి విశాఖ జిల్లా మినిస్ట్రియల్ ఉద్యోగుల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దెందుకూరు సీతారామరాజు పిలుపునిచ్చారు. విజయనగరం జిల్లా పంచాయతీరాజ్ మినిస్ట్రీ రియల్ ఉద్యోగుల సంఘం కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని ఉద్యోగుల సమస్యలపై మాట్లాడారు. అనంతరం విజయనగరం జిల్లా కౌన్సిల్ నాయకత్వం ఉమ్మడి విశాఖ జిల్లా పంచాయతీరాజ్ మినిస్ట్రీ రియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు సత్తిబాబు తో పాటు దెందుకూరి సీతారామరాజు లను ఘనంగా సత్కరించారు.





## ఇంటి పన్నులు వసూలు ప్రక్రియలో స్పెషల్ డ్రైవ్.

### డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ



( ఎస్ రాయవరం మార్చి1 ప్రభాత వార్త )

మండలంలోని పలు గ్రామాల్లో ఇంటి పన్నులు వసూలు ప్రక్రియలో భాగంగా డిప్యూటీ ఎంపిడిఓ బంగారు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. దార్ల పూడి.. చిన గుమ్ములూరు.. తిమ్మాపురం.. కోరు ప్రోలు గ్రామ పంచాయతీలలో జరుగుతున్న ఇంటి పన్నులు వసూలు ప్రక్రియను ఆయన పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. మండలంలో 28 గ్రామ పంచాయతీలలో వసూలు చేయాల్సిన ఇంటి పన్నులు మొత్తం.. 25499134 రూపాయలు కాగా.. ఇప్పటి వరకూ 12646557 రూపాయలు వసూలు జరిగిందని.ఇంటి పన్నులు సకాలంలో వసూలు చేసే లక్ష్యంతో ప్రతీ రోజూ రాష్ట్ర.. జిల్లా స్థాయి అధికారులు సమీక్ష చేస్తున్నారని.పూర్తి స్థాయిలో ఇంటి పన్నులు వసూలు చేయడం ద్వారా గ్రామ పంచాయతీల ఆర్థిక వనరులు పెంచుకోవచ్చునన్నారు . గ్రామ పంచాయతీలలో శానిటేషన్.వీధి లైట్లు మరియు త్రాగు నీరు సరఫరా మొదలైన కనీస వసతుల కల్పన కోసం ఇంటి పన్నులు ఉపకరిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ప్రసాద్. గంగరాజు. సత్యనారాయణ.. సాయిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలను బాగా చదివించండి.. నా వంతు సహాయం అందిస్తా

### సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ

అనకాపల్లి రూరల్ మార్చి 1,(ప్రభాత వార్త)



మీ పిల్లలను బాగా చదివిస్తే నా వంతు సహాయం అందిస్తానని సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ భరోసా కల్పించారు. శ్రీ చౌడేశ్వరి దేవాంగ సంక్షేమ సంఘం అనకాపల్లి వారి దేవాంగ కుల కుటుంబ సభ్యుల ఆత్మీయ కలయిక ఎంతో వైభవంగా శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానం సమీపంలో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో విద్య చాలా కీలకమన్నారు. ప్రతీ కులంలో, సమాజంలో విద్య నభ్యసించిన యువత ఉన్నప్పుడు ఆ కులం, సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యా, వైద్యం విషయంలో మన సంఘం చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. పేద విద్యార్థులకు మా వంతు సహాయం చేయడానికి మేము, మా సంఘ సభ్యులు ఎప్పుడూ ముందుకుంటాము అని వాగ్దానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పు సత్యనారాయణ, శీలా వెంకట రమణా రావు, కొమ్మన లక్ష్మణ రావు పాల్గొన్నారు. సంఘ గౌరవ అధ్యక్షులు ముప్పన సుబ్రహ్మణ్యం, అధ్యక్షులు రెడ్డి వర ప్రసాద్, కార్యదర్శి బూడిద నాగేశ్వర రావు సంఘ సభ్యులు, సుమారు 2,000 మంది దేవాంగ కుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

## అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### నూతనంగా నిర్మించిన తారు రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే రాజు.. గ్రామ అభివృద్ధికి తోడ్పడతానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే...



బుచ్చయ్య పేట మార్చి 1 ప్రభాతవార్త

మండలంలోని ఎర్రవాయి ప్రాంతం నుండి మండల కేంద్రం బుచ్చయ్యపేట కు ప్రధాన రహదారిగా ఉన్న చింతపాక పెదమదిన రోడ్డు ను స్థానిక శాసనసభ్యులు కే ఎస్ ఎన్ఎస్ రాజు ప్రారంభించారు. దాంతోపాటు గ్రామం నుండి చింతపాక మెయిన్ జంక్షన్ బస్టాప్ వరకు గ్రామ మాజీ వైస్ సర్పంచ్ తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షులు కలిమి శ్రీను సుమారు రెండు లక్షల రూపాయల తన సొంత నిధులతో వీధిలైట్లు ఏర్పాటు చేయగా వాటిని కూడా ఎమ్మెల్యే రాజు చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలిమి శ్రీను గ్రామ అభివృద్ధి కొరకు నిరంతరం కృషి చేస్తున్నాడని తన సొంత నిధులను వెచ్చించి వీధిలైట్లు ఏర్పాటు చేసిన శ్రీనును అభినందించారు. ఈ సందర్భంగా కలిమి శ్రీను మాట్లాడుతూ గ్రామంలో ప్రధానంగా వీధి కాలువలు, అమ్మవారి ఆలయ పునర్నిర్మాణం, నూతన పెన్షన్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీను కోరిన విధంగా గ్రామ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని, గ్రామాల్లో ప్రసిద్ధి చెందిన పైడితల్లమ్మ అమ్మవారి ఆలయం నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన చేసి ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని అదేవిధంగా గ్రామంలో వీధి కాలువలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

### చనిపోయిన కార్యకర్త కుటుంబానికి చెక్కు అందజేత...

ఇటీవల చింతపాక గ్రామానికి చెందిన సిగిరెడ్డి సత్తిబాబు అనే తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త ప్రమాదవశాత్తు బైక్ ప్రమాదంలో మరణించడంతో ఆయన కుటుంబానికి తెలుగుదేశం పార్టీ తరపున ఐదు లక్షల రూపాయల ప్రమాద భీమ చెక్కును మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే రాజు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు తమరాన సింహాద్రి అప్పన్న, విశాఖ డైరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, మాజీ జడ్పిటిసి గోకివాడ కోటేశ్వరరావు, తురకలపూడి పి ఎస్ సి ఎస్ అధ్యక్షులు సత్యనారాయణ, డిసిసిబి డైరెక్టర్ అప్పలనాయుడు, సీతయ్యపేట గ్రామ సర్పంచ్ వజ్రపు ఇందిరా శ్రీనివాస్ తోపాటు పలువురు గ్రామ సర్పంచ్లు, అధికారులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి అండగా నిలిచిన వైసిపి నేత : కె యం నాయుడు

అనకాపల్లి మార్చి 1 (ప్రభాత వార్త)



పట్టణంలోని అరుంధతి నగర్, 80వ వార్డుకు చెందిన వంతల ప్రసన్న కుమారి, వంతల రాజమ్మ, వంతల శ్రీలక్ష్మి, వంతల వెంకటేష్ ఇద్దరు చిన్నపిల్లలు దర్శనార్థం కాంచి పురంకు వెళ్లారు. అక్కడ రైల్వే ప్రయాణ సమయంలో వారి లగేజ్ మొత్తాన్ని దొంగలు అపహరించడంతో కుటుంబం తీవ్ర ఆందోళనకు గురైంది.ఈ విషయాన్ని రైల్వే అధికారులు తెలియ జేయడంతో, కుటుంబ సభ్యులు పరిస్థితిని వివరించారు. లగేజ్ మిస్సింగ్ విషయంపై అవసరమైన ప్రక్రియలు పూర్తి చేస్తే మాత్రమే వస్తువులు తిరిగి అందిస్తామని సంబంధిత అధికారులు తెలిపారు. నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్ ద్వారా విషయం తెలుసుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 80వ వార్డు ఇంచార్జ్ కె యం నాయుడు వెంటనే స్పందించి, బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పడంతో పాటు అవసరమైన సహాయం అందించారు. ఆర్థికంగా కష్టాల్లో ఉన్న ఆ కుటుంబానికి ఆయన చేయూతనందించి, సమస్య పరిష్కారానికి ముందుండి చర్యలు తీసుకున్నారు. పాడేరుకు చెందిన ఈ కుటుంబం గత 8 సంవత్స రాలుగా అనకాపల్లిలో స్థిరపడి జీవనం సాగిస్తోంది. కష్టకాలంలో వారికి అండగా నిలిచిన కె యం నాయుడు సేవాభావం స్థానికంగా ప్రశంసలు అందుకుంటోంది. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న బాధితులకు తక్షణ సహాయం అందిస్తూ, అవసరమైన డబ్బులను ఇవ్వడం ద్వారా ఆయన మానవత్వాన్ని చూపించారు. ఇలాంటి సందర్భాల్లో ప్రజలకు అండగా ఉండటమే నిజమైన నాయకత్వమని కె ఎం నాయుడు నిరూపించారు

## ఎముకలు పట్టుత్వాన్ని కాపాడుకోవాలి :వయోవృద్ధులకు డాక్టర్ సంపత్ హితవు

అనకాపల్లి, మార్చి 1, (ప్రభాతవార్త)





ఎముకలు పట్టుత్వాన్ని కాపాడుకుంటే వయోభారంలో ప్రమాదాలను నివారించుకునేందుకు దోహదపడుతుందని ప్రముఖ కీళ్ల వైద్య నిపుణులు వినకోట సంపత్ హితవు పలికారు. స్థానిక గీత ఆసుపత్రిలో ప్రముఖ కంటి వైద్య నిపుణులు వి కె గుప్తా , ప్రముఖ కీళ్ల వైద్య నిపుణులు వికె సంపత్ పర్యవేక్షణలో ఆదివారం ఎముకలు పట్టుత్వ నిర్ధారణ, విటమిన్ డి తదితర రోగాల నిర్ధారణ ఉచిత వైద్య శిబిరం జరిగింది. దాదాపు 200 మంది ఈ శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు పొందారు. ఎముకలు పట్టుత్వం లేనివరిని గుర్తించి తగు వైద్య సలహాలను డాక్టర్ సంపత్ అందించారు. 50 ఏళ్లు పైబడిన స్త్రీ పురుషులు విధిగా ఎముకలు పట్టుత్వ పరీక్షలు చేసుకోవాలన్నారు. సూర్య రశ్మి తగలకపోవడం వల్ల బి విటమిన్ లోపిస్తుందని తద్వారా ఎముకలు పట్టుత్వాన్ని కోల్పోతారని వయోభారంలో తనంతట తానుగా పడిపోయి ప్రమాదాలు గురవుతున్నారని తెలిపారు. ముందుగా ఎముకలు పట్టుత్వం కొరవడిందని తెలుసుకుంటే తగు రీతిలో వైద్యం పొంది ఈ లోపం నుండి బయటపడవచ్చు నని తెలిపారు. అనకాపల్లి లాడ్జి రామలింగ,(ఫ్రీ మేషన్స్) ఆధ్వర్యంలో ఆల్కెం మందులు కంపెనీ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో లాడ్జి రామలింగా సంస్థ సభ్యులు అనిల్, ఎస్కే బిక్కు మస్తాన్ వలి, సోమశేఖర్, అనకాపల్లి వాకర్స్ క్లబ్ కార్యదర్శి రాపేటి నారాయణరావు, టి ఎస్ అప్పారావు, ఎస్ఏ దావుద్ ఆలీ, ఇబ్రహీం తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. నిర్వాహక సంస్థలు ప్రముఖ కీళ్ల వైద్యులు వి కే సంపత్ ను ఘనంగా సత్కరించారు.